ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 26.07.2024 | సంపుటి : 11 సంచిక : 16 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.APTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## ఆరు గ్యారెంటీల అమలే లక్ష్యంగా

# బడ్జెట్

## వ్యవసాయానికి పెద్దపీట

## హైదరాబాద్ అభివృద్ధికి ప్రాధాన్యత



అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

| | |
|---|---|
| మొత్తం బడ్జెట్ | రూ. 2,91,159 కోట్లు |
| ఆర్థిక లోటు | రూ. 49,255.41 కోట్లు |
| ప్రాథమిక లోటు | రూ. 31,525.63 కోట్లు |
| రెవెన్యూ మిగులు | రూ. 297.42 కోట్లు |

- గత ప్రభుత్వ విధ్వంసం నుంచి విజయతీరాలకు
- ఆర్థిక లోటు నుంచి కోలుకునే దిశగా అడుగులు
- మరింత ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి కృషి
- మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధితో మార్పు
- పలు మార్గాల్లో మెట్రో విస్తరణకు నిధులు

**హైదరాబాద్(జనంసాక్షి):**సంక్షేమ రంగాలను పరుగు పెట్టించేలా..వ్యవసాయాన్ని గాడిలో పెట్టించేలా...అనేక రంగాలను భ్రష్టు పట్టించి, అప్పులు చేసిన తెలంగాణను తలెత్తుకునేలా చేసేలా...కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి వార్షిక బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీకి సమర్పించింది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో దివాళా తీయించిన క్రమంలో మళ్లీ పట్టాలకు ఎక్కించేలా ప్రభుత్వం పూనుకుందని చెబుతూ ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మండలిలో మంత్రి శ్రీదర్ బాబు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఎన్నికలు ముగిసి, కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరవాత.. కేటాయింపులు ఏవీ లేకపోయిన సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆరుగ్యారెంటీల అమలు, ఇచ్చిన హామీలు పూర్తి చేయడం, అన్నిరంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రకటిస్తూ..డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో పూర్తిస్థాయి పద్దును ప్రవేశపెట్టారు. రూ.2,91,159 కోట్లతో బడ్జెట్‌ను

మిగతా 2లో..

**కేటాయింపులు:**

- వ్యవసాయానికి రూ.72,659 కోట్లు
- ఉద్యానశాఖకు రూ.737కోట్లు
- పశుసంవర్ధశాఖకు రూ.1,980కోట్లు
- సిలిండర్ పథకానికి రూ. 723కోట్లు
- గృహజ్యోతికి రూ.2,418కోట్లు
- ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.3836కోట్లు
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.29,816 కోట్లు
- ఆర్‌ఆర్‌ఆర్ కు రూ.1,525 కోట్లు
- స్త్రీ, శిశు సంక్షేమానికి రూ. 2,736 కోట్లు
- ఎస్సీ సంక్షేమం రూ.33,124కోట్లు
- ఎస్టీ సంక్షేమం రూ.17,056కోట్లు
- మైనార్టీ సంక్షేమం రూ.3,003కోట్లు
- బీసీ సంక్షేమం రూ.9,200 కోట్లు
- వైద్య, ఆరోగ్యం రూ. 11,468 కోట్లు
- ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు
- అడవులు, పర్యావరణం రూ.1,064 కోట్లు
- పరిశ్రమల శాఖకు రూ. 2,762 కోట్లు
- ఐటీ శాఖకు రూ.774 కోట్లు
- నీటిపారుదలకు రూ.22,301 కోట్లు
- విద్యకు రూ.21,292 కోట్లు
- హోంశాఖకు రూ.9,564కోట్లు
- రోడ్లు, భవనాల శాఖకు రూ.5,790

## బడ్జెట్‌లో అన్నిరంగాలను విస్మరించారు

- బడ్జెట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్దిష్ట విధానం లేదు
- వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ పాలసీలపై అస్పష్టత
- మీడియా పాయింట్ వద్ద కేసీఆర్ విమర్శలు
- ఓటమి తరువాత తొలిసారి అసెంబ్లీకి హాజరు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ పాలసీలపై నిర్దిష్టమైన విధానం లేదని భారాస అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ విమర్శించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన తొలిసారి అసెంబ్లీకి హాజరయ్యారు. కెసిఆర్ ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తున్న వారి ఉత్కంఠకు తెరదించుతూ సమావేశాలకు వచ్చారు. బడ్జెట్ ప్రసంగం తరవాత అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. భారాస హయాంలో మేం రెండు పంటలకు రైతుబంధు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ఎగ్గొడతామని చెబుతోంది. మేం రైతులకిచ్చిన డబ్బును దుర్వినియోగం చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇది పూర్తిగా రైతు శత్రు ప్రభుత్వమని తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు చేయలేదు. విద్యుత్, నీటి సరఫరా,

మిగతా 2లో..



## గ్యారెంటీల అమలు మరిచిన బడ్జెట్


బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్(జనంసాక్షి):**రాష్ట్ర బడ్జెట్ గ్యారెంటీలను గంగలో కలిపిందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని, ఇది పూర్తిగా కోతల, ఎగవేతల బడ్జెట్ ఆయన మండిపడ్డారు. ఈ

మిగతా 2లో..

## నీట్ తుది ఫలితాలు విడుదల

ప్రకటించిన ఎన్టీఏ • 61 నుంచి 17కు తగ్గిన టాప్ ర్యాంకర్ల సంఖ్య



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నీట్ యూజీ 2024 పరీక్ష వివాదం వేళ ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఫిజిక్స్ విభాగంలోని ఓ ప్రశ్నకు ఒకటే సమాధానం ఉంటుందని నిపుణుల కమిటీ తేల్చడంతో దాని ఆధారంగా ఫలితాలను సవరించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పరీక్ష తుది ఫలితాలను ఎన్‌టీఏ గురువారం విడుదల చేసింది. ఇందులో 4.2లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులను కోల్పోయారు. దీంతో టాప్ ర్యాంక్ సాధించిన వారి సంఖ్య కూడా 61 నుంచి 17కు తగ్గింది. సవరించిన ఫలితాలను విద్యార్థులు ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఫిజిక్స్ విభాగంలోని అటామిక్ థియరీకి సంబంధించిన 29వ ప్రశ్నకు రెండు సమాధానాలు ఉన్నాయని, వాటిలో దేన్ని ఎంపిక చేసినా... మార్కులిచ్చారని ఆరోపిస్తూ ఓ అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. ముగ్గురు నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, నివేదిక అందించాలని ఐఐటీ-దిల్లీని ఆదేశించింది. ఈ క్రమంలోనే సంబంధిత ప్రశ్నకు ఒక సమాధానమే ఉందని, రెండు లేవని... ఆప్షన్ 4 ఒక్కటే సమాధా నమని నిపుణుల కమిటీ కోర్టుకు విన్నవించింది. దాంతో ఆప్షన్ 4ను ఎంచుకున్న అభ్యర్థులకే మార్కులు ఇవ్వాలంటూ నిర్వాహకులను ఆదేశించింది. ఫలితంగా మరోసారి రివైజ్డ్ ర్యాంకులను విడుదల చేయడం అనివార్యంగా మారింది. తాజాగా ఎన్‌టీఏ తుది ఫలితాలను వెల్లడించగా.. సుమారు 4.2లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులు కోల్పోయారు. దీంతో మెరిట్ లిస్ట్ మారింది. అంతేకాదు.. 720కి 720 స్కోరు సాధించిన 61 మందిలో ఈ ప్రశ్నకు మార్కులు పొందిన వారు 44 మంది ఉన్నారు. స్కోరు కూడా మారడంతో టాప్ ర్యాంకర్ల జాబితా 17కు తగ్గింది.

## విభజన హామీలు నెరవేర్చండి

ప్రధాని మోడీకి తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల లేఖ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**విభజన హామీలను నెరవేర్చాలని ప్రధాని మోదీకి తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు గురువారం లేఖ రాశారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని అన్నారు. పునర్విభజన చట్టం ప్రకారం.. ఐటీఐఆర్, ఐఐఎం, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, తెలంగాణలోని మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు జాతీయ హోదా, ముఖ్యంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదాపై బడ్జెట్ లో ప్రస్తావనే లేదన్నారు. తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాలో తొమ్మిది జిల్లాల్లో వెనకబడని ప్రాంతాలు చాలా ఉన్నాయి.. వాటి అభివృద్ధికి నిధుల విషయంలో తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఈ లేఖలో తెలిపారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోయిన ఆంధ్రప్రదేశ్ కు నిధులు కేటాయించారు. అదే తెలంగాణకు తీరని

మిగతా 2లో..



## నిండుకుండల్లా ప్రాజెక్టులు

జూరాల జలాశయానికి భారీగా వరద
ప్రాజెక్టు 42 గేట్లు ఎత్తి నీటి విడుదల

**మహబూబ్‌నగర్(జనంసాక్షి):** గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తింది. దీంతో అధికారులు ప్రాజెక్టు 42 గేట్లు ఎత్తివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2.06 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. జలాశయం నుంచి 1.97 లక్షల క్యూక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో స్పిల్‌వే ద్వారా 1.69 లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 24,201 క్యూసెక్కులు, నెట్టెంపాడు లిఫ్ట్‌కు 1500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్‌కు 1300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిట్టం 318.51 మీటర్లు కాగా ఇప్పుడు 316.71 మీటర్ల వద్ద నీరు ఉన్నది. అదేవిధంగా ప్రాజెక్టులో 9.65 టీఎంసీల నీటి నిల్వకుగాను ప్రస్తుతం 6.23 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఇక ఎగువన మహారాష్ట్రలో ఉన్న ఆల్మట్టి నుంచి 2.25 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తున్నది. ఉదయం 10.30 గంటల వరకు

మిగతా 2లో..



## ఘోర బోటు ప్రమాదం

15 మంది మృతి.. 150 మంది గల్లంతు

ఆఫ్రికాలోని మారిటానియా సముద్రతీరంలో ఘటన

8లో

## కాళేశ్వరంను విఫల ప్రాజెక్టుగా చూపేందుకు కుట్రలు

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం.. అసెంబ్లీలో ఎండగడతాం: కేటీఆర్



**కరీంనగర్(జనంసాక్షి):** ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం అని, ఈ ప్రాజెక్టుతో తెలంగాణను ధాన్యాగారంగా మార్చామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి లోయర్ మానేరు డ్యామ్‌ను కేటీఆర్ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ. కాళేశ్వరం ప్రాజెక్టు విఫల ప్రాజెక్టుగా చూపే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేస్తోందని మండిపడ్డారు. గత ఎనిమిది నెలలుగా కాళేశ్వరం నుంచి నీరు లిఫ్ట్ చేయకుండా పంట పొలాలను ఎండబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు."కాళేశ్వరం నుంచి ప్రతి

మిగతా 2లో..



## మాదాపూర్‌లో రేవ్‌పార్టీ భగ్నం

**హైదరాబాద్(జనంసాక్షి):** మాదాపూర్ సైబర్‌టవర్ సమీపంలో రేవ్ పార్టీని రంగారెడ్డి జిల్లా ఎస్‌టీఎఫ్ పోలీసులు భగ్నం చేశారు. పట్టుబడ్డ వారి నుంచి రెండు లక్షల రూపాయల విలువ చేసే విదేశీ మద్యం,1 గ్రాము కొకైన్,2 గ్రాముల ఎండీఎంఎ డ్రగ్,0.68 గ్రాముల ఓజీ కుష్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేంకు వివరాలను శేరిలింగంపల్లి ఆబ్కారీ శాఖ పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆ శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషి వెల్లడించారు. జాయింట్ కమిషనర్ తెలిపిన వివరాల ప్రకారం బేగంపేట్‌కు చెందిన రియల్టర్ నాగరాజు

మిగతా 2లో..

## ఖనిజాలపై, గనులపై రాష్ట్రాలు రాయల్టీ విధించొచ్చు

సుప్రీంలో కేంద్రానికి ఎదురుదెబ్బ



**దిల్లీ(జనంసాక్షి):** ఖనిజాలు, గనులపై రాష్ట్రాలు రాయల్టీ విధించే విషయంలో సుప్రీంకోర్టులో కేంద్రానికి ఎదురుదెబ్బ తగిలింది. ఖనిజాలు, గనులు కలిగిన భూములపై రాయల్టీ విధించే హక్కు రాష్ట్రాలకు ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు 8:1తో విస్తృత ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. ఖనిజాలు సమృద్ధిగా కలిగిన ఒడిశా, ఝార్ఖండ్, పశ్చిమ్ బెంగాల్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఈ తీర్పు వల్ల ప్రయోజనం చేకూరనుంది. ఇప్పుడు ఆ రాష్ట్రాలు తమ భూభాగంలో కార్యకలాపాలు నిర్వహిస్తోన్న సంస్థలపై అదనంగా మొత్తాన్ని వసూలు చేయడానికి వీలుకలగనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తాజా తీర్పు వెలువరిస్తూ.. రాయల్టీ, ట్యాక్స్ ఒకటి కాదని వ్యాఖ్యానించింది. అయితే తొమ్మిది మంది బెంచ్‌లో ఎనిమిది మంది ఒకే రకమైన తీర్పు ఇవ్వగా.. జస్టిస్ బీవీ నాగరత్న మాత్రం భిన్నమైన తీర్పు ఇచ్చారు. గనులు, ఖనిజాల నియంత్రణ, అభివృద్ధిపై పార్లమెంటుకు గంపగుత్త అధికారాన్ని రాజ్యాంగం కట్టబెట్టలేదని గత విచారణలో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. రాష్ట్రాలకూ వాటిపై నియంత్రణాధికారం, అభివృద్ధి హక్కులుంటాయని తేల్చి

మిగతా 10లో..

## దేశం కోసమే తప్పుకున్నా..


యువతకు కాగడా అందించే తరుణం
బరినుంచి వైదొలగడంపై బైడెన్ వివరణ



**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్ష ఎన్నికలు-2024 రేసు నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించిన అనంతరం ప్రెసిడెంట్ జో బిడెన్ తొలిసారి బుధవారం స్పందించారు. అమెరికా మార్గదర్శకత్వాన్ని యువతరానికి అందిస్తున్నానంటూ ఆయన వ్యాఖ్యానించారు. యువ గళాలకు కాగడాను అందించాల్సిన తరుణం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఈ మేరకు అమెరికన్లను ఉద్దేశించి 'ఓవల్ ఆఫీస్' నుంచి ఆయన

మిగతా 2లో..

## రాష్ట్రపతిభవన్‌లో పలు వేదికల పేర్లు మార్పు



ఆగ్రహం వ్యక్తం చేసిన విపక్షాలు

**దిల్లీ(జనంసాక్షి):** రాష్ట్రపతి భవన్ లో రెండు హాల్స్ పేర్లు మారాయి. వివిధ కార్యక్రమాలకు వేదికగా ఉంటున్న దర్బార్ హాల్, అశోక్ హాల్‌ను ఇకనుంచి గణతంత్ర మండపం, అశోక్ మండపంగా పిలవనున్నారు. ఈ మేంకు ప్రెసిడెంట్ సెక్రటేరియట్ వెల్లడించింది."జాతీయ

మిగతా 10లో..

# ఆరు గ్యారెంటీల అమలే లక్ష్యంగా బడ్జెట్



సభ ముందుకు తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనిలో మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా చెప్పారు. పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.35,208.44 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా 26.216.28 కోట్లు, కేంద్రం గ్రాంట్లు 21,636.15 కోట్లుగా పేర్కొన్నారు. ఈ ఏడాది రూ.57, 112 కోట్ల అప్పులు తీసుకోవాలని ప్రతిపాదించారు. నిజాం షుగర్స్‌ను తిరిగి ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికే సింహభాగం ప్రకటించారు. రూ.72,659 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇది రైతుల తలరాతలు మార్చే చరిత్రాత్మక నిర్ణయమన్నారు. దేశ చరిత్రలో వ్యవసాయ రంగానికి ఇది ఒక మైలురాయి అని తన ప్రసంగంలో పేర్కొన్నారు. రైతు భరోసా సహా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతామని, బడ్జెట్‌అంటే.. కేవలం అంకెల సమాహారం కాదు. విలువలు, ఆశల వ్యక్తీకరణ కూడా అంటూ ప్రకటించారు. జిల్లాల మధ్య ఆదాయ అంతరాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. అసమానతలు లేని సమసమాజ స్థాపన దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ ఏడాదిలోనే రైతు కూలీలకు రూ.12వేలు అందించే బృహత్తర కార్యక్రమం చేపడతాం అని అన్నారు. పీఎం ఫసల్ బీమా యోజనలో చేరాలని నిర్ణయించాం. రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. పైసా ఖర్చు లేకుండా పంటలకు పూర్తి భద్రత కల్పిస్తాం. వరి రైతులకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించాం. ఆయిల్‌పామ్ రైతులకు అవసరమైన సాయం అందిస్తాం. 2024-25 సంవత్సరానికి రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో ఆ పంట సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 77,857 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరగ్గా.. 23,131 ఎకరాలకు అనుమతులిచ్చాం' అని భట్టి విక్రమార్క చెప్పారు.

**విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం**

విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రాత్మక నగరం హైదరాబాద్‌ను మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ ను గురువారం ఆయన అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి భారీగా రూ.10వేల కోట్లు కేటాయించారు. శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ.1500 కోట్లు, ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు రూ.1,525 కోట్లు, పాతబస్తీ మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు, మెట్రో వాటర్ వర్క్స్ రూ.3,385 కోట్లు, హైడ్రా సంస్థకు రూ.200 కోట్లు కేటాయించారు. హైదరాబాద్‌లో ఉద్యోగ, ఉపాధి పొందుతున్నవారికి కార్యాలయాలకు దగ్గరగా, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణాన్ని నగరం చుట్టూ ప్రోత్సహిస్తాం. ఈ టౌన్‌షిప్ లలో సరసమైన ధరల్లో పేద, మధ్యతరగతి వారికి అనుకూలమైన నివాసగృహాల నిర్మాణాలను అందించేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం మూడు ట్రాఫిక్ కారిడార్లలో మెట్రో సౌకర్యం ఉంది. వివిధ వర్గాల అవసరాలను తీర్చడంతో పాటు నగరంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో, ప్రభుత్వం 78.4 కి.మీ. పొడవున్న 5 అదనపు కారిడార్లను రూ.24,042 కోట్లతో అభివృద్ధి పరుస్తుంది. ఇందులోభాగంగా మెట్రో రైలును పాతనగరానికి పొడిగించి దానిని శంషాబాద్ విమానాశ్రయానికి అనుసంధానం చేస్తామన్నారు. ప్రస్తుతమున్న కారిడార్లను నాగోలు నుంచి ఎల్.బి.నగర్ వరకు విస్తరిస్తాం. నాగోలు, ఎల్.బి నగర్, చంద్రాయణగుట్ట స్టేషన్లను ఇంటర్ ఛేంజ్ స్టేషన్లగా అభివృద్ధి చేస్తాం. మియాపూర్ నుంచి పటాన్ చెరువుకు, ఎల్.బి.నగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని పొడిగించాలని కూడా ప్రణాళిక సిద్ధం చేశాం. హైదరాబాద్, ఔటర్ రింగ్ రోడ్డు వరకు గల ప్రాంతాలను కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తాం. ఔటర్ రింగు రోడ్డును నగర సరిహద్దుగా పరిగణిస్తాం. ఓఆర్‌ఆర్ పరిధిలో విపత్తుల నిర్వహణకు ఒక ఏకీకృత సంస్థ ఏర్పాటు. జీహెచ్‌ఎంసీ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయి. పట్టణ విపత్తులను నివారించడానికి, వాటిని ఎదుర్కొనడానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయం. ఈ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత హైదరాబాద్ విపత్తు నివారణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ చేస్తుంది. ఈ సంస్థలో ఆస్తుల పరిరక్షణకు, విపత్తుల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశామన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీ. పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం. నదీ తీర ప్రాంతంలో కొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు, పాత హెరిటేజ్ ప్రాంతాలకు కొత్త సొబగులు అద్దుతామని అన్నారు. మూసీ నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులో రిక్రియేషన్ జోన్‌లు, పాదచారుల జోన్‌లు, పీపుల్స్ ప్లాజాలు, చిల్డ్రన్స్ థీమ్ పార్కులు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌ల అభివృద్ధి. లండన్ నగరంలో ఉన్న థేమ్స్ నదీ పరివాహక అభివృద్ధి తరహాలో మూసీ అభివృద్ధి. హైదరాబాద్ నగరాభివృద్ధి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ.1,500 కోట్లు ప్రతిపాదన చేశారు. హైదరాబాద్ నగర ప్రాధాన్యం దృష్ట్యా నగరాభివృద్ధికి మరింత పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించేందుకు హెచ్‌ఎండిఎ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.3,065 కోట్లు కేటాయించారు. మౌలిక వసతుల కల్పనకు రూ.500 కోట్లు. మెట్రో వాటర్ వర్క్స్‌కి రూ.3,385 కోట్లు ప్రతిపాదన. హైడ్రాకి రూ.200 కోట్లు, ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డు కోసం రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకి రూ.500 కోట్లు, పాత నగరానికి మెట్రో విస్తరణకి రూ.500 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ కోసం రూ.50 కోట్లు కేటాయించారు. రీజనల్ రింగ్ రోడ్‌తో అభివృద్ధి మరింత వేగవంతం. ఉత్తర ప్రాంతంలోని 158.6 కి.మీ. పొడవున్న సంగారెడ్డి- తూప్రాన్ - గజ్వేల్ - చౌటుప్పల్ రోడ్డును, దక్షిణ ప్రాంతంలోని 189 కి.మీ.ల పొడవున్న చౌటుప్పల్ -షాద్ నగర్-సంగారెడ్డి రోడ్డును, జాతీయరహదారులుగా ప్రకటించడానికి వీలుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది

## బడ్జెట్‌లో అన్నిరంగాలను విస్మరించారు

గొర్రెల పంపిణీ లేదు. రైతు భరోసా గురించి ప్రస్తావనే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, వృత్తి కార్మికులను వంచించింది. రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఇది పేదల, రైతు బడ్జెట్ కాదని అన్నారు. ప్రభుత్వానికి ఒక విదానమంటూ లేదన్నారు. కథ చెప్పారు తప్ప.. బడ్జెట్ పెట్టినట్టు అనిపించలేదన్నారు. రైతు భరోసాలో అనేక ఆంక్షలు పెడుతున్నట్టు చెప్పారు. ప్రజల గొంతు కోసింది ఈ ప్రభుత్వం. దళితబంధు పథకం ప్రస్తావనే లేదు. దళితులంటే ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఇదేనా? గొర్రెల పెంపకం పథకానికి తూట్లు పొడిచారు. ఒత్తి పలకడం తప్ప భట్టి కొత్తగా చెప్పిందేమీ లేదు. రైతులను పొగిడినట్టే పొగిడి నిండా ముంచారు. బడ్జెట్ ఒట్టి డొల్ల. అన్ని వర్గాలను మోసం చేసింది. కథ చెప్పారు తప్ప.. బడ్జెట్ పెట్టినట్టు అనిపించలేదు. పేదల కోసం ఒక్క పాలసీ అయినా ప్రకటించారా? బడ్జెట్‌లో ఒక పద్దు.. పద్ధతి లేదు. బడ్జెట్‌పై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం అన్నారు. యాదవులు, మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇచ్చాం. ఈ ప్రభుత్వానికి పాలసీ లేదని అర్థమైంది. ఐటీ, పారిశ్రామిక పాలసీ ఏది? ఏ ఒక్క కొత్త సంక్షేమ పథకం ప్రకటించలేదు' అని కేసీఆర్ విమర్శించారు. ఈ బడ్జెట్‌ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. . రైతులను పొగిడినట్లే పొగిడి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. తాము ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. మత్స్యకారులకు భరోసా లేదని గొర్రెల పంపిణీ పథకాన్ని పూర్తిగా మూసివేసినట్లు కనిపిస్తోందని అన్నారు. దళిత బంధు ప్రస్తావన లేదని తెలిపారు. ఒక్క కొత్త పథకం ప్రవేశపెట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయ, పరిశ్రమల సంగతి ఏంటని ప్రశ్నించారు. రైతులను వృత్తికార్మికులను ప్రభుత్వం వంచించిందని మాజీ సీఎం కేసీఆర్ విమర్శించారు. ఆయారంగాల అభివృద్ధికి ఏం చర్యలు తీసుకుంటు న్నారో విధివిధానాలు లేవన్నారు. ఉన్న పథకాలను మూసివేస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. ఓడిన తర్వాత.. ప్రతిపక్ష నేత హోదాలో బ్జడెట్ సమావేశానికి హాజరైన కేసీఆర్.. మీడియా కేవలం రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడి.. తాను చెప్పాలనుకున్నది చెప్పి వెళ్లిపోయారు.

## కాళేశ్వరంను విఫల ప్రాజెక్టుగా చూపేందుకు కుట్రలు

రోజు లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వృథా పోతున్నా లిఫ్ట్ చేయడం లేదు. ఈ ఏడాది కేవలం 45శాతం వర్ష పాతం నమోదు అయిందని అధికారులు చెబుతున్నారు. లోయర్ మానేరు, మిడ్ మానేరు సహా ఎండిపోయిన ప్రాజెక్టులను పరిశీలించేందుకే మేం ఇక్కడికి వచ్చాం. 10 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకొని మేడిగడ్డ ఠీవీగా నిలబడింది. లక్షలాది మంది రైతుల ప్రయో జనాలను సీఎం రేవంత్‌రెడ్డి ఫణంగా పెట్టి పంట పొ లాలు ఎండబెడుతున్నారు.ఎల్‌ఎండీ, అన్నపూర్ణ రిజర్వా యర్, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ నింపితే రైతుల్లో భరోసా ఏర్పడుతుంది. నీరు ఉన్నప్పుడు కాళేశ్వ రం ద్వారా ప్రాజెక్టులు నింపకుండా వర్షం పడలేదనే సాకు చూపెడుతున్నారని అనిపిస్తోంది. ఇలాంటి ఇబ్బం దులు ఉండకుండా రాష్ట్ర ప్రభుత్వానికి కాళేశ్వరం ద్వారా నీరు నింపాలని సూచిస్తున్నాం. కన్నెపల్లి దగ్గర పంపు ఆ న్ చేస్తే రిజర్వాయర్లు నిండుతాయి. ఎస్సార్‌ఎస్పీలో 90 టీఎంసీలకుగానూ కేవలం 24 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఎల్‌ఎండీ, మిడ్ మానేరులో కేవలం 5 టీఎంసీలే ఉంది. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నింపితే రైతుల అవసరాలతోపాటు హైదరాబాద్ సహా ఇతర జి ల్లాల తాగునీటి అవసరాలు తీరుతాయి.కేసీఆర్‌ను బ ద్నాం చేయాలని 8 నెలలుగా ప్రభుత్వం చేసిన కుట్రలు ప్రజలు గమనిస్తున్నారు. మేడిగడ్డ మేడిపండు అని, రూ.లక్షల కోట్లు కొట్టుకుపోయాయని చేసిన ప్రచారాలన్నీ ఉత్తివేనని తేలింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎండుతున్న పంటలు.. మండుతున్న రైతుల గుండెల బాధలను శాసనసభలో ఎండగడతాం. కేసీఆర్ ఆదేశాలతో గంగుల కమలాకర్ సూచనలతో ప్రాజెక్టు సందర్శనకు వచ్చాం. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ కుట్రలను ఎండగడతాం. రైతుల జీవితాలతో చెలగాటమాడవద్దని రేవంత్‌రెడ్డికి సూచిస్తున్నా. శుక్రవారం కన్నెపల్లి, మేడిగడ్డను సందర్శిస్తాం"అని కేటీఆర్ తెలిపారు.

## విభజన హామీలు నెరవేర్చండి

అన్యాయం చేశారని కాంగ్రెస్ ఎంపీలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ కు నిధులు ఇవ్వడంలో మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. కానీ తెలంగాణకు నిధులు ఇవ్వకపోవడం చాలా అన్యాయం అన్నారు. తెలంగాణలో ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలని, విభజన హామీలను నెరవేర్చాలని బడ్జెట్ కు ముందు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాలా సార్లు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిశారు. అయినప్పటికీ కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నిధులను కూడా కేటాయించలేదని కాంగ్రెస్ ఎంపీలు లేఖలో తెలిపారు. ప్రధాని మోదీ స్పందించి విభజన హామీలను నేరవేర్చాలని.. తెలంగాణకు నిధులు కేటాయించాలని లేఖలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు తెలిపారు.

## నీట్ యూజీ రివైజ్డ్ ఫలితాల విషయంలో అయోమయం..

**దిల్లీ(జనంసాక్షి):**నీట్ యూజీ 2024 పరీక్ష సవరించిన ఫలితాలు విషయంలో అయోమయం చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం ఈ ఫలితాలు వచ్చాయంటూ జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి.దీనికితోడు జాతీయ పరీక్షల సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లోనూ 'నీట్ రివైజ్డ్ స్కోర్ కార్డు' పేరుతో లింక్‌ను అందుబాటులో ఉంచింది. అయితే, ఆ లింక్ ఓపెన్ కాకపోవడంతో విద్యార్థులు ఫలితాలు తెలుసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. ఈలోగా రివైజ్డ్ స్కోర్ కార్డుల్ని ఇంకా విడుదల చేయలేదని, ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో ఉన్నది పాత లింక్ అని కేంద్ర విద్యాశాఖ పేర్కొంది. ఆ లింక్‌ను స్కోర్ కార్డులు ప్రకటించినట్లు పొరపాటుగా భావించారని విద్యాశాఖ అధికార ప్రతినిధి తెలిపారు. అధికారిక సమాచారం వచ్చేవరకు వేచి చూడాలని కోరారు. రివైజ్డ్ ఫలితాలు వెల్లడైతే.. గతంలో 720/720 మార్కులు పొందిన వారితో పాటు మొత్తం ఈ పరీక్ష రాసిన 23లక్షల మందికి పైగా అభ్యర్థుల ర్యాంకులు మారే అవకాశం ఉంది.నీట్ పరీక్షలో కొనసాగిన తీవ్ర వివాదంపై ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఫిజిక్స్ విభాగంలోని ఓ ప్రశ్నకు ఒకటే సమాధానం ఉంటుందని నిపుణుల కమిటీ తేల్చడంతో దాని ఆధారంగా ఫలితాలను సవరించాలని ఆదేశించింది. ఫిజిక్స్ విభాగంలోని అటామిక్ థియరీకి సంబంధించిన 29వ ప్రశ్నకు రెండు సమాధానాలు ఉన్నాయని, వాటిలో దేన్ని ఎంపిక చేసినా... మార్కులిచ్చారని ఆరోపిస్తూ ఓ అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. ముగ్గురు నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, నివేదిక అందించాలని ఐఐటీ-దిల్లీని ఆదేశించింది. ఈ క్రమంలోనే సంబంధిత ప్రశ్నకు ఒక సమాధానమే ఉందని, రెండు లేవని... ఆప్షన్ 4 ఒక్కటే సమాధానమని నిపుణుల కమిటీ కోర్టుకు విన్నవించింది. దాంతో ఆప్షన్ 4ను ఎంచుకున్న అభ్యర్థులకే మార్కులు ఇవ్వాలంటూ ధర్మాసనం పరీక్ష నిర్వాహకులను ఆదేశించింది. ఫలితంగా మరోసారి రివైజ్డ్ ర్యాంకులను విడుదల చేయడం అనివార్యంగా మారింది. రివైజ్డ్ ఫలితాల ప్రకారం.. టాప్ ర్యాంకర్ల సంఖ్య గతంతో పోలిస్తే భారీగానే తగ్గనుంది.

## ఆపరేషన్ సర్ప్ వినాశ్ 2.0

**- ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా ఇండియన్ ఆర్మీ చర్యలు**

**జనంసాక్షి:**ఉగ్రవాదుల ఆగడాలను అరికట్టేందుకు భారత సైన్యం సిద్ధమైంది. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రకదలికలు పెరిగిన తరుణంలో ఇండియన్ ఆర్మీ ప్రత్యేక ఆపరేషన్‌ను చేపట్టింది. ముఖ్యంగా 55 మంది ఉగ్రవాదులను హతమార్చడమే లక్ష్యంగా 'ఆపరేషన్ సర్ప్ వినాశ్ 2.0 ను ప్రారంభించింది. గత 21 ఏళ్లలో భారత్ ఆర్మీ చేపట్టిన అతిపెద్ద ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ ఇదే. ప్రధాని కార్యాలయమే ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తుంది.

## గ్యారెంటీ అమలు మరిచిన బడ్జెట్

బడ్జెట్ లో ఎన్నికల వాగ్దానాలను గాలికి వదిలేసి ప్రజలను వంచించారని ఆరోపించారు. ఇది డిక్లరేషన్‌లను బుట్టదాఖలు చేసిన దోకేబాజ్ బడ్జెట్ అని ఫైరయ్యారు. ఈ బడ్జెట్ కు ఒక విధానంగానీ, విషయంగానీ, విజన్‌గానీ లేదని.. కేవలం పథకాల పేర్ల మార్పులతో ఏమార్చారని కేటీఆర్ విమర్శించారు. ఆడబిడ్డలకు అన్యాయం జరిగిందని, అన్నదాతలకు సున్నం పెట్టారని ఆరోపించారు. దళితులను దగా చేశారని, గిరిజనులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనారిటీలకు ఇచ్చిన మాటలన్నీ నీటి మూటలయ్యాయని మండిపడ్డారు.

## కమలా హారిస్‌కు పాలించే అర్హత లేదు..

ట్రంప్

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికాను పాలించే అర్హత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు లేదని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు.ఆమె 'తీవ్రమైన వామపక్ష ఉన్మాది' అంటూ ఘాటు పదజాలంతో విమర్శలు గుప్పించారు. ఎన్నికల రేసు నుంచి వైదొలగుతున్నట్లు బైడెన్ ప్రకటించిన తర్వాత ట్రంప్ తొలిసారి ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. డెమోక్రటిక్ పార్టీ తరఫున తదుపరి అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం ఉన్న కమలా హారిస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన ప్రసంగంలో కమలా హారిస్ పేరును ట్రంప్ దాదాపు 45 సార్లు ప్రస్తావించడం గమనార్హం."మూడున్నర సంవత్సరాలుగా బైడెన్ ప్రతీ వైఫల్యం వెనక కమలా హారిస్ ఉన్నారు. ఆమె ఒక తీవ్రమైన వామపక్ష ఉన్మాది. అధికారంలోకి వచ్చే అవకాశం ఇస్తే ఆమె ఈ దేశాన్ని సర్వనాశనం చేస్తారు. కానీ, దాన్ని మేం జరగనివ్వబోం. నేనెప్పుడూ సక్రమంగానే ఉంటాను. ఇలాంటి ప్రమాదకరమైన వ్యక్తులతో పోటీపడాల్సి వస్తే ఏం చేయగలను? అలా ఉండడం కుదరదు. మూడున్నరేళ్లలో వారు దేశానికి ఏం చేశారు. మేం అధికారంలోకి వస్తే మొదటి దఫాలో చేసినకంటే అద్భుతమైన పనులు చేసి చూపిస్తాం" అంటూ ట్రంప్ తన మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగించారు. బైడెన్ ఆరోగ్యం గురించి కమలా హారిస్ ప్రజలకు అబద్ధాలు చెప్పారని ట్రంప్ అన్నారు. దీన్ని బట్టి ఆమె ఏ విషయంలోనైనా సులభంగా అబద్ధం చెప్పగలరనే విషయం అర్థమవుతోందని విమర్శించారు. ఆమెను ఎప్పటికీ విశ్వసించలేమన్నారు. కమలా హారిస్‌కు ఓటేయడమంటే అవినీతి, అసమర్థత, బలహీనతకు మద్దతిచ్చినట్లే అవుతుందని పేర్కొన్నారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరించేందుకు ఆమె ఐరోపా దేశాలకు వెళ్లినప్పటికీ.. అది సఫలం కాలేదని చెప్పారు.



## నిండుకుండల్లా ప్రాజెక్టులు

అది 2.50 లక్షలకు చేరవచ్చని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దిగువ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా కర్ణాటకలోని నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి 2.24 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తున్నది. ప్రస్తుతం ప్రాజెక్టులో 26.623 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థం 33.313 టీఎంసీలు.

## మాదాపూర్‌లో రేవ్ పార్టీ భగ్నం

యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మాదాపూర్ సైబర్ టవర్స్ సమీపంలోని క్లాడ్ 9 హోమ్స్ సర్వీస్ అపార్ట్మెంట్?లో బుధవారం రాత్రి రేవ్ పార్టీ ఏర్పాటు చేశారని తమకు సమాచారం అందిందన్నారు. దీంతో తమ సిబ్బందిని మఫ్టీలో పంపించి పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించడం జరిగిందని వివరించారు.ఈ రేవ్ పార్టీకి 14 మంది యువకులు, ఆరుగురు యువతులు హాజరయ్యారని జాయింట్ కమిషనర్? తెలిపారు. నాగరాజు తమ్ముడు సాయికుమార్ దుబాయ్ నుంచి విదేశీ మద్యం తీసుకుని రాగా నితిన్ గోవా నుంచి డ్రగ్స్ తీసుకొచ్చినట్లు వెల్లడించారు. పార్టీని నిర్వహించిన ఐదుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారికి డ్రగ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. దాదాపు ఇద్దరు మత్తుపదార్థాలు సేవించినట్లు నిర్ధారణ అయిందని వివరించారు."ఈ రేవ్ పార్టీలో పాల్గొన్న వారిలో నాగరాజు సన్నిహితులే ఉన్నారు. మొత్తం రూ.1.25 లక్షల నగదు విలువ చేసే మద్యం,డ్రగ్స్ ,ఇన్నోవా క్రిస్ట వాహనం సీజ్ చేయడం జరిగింది. నిందితులను శేరిలింగంపల్లి ఆబ్కారీ శాఖ పోలీసులకు అప్పగించడంతో పాటు నిందితులు గోవా నుంచి ఎంత డ్రగ్స్ తెచ్చారు? రేవ్ పార్టీ కాకుండా ఇంతకు ముందు కూడా డ్రగ్స్ సరఫరా చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఆబ్కారీ శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషీ తెలిపారు.

## తెలంగాణ బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యం

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 25 (జనంసాక్షి)**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఉన్న నేను ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వెల్ఫేర్ శాఖలకు తగిన ప్రాధాన్యం లభించేలా ప్రయత్నం చేశానని షబ్బీర్ అలీ అన్నారు.మైనార్టీ శాఖకు 3003 కోట్లు,ఎస్సీ సంక్షేమానికి 33124 కోట్లు,ఎస్టీ సంక్షేమానికి 17056 కోట్లు,బీసీ సంక్షేమానికి 9200 కోట్లు, మొత్తం రెండు లక్షల 91,వేల 159 కోట్లతో అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేసే విధంగా తెలంగాణ బడ్జెట్ ఉందని ఆయన అన్నారు .వ్యవసాయ అనుబంధ రంగానికి పెద్ద పీట వేస్తూ 72,659 కోట్లు కేటాయించారని,స్త్రీ శిశు సంక్షేమానికి 2736 కోట్లు,వైద్య ఆరోగ్య శాఖకు 11,468 కోట్లు,విద్య రంగానికి 21292 కోట్లు,నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు.వ్యవసాయ రంగానికి నీటిని అందించడానికి నీటిపారుదల శాఖకి 22301 కోట్లు కేటాయించామన్నారు.రైతు పక్షపాతి ప్రభుత్వంగా ముద్ర వేసుకున్నామని,పట్టణాభివృద్ధి తో పాటు పల్లెల అభివృద్ధికి బడ్జెట్లో పెద్దపీట వేశామన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌లో మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని,వారిని కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో పలు పథకాలను ప్రాతిపాదించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం. గ్రామీణ మహిళాభివృద్ధికి ఇందిరా మహిళా శక్తి పథకం తీసుకువస్తున్నట్లు ప్రకటన చేశారు.ఈ పథకం ద్వారా 63 లక్షల మంది మహిళలకు లబ్ది చేకూరాలనేది ప్రభుత్వం లక్ష్యమని. స్త్రీ నిధి ఏర్పాటు, బ్యాంకులతో అనుసంధానం సహా వివిధ మార్గాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నారు.ఈ పథకం ద్వారా మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో వృత్తి, నైపుణ్య శిక్షణ ఇప్పించడంతో పాటు బ్రాండింగ్, మార్కెటింగ్‌లలో మెలకువలు నేర్పించేందుకు సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.డ్వాక్రా మహిళ సంఘాలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.హైదరాబాద్ మెట్రో కు భారీగా నిధులు కేటాయించామని,పాతబస్తీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు.భూమిలేని నిరుపేద రైతు కూలీలకు సంవత్సరానికి 12,000 రూపాయలు అందించే బృహత్తర కార్యక్రమాన్ని ఈ సంవత్సరంలోనే ప్రారంభించ. బోతున్నామన్నారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రంగాలకే బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయించారన్నారు.ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీ హామీల అమలుకు దాదాపుగా రూ.50 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించామని,ముఖ్యంగా రుణమాఫీకి రూ.30 వేల కోట్లు, రైతు భరోసా పథకానికి రూ.15 వేల కోట్లతో కలిపి ఒక్క వ్యవసాయ శాఖకే అత్యధికంగా రూ.50 వేల కోట్లకు పైగా నిధులు సంక్షేమ శాఖలన్నింటికీ కలిపి రూ.40 వేల కోట్లు, సాగు నీటి రంగానికి రూ.29 వేల కోట్లు, విద్యుత్ శాఖకు రూ.15 వేల కోట్లు, వైద్యశాఖకు రూ.15 వేల కోట్లు, ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం గృహనిర్మాణశాఖకు రూ.8 వేల కోట్ల నిధులు కేటాయించామన్నారు.

## దేశం కోసమే తప్పుకున్నా

చారిత్రాత్మకమైన ప్రసంగం చేశారు. డెమొక్రాటిక్ పార్టీని, దేశాన్ని ఏకం చేసేందుకే తాను 2024 ఎన్నికల నుంచి వైదొలగుతున్నట్టు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్యం సంరక్షణ అన్నింటి కంటే ముఖ్యమైనదని, నవతరానికి కాగడాను అందించడమే ఉత్తమ మార్గం అని తాను నిర్ణయించుకున్నానని, అమెరికాను ఐక్యం చేయడానికి అదే ఉత్తమ మార్గమని ఆయన అన్నారు. కష్టపడే సామర్థ్యం ఉన్న వైస్ ప్రెసిడెంట్ కమలా హారీస్ డెమొక్రాటిక్ పార్టీ ప్రెసిడెన్షియల్ నామినీగా ఎంపికయ్యారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. డొనాల్డ్ ట్రంప్‌తో పోల్ డిబేట్‌లో జో బైడెన్ వెనుకబడడం, ఆ తర్వాత ట్రంప్‌పై హత్యాయత్నం నేపథ్యంలో ఎన్నికల రేసు నుంచి తప్పుకో వాలంటూ డెమొక్రాటిక్ శ్రేణులు బైడెన్‌పై తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చాయి. దాదాపు రెండు వారాల తర్వాత ఆయన రేసు నుంచి వైదొలిగారు. దీంతో భారతీయ మూలాలు ఉన్న కమలా హ్యారీస్ రేసులోకి వచ్చిన విషయం తెలిసిందే. అమెరికా రాజకీయాల్లో ప్రతీకారాలకు ముగింపు పలకాలని, దేశం కంటే ఏ నియంతృత్వం, నిరంకుశం ఎక్కువ కాదు అంటూ బైడెన్ పవర్ ఫుల్ ప్రసంగం ఇచ్చారు. యువ గళాలకు, సరికొత్త నేతలకు సమయం సమయం ఆసన్నమైందని, ఆ సమయం ఇదేనని అన్నారు. కాగా జీవితంలో అత్యంత కీలక ప్రసంగం చేస్తున్న సమయంలో ఆయన కుటుంబ సభ్యులు ఓవల్ కార్యాలయంలో ఆయన ముందు కూర్చొని విన్నారు. ఆయనకు సపోర్టుగా అక్కడే ఉన్నారు. భార్య జిల్ బైడెన్, కూతురు యాష్లే, కొడుకు హంటర్ ఉన్నారు. ప్రసంగం ముగిసిన తర్వాత ఆయన వద్దకు వెళ్లి ఆప్యాయంగా చేతులు పట్టుకున్నారు. బిడెన్ మనవరాళ్లు కూడా ఓవల్ ఆఫీస్‌కు వచ్చారు. అధ్యక్షుడు జో బైడెన్ ప్రసంగంపై రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష నామినీ డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. వండి వార్చిన జో బిడెన్ ఓవల్ ఆఫీస్ ప్రసంగం అర్థమైంది. చాలా చెడ్డగా ఉందని ట్రంప్ అన్నారు. కాగా అధ్యక్ష ఎన్నికలకు ఫిట్ కాని వ్యక్తి అధ్యక్షుడిగా మాత్రం ఎలా కొనసాగుతారని, వైగొలగాలంటూ రిపబ్లికన్ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అధ్యక్షుడిగా పనిచేయడానికి ఆయన తగినవాడు కాదని అంటున్నారు. విమర్శలకు జో బైడెన్ సమాధానం ఇచ్చారు. తాను కుంటివాడిని కాదని, పదవిలో ఉన్నంత కాలం ఆర్థిక వ్యవస్థ, కీలకమైన విదేశాంగ విధాన సమస్యలపై పని చేస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. రాబోయే ఆరు నెలల్లో తాను అధ్యక్షుడిగా పని చేయడంపై దృష్టి పెడతానని చెప్పారు.కాగా బిడెన్ లేకుండానే అమెరికా ఎన్నికల ప్రచారం జరుగుతోంది. డెమొక్రాటిక్ పార్టీ నామినీగా కమలా హ్యారీస్‌కు పార్టీ ప్రతినిధుల మద్ధతు లభిస్తుండడంతో ఆమె ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

## అంకెల గారడీ

- **ఆత్మస్తుతి..పరనిందలా బడ్జెట్ ప్రసంగం**
- **ఎన్నికల హామీలకు ఎగనామం పెట్టిన భట్టి**
- **మాజీమంత్రి హరీశ్ విమర్శలు**

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్ర అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆసాంతం ఆత్మస్తుతి, పరనింద తప్ప మరేమీ లేదని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. బడ్జెట్ లో ఆసరా పెన్షన్‌ల ప్రస్తావనే తీసుకురాలేదని అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని, కానీ ఆ ఊసే ఎత్తలేదని మండిపడ్డారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ నేతలు ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చారని, ఆ విషయాన్ని కూడా ఎక్కడా ప్రస్తావించలేదని హరీష్‌రావు ఆరోపించారు. ఆసరా పెన్షన్‌ల ప్రస్తావన తేకుండా వితంతువులు, వృద్ధులు, వికలాంగులను ప్రభుత్వం నిరాశపర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారుకు పేదల ప్రభుత్వం అని చెప్పుకునే అర్హత లేదని అన్నారు. బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీలా ఉన్నదని, ఇది రాష్ట్రాన్ని తిరోగమనం వైపు నడిపేదని హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని గొప్పలకు పోయిన కాంగ్రెస్ సర్కారు.. ఆ ప్రస్తావనే తేకపోవడం దారుణమని అన్నారు. ఆర్భాటంగా అభయ హస్తం దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆరు గ్యారెంటీ ఊసెత్తలేదని మండిపడ్డారు. ఆసరా పింఛన్‌లు పెంచుతామని ఎన్నికల్లో హామీలు ఇచ్చారని, వృద్ధుల పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు, వికలాంగుల పెన్షన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. బడ్జెట్ లో ఆ ప్రస్తావన ఎందుకు చేయలేదని హరీష్‌రావు ప్రశ్నించారు. ఇచ్చిన మాట తప్పడం ద్వారా ప్రభుత్వం పేదలను మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న సర్కారు.. ఇప్పుడు రెండు లక్షల ఉద్యోగాల గురించి మాట్లాడలేదని, మాయమాటలతో విద్యార్థులను మోసం చేసిందని హరీష్‌రావు మండిపడ్డారు. ఆటో కార్మికులకు రూ.12 వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా చెప్పారని, ఇప్పుడు ఆ విషయం ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వైఖరి కారణంగా ఇప్పటికే 50 మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని హరీష్‌రావు గుర్తుచేశారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని గత ప్రభుత్వ పాలన మీద బురద జల్లే ప్రయత్నం చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. భట్టి విక్రమార్క చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు.ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 57 వేల కోట్ల అప్పులు తెచ్చుకుంటామని బడ్జెట్‌లో భట్టి విక్రమార్క ప్రతిపాదించారు.

# బడి ఎగ్గొడుతున్న పంతుల్లు

- సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు
- సస్పెండ్ కావడం కోసమే బడికి రాని వైనం
- విద్యార్థులకు అంగన్వాడీ టీచర్లే దిక్కు
- పంతులును కేటాయించాలంటూ ఎంఈఓకు ఫిర్యాదు



**తుంగతుర్తి జులై 24 (జనం సాక్షి) :** తుంగతుర్తి మండలంలో ఇద్దరు పంతుల్లు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే బడి ఎగ్గొట్టేస్తున్నారు. వీరిద్దరూ కోదాడ ప్రాంతానికి చెందినవారు. దీంతో పలుమార్లు పాఠశాలకు హాజరుకావాలని మండల విద్యాశాఖ అధికారి ఫోన్ లో మాట్లాడిన మెమోలు జారీ చేసిన స్పందన రాకపోవడంతో వారి వేతనాలు నిలిపివేసి జిల్లా విద్యాశాఖ అధికారి ఫిర్యాదు చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూ ఉద్యోగంలో సస్పెన్షన్కు గురికాకుండా ఉద్యోగం చేయడం ఉద్యోగి కర్తవ్యం విధుల పట్ల గైరాజర్ అవుతున్న ఇద్దరు ఉపాధ్యాయుల విచిత్ర మనస్తత్వం ఉన్న ఉపాధ్యాయులు మండలంలో పనిచేస్తున్నారు. వెలుగు పల్లి కాంప్లెక్స్ పరిధిలో బండ రామారం ప్రాథమిక పాఠశాలకు చెందిన టి వెంకట్ రాములు జేత్య తండా కు పి సత్యమూర్తి ఇద్దరు ఉపాధ్యాయులు ఎలాంటి అనుమతులు సమాచారం లేకుండా విధులకు గైరాజరవుతున్నారు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల ప్రారంభం నుండి విధులకు హాజరు కాలేదని విమర్శలు వస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ కార్యాలయానికి చేరుకొని మా పాఠశాలకు ఉపాధ్యాయులు రావడంలేదని ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన తన కార్యాలయంలో పనిచేస్తున్న సిఆర్పిలను అప్పుడప్పుడు పంపుతున్నారు. . వారు కూడా సెలవులో ఉంటే అట్టి పిల్లలకు అంగన్వాడి టీచర్లే దిక్కుగా మారుతున్నారు.. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులు సెలవు కావాలంటే ప్రధానోపాధ్యాయుడు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఆ తరువాత ఎక్కువ రోజులు సెలవులు కావాలంటే మండల విద్యాశాఖ అధికారి అనుమతి తప్పనిసరి. కానీ ఈ ఇరువురు ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుడితోపాటు మండల విద్యాశాఖ అధికారి అనుమతి లేకుండా ఎలాంటి సెలవు కావాలంటూ ఎలాంటి వినతులు లేకుండా దర్జాగా విధులకు గైరాజరావుతున్నట్లు సమాచారం . దీంతో అట్టి ఉపాధ్యాయులను గైర్హాజరు కావడానికి సంజాయిషీ నోటీసు ఇచ్చిన వారు పట్టించుకోకపోవడంతో తప్పని పరిస్థితుల్లో వారు వేతనాలు ఆపినట్లు ఎంఈఓ తెలిపారు. వీరి గైరాజర్ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియపరచినట్లు ఎంఈఓ తెలుపుతున్నారు. ఇందులో ఒక ఉపాధ్యాయుడు జేత్య తండాలో పనిచేస్తున్నారు అక్కడ ఒకటే టీచర్ ఉండడంతో అట్టి పాఠశాల విద్యార్థులకు అంగన్వాడి టీచర్లే పెద్ద దిక్కుగా మారారు. . ఈ ఇద్దరు ఉపాధ్యాయులు ఇదేమని ప్రశ్నిస్తే తాము ఇక్కడ పనిచేయడం ఇష్టం లేదని సస్పెండ్ చేస్తే మళ్లీ వేరే ప్రాంతంలో ఉద్యోగం చేయొచ్చనే ఆలోచనలో ఉన్నామని తమ సహచరుల దగ్గర వాపోతున్నట్లు సమాచారం. సస్పెండ్ అయితే మళ్లీ రెండు నెలల అనంతరం తమ మండలంలోని పనిచేసేందుకు అవకాశం ఉందని చెప్తున్నట్లు సమాచారం. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పి సమాజం పట్ల అవగాహన కల్పించాల్సిన ఉపాధ్యాయులే పాఠశాల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పాఠశాల విధులను విస్మరించి ప్రవర్తించడం పట్ల ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను బడికి పంపడానికి వెనుకంజ వేస్తున్నారు.

ఈ విషయంపై ఎంఈఓ లింగయ్యను వివరణ కోరగా ఇద్దరు ఉపాధ్యాయులు ఎలాంటి అనుమతులు సమాచారం లేకుండా పాఠశాల విధులకు గైరాజరవుతున్నారని తెలిపారు. ఈ విషయంపై వారికి ఫోన్లో సంప్రదించిన మెమోలు జారీ చేసిన వారి నుండి స్పందన రావడంలేదని దీంతో వారి వేతనాలు నిలిపి తదుపరి చర్య నిమిత్తం డిఇఓ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం

- పుల్కల్ మండలంలో విషాధం
- శోకసంద్రంలో కుటుంబాలు
- ఘటనపై దిగ్భాంతి వ్యక్తి చేసిన మంత్రి దామోదర్



**సంగారెడ్డిప్రతినిధి, జులై 25(జనంసాక్షి) :** రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి వారి కుటుంబం. కుటుంబపోషణకు సొంత గ్రామం నుంచి రోజు వారి పనికి వెళ్తూ కుటుంబభారాన్ని మోస్తున్నారు. రోజు పనికి వెళ్తే గానీ పూట గడువని పరిస్థితి. వారి కష్టం కన్నీంటి పర్యంతమారింది. ఆ మూడు కుటుంబాల్లో తీరని దుఃఖసాగరంలో ముంచేత్తింది. రోజు వారిలానే పుల్కల్ మండలానికి చెందిన ముగ్గురు యువకులు కందిలోని అక్షయపాత్రలో పనికి వెళ్లేందుకు ఇంటి దగ్గరి నుంచి బయల్దేరారు. సంగారెడ్డి సమీపంలోకి రాగానే మృత్యువు లారీ రూపంలో వారిని కబలించింది. పిల్లలు పనికి వెళ్లారని భావించి వారి పనుల్లో నిమగ్నమైన ఆ కుటుంబాల్లో ఒక్కసారిగా పిడుగుపడింది. గద్దవచ్చి కోడిపిల్లను ఎత్తుకెళ్లినట్లుగా లారీ మృత్యువు రూపంలో వారిని అనంతలోకాలకు పంపింది. పనికి వెళ్లిన కొద్దిసేపటికే ఆయా కుటుంబాల్లో చావు వార్త పలకరించింది. కొడుకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారనే వార్త విన్న వారి గుండె ఒక్కసారి పగిలింది. కళ్ల ముందు నుంచే వెళ్లిన వారు విగతజీవులుగా మారి కాటికి సాగనాంపాల్సి వచ్చిందేంటూ గుండెలవిసేలా రోధనలు మిన్నంటాయి. వివరాల్లోకి వెళితే పుల్కల్ మండలం గంగొజుపేటకు చెందిన సందీప్, నవీన్, గొంగులూరు గ్రామానికి చెందిన అభిషేక్‌లు కంది అక్షయపాత్రలో పని చేస్తుంటారు. రోజులు ముగ్గురు యువకులు ఒకే ద్విచక్రవాహనం పై పనికి వెళ్తుంటారు. పెట్రోల్ రేట్లను భరించలేక ముగ్గురు ఒక్కొక్క రోజు పాలుపంచుకుంటూ వారికష్టాలను కూడా పంచుకొని ఒకే వాహనంపై పనికి వెళ్లివస్తుంటారు. ఈ క్రమంలో గురువారం నాడు కూడా ముగ్గురు కందికి పని నిమిత్తం బయల్దేరారు. సంగారెడ్డి సమీపంలోని తునికిళ్ల వద్దకు రాగానే వెనుక నుంచి లారీ వీరు ప్రయాణీస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ ముగ్గురు యువకులు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతి చెందిన యువకులను పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో ఆ మూడు కుటుంబాల్లో విషాధఛాయలు అలుముకున్నాయి.

### ప్రమాదం పై మంత్రి దామోదర్ ద్రిగ్భాంతి

సంగారెడ్డి దగ్గరలోని కంది తునికిళ్ల వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పుల్కల్ మండలానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ముగ్గురు యువకులు బైక్ పై డ్యూటీకి వెళుతున్న క్రమంలో సంగారెడ్డి సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందడం బాధాకరమన్నారు. మృతి చెందిన యువకులకు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో వెంటనే పోస్టుమార్టం నిర్వహించాలని ఆస్పత్రి సూపరింటిండెంట్‌ను ఆదేశించారు. మృతి చెందిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ప్రభుత్వ పరంగా వారి కుటుంబాలను ఆదుకుంటామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# శ్రీ చైతన్య అకాడమిక్స్‌లో ఘనంగా గ్రీన్ ఇండియా మిషన్ ప్రోగ్రాం

- వనమహోత్సవంలో చెట్లు నాటిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, జూలై 25 (జనం సాక్షి) :** విద్యారణ్యపురి శ్రీ చైతన్య పాఠశాలలో అకాడమిక్స్ లో భాగంగా స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం గ్రీన్ ఇండియా మిషన్ ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని గ్రీన్ ఇండియా మిషన్ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో చెట్లు నాటారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక భాద్యత అని ప్రతి పాఠశాలలో చెట్ల పెంపకం గురించి పర్యావరణ గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం చేపట్టిన శ్రీచైతన్య మేనేజ్మెంట్ ను నరేందర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ప్రతి నెలా నిర్వహించే పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఏజీఎం ఎం. రాజు, ప్రిన్సిపాల్ ఎ. సుమన్, సి బ్యాచ్ ఇంచార్జ్ మహేష్, ప్రైమరీ ఇంచార్జ్ శారద, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ ప్రియదర్శిని, ఏవో సుధీర్, అనిల్, జోనల్ పీఈటీ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశానికే దిక్సూచి రాష్ట్ర బడ్జెట్

- కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్ బ్యూరో, జులై 25 (జనం సాక్షి) :** రెండు లక్షల 91,159 కోట్లతో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జనరంజకమైన బడ్జెట్ ను రూపొందించి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిందని తెలిపారు. గురువారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో రాజేందర్ రావు దీనిపై స్పందించారు. రైతును రాజు చేయడం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి బడ్జెట్లో అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని పేర్కొన్నారు. బడ్జెట్లో సింహ భాగం వ్యవసాయ రంగానికి కేటాయించడం అభినందనీయమని తెలిపారు. గతంలో అప్పుల కుప్పగా మార్చిన బిఆర్ఎస్ సర్కార్ వైఖరి వల్ల ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం 42, 892 ఓట్లు అప్పులకు వడ్డీ కింద చెల్లించడం ఓట్లు అప్పులకు వడ్డీ కింద చెల్లించిందని తెలిపారు. 2023 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో ఆరు లక్షల 71 వేల అప్పులు గత పాలకులు చేశారని తెలిపారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు 29 816 కోట్లు, హైదరాబాద్ సిటీ అభివృద్ధికి పదివేల కోట్లు, బీసీ సంక్షేమానికి 9200 కోట్లు, మైనారిటీ సంక్షేమానికి 3003 కోట్లు, గ్యాస్ సబ్సిడీ స్కీంకు 723 కోట్లు ప్రభుత్వం బడ్జెట్లో కేటాయించడం అభినందనీయమని రాజేందర్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు పేదల సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్ ను రూపొందించడం చరిత్రలో నిలిచిపోతుందని దేశానికే బడ్జెట్ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇందు కోసం కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులకు రాజేందర్ రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# దామరతోగు ఎన్ కౌంటర్‌కు సీఎం, ఎమ్మెల్యేలు బాధ్యత వహించాలి

- మావోయిస్టు పార్టీ డివిజన్ కార్యదర్శి ఆజాద్..

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** దామరతోగు ఎన్ కౌంటర్ కు సీఎం ఎమ్మెల్యేలు బాధ్యత వహించాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం - అల్లూరి సీతారామరాజు డివిజన్ కార్యదర్శి ఆజాద్ ఓ లేఖలో పేర్కొన్నారు. ఎన్ కౌంటర్లన్ని ప్రభుత్వ హత్యలేనని, పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో ఎన్కౌంటర్లను వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో కుమ్మకై మావోయిస్టు పార్టీ నిర్మూలనకై కగార్ దాడిని తీవ్రతరం చేస్తూ నిరంతరం పోలీసులతో అడవులను జల్లెడ పడుతున్నాడని ఆరోపించారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 8 నెలల కాలంలో బూటకపు ఎన్ కౌంటర్లు చేస్తూ ప్రజల కోసం పని చేస్తున్న విప్లవకారులను హత్యలు చేస్తున్నదని తెలిపారు. తెలంగాణలోని గుండాల మండలం, దామరతోగు అటవి ప్రాంతంలో గురువారం ఉదయం 6 గంటలకు జరిగిన ఎన్ కౌంటర్ లో బుద్దారం గ్రామం కామ్రేడ్ నల్లమూరి అశోక్ అలియాస్ విజేందర్ అమరుడయ్యాడని ప్రకటించారు. ఈ ఎన్‌కౌంటర్ ను ఖండిస్తున్నట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించు కుంటుందని, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు, కవులు, కళాకారులు ఈ ఎన్‌కౌంటర్ ను నిరసించాలని ఆయన లేఖలో పేర్కొన్నారు.

### జనరంజకంగా రాష్ట్ర బడ్జెట్

- అన్ని వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇచ్చారు
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, జూలై 25 (జనం సాక్షి) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ జనరంజకంగా ఉందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీశిశు సంక్షేమం, ఎస్, ఎస్టీ మైనారిటీలతో పాటు బిసిల సంక్షేమానికి పెద్ద పీట వేశారని వ్యవసాయరంగంతో పాటు గ్రామీణాభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయించారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గృహజ్యోతి , గ్యాస్ సబ్సిడీకి నిధులు కేటాయించారని అన్ని వర్గాలను ఆదుకోవడమే లక్ష్యంగా బడ్జెట్ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనకు ఈ బడ్జెట్ నిదర్శనం అని అన్నారు.

### ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తల్లీ కుమారుడు ఆత్మహత్య

**హైదరాబాద్, జూలై 25 (జనంసాక్షి) :** ఆర్థిక ఇబ్బందులతో తల్లీకుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నగరంలోని చైతన్యపురి పీఎస్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. కొత్తపేటలోని ఎస్ఆర్ కాలనీలో గంజి పద్మ (40), కుమారుడు వంశీ (18) అద్దె ఇంట్లో నివాసముం టున్నారు. పద్మ భర్త శివ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఆమె కూలి పనులు చేస్తూ కుటుం బాన్ని పోషిస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో బుధ వారం రాత్రి పద్మ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తల్లి మృతిని తట్టుకోలేక కుమారుడు వంశీ కూడా ఉరివేసుకుని చనిపోయాడు. సమాచారం అందుకున్న చైతన్య పురి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు.

# జాతీయ రహదారిపై కూలిన చెట్టు

- వాహనదారుడు మృతి



**ఏటురునాగారం, జులై 25(జనంసాక్షి) :** ఏటూరు నాగారం, చిన్నపోయినపల్లి మధ్యలో 163వ జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం. రహదారిపై చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన జాంగిర్ తన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా పోతురాజు బోరు వద్దకు రాగానే ఒక్కసారిగా భారీ వృక్షం తన మీద పడడంతో ఆక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటచేసుకుంది. సమాచారం అందుకున్న ఏటూరునాగారం ఎస్సై తాజుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరు నాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. జెసిబి సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షమును తొలగించారు. ప్రధాన రహదారిపై ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. ఎస్ఐ దగ్గరుండి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. చిన్నబోయినపల్లి గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.


# రాష్ట్ర బడ్జెట్ నిరాశపర్చింది

- బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు నిరాశ
- ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మెన్ దేవీప్రసాద్

రాష్ట్ర బడ్జెట్ నిరాశపర్చిందని, బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు నిరాశే ఎదురైందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ చైర్మెన్ దేవీప్రసాద్ అన్నారు. చాలా కాలం నుండి ఉద్యోగ సంఘాలు కరువు భత్యం 5 విడుతలు విడుదల చేయాలని చేసిన డిమాండ్ ను పట్టించుకోకపోవడం అన్యాయమని, అక్టోబర్ 24 వరకు పిఆర్‌సి గడువు పూర్తి అవుతుందని, 2024లో పిఆర్‌సి ఇవ్వమని బడ్జెట్ స్పష్టం చేసిందని, ఎలాంటి కేటాయింపు లేదని, కనీసం మధ్యంతర భృతి ప్రస్తావన లేదని, గత ఏప్రిల్ 31 నుంచి ప్రతి నెల వందలాది ఉద్యోగులు పదవి విరమణ చేస్తున్నారని, వారికి రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తోపాటు ఉద్యోగులకు రావలిసిన నిధులు 5000 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని, అధికారంలోకి రాగానే త్ఙక్షణ చెల్లింపు చేస్తామని హామీ ఇచ్చి కేటాయింపులు లేకపోవడం ఉద్యోగులను మోసం చేయడమేనన్నారు. 2 లక్షల ఉద్యోగులను నియమిస్తామని చెప్పి ఎలాంటి కేటాయింపు లు చేయకపోవడం కాంగ్రెస్ పార్టీ కి నిరుద్యోగుల పట్ల ఉన్న ప్రేమ తెలిసిపోయిందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఈహెచ్‌ఎస్ బలోపేతం చేస్తామని చెప్పి ఎలాంటి ప్రస్తావన లేదన్నారు. మొత్తం బడ్జెట్‌లో ఎక్కడ వెతికినా ఉద్యోగుల సంక్షేమం కనపడలేదని, అమరవీరుల కుటుంబాల కోసం, ఉద్యమకారులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఎలాంటి పథకం ప్రకటించలేదని, ఆరు గ్యారంటీలు కేవలం నినాదంగా మారిందని, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్‌పై ఎలాంటి హామీ లేదని, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఊసే లేదని, అంగన్వాడీ, ఆశ, లాంటి ఉద్యోగుల వేతనాల హెచ్చింపు పై ఎలాంటి హామీ లేదని తెలిపారు. మహిళా సంక్షేమ నిధులను భారీగా తగ్గించిందని, బడ్జెట్‌లో తెలంగాణ ఉద్యోగుల పట్ల వివక్ష మాత్రమే ఉందని పేర్కొన్నారు.

# రేవంత్, భట్టిలది అభివృద్ధి బడ్జెట్

- కేసీఆర్‌ది అప్పుల బడ్జెట్
- ఊహల బడ్జెట్ గత బీఆర్ఎస్‌ది
- మీడియా సమావేశంలో జగ్గారెడ్డి



**హైదరాబాద్, జూలై 25 (జనంసాక్షి) :** రేవంత్, భట్టిలది అభివృద్ధి బడ్జెట్ అని, కేసీఆర్‌ది ఈస్ట్‌మన్ కలర్ బడ్జెట్ అని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గత బడ్జెట్ ఊహల బడ్జెట్ అని, కాంగ్రెస్ ది వాస్తవ బడ్జెట్ అని తెలిపారు. ఊహలకు... వాస్తవానికి తేడా ఉందని, భట్టి బడ్జెట్ బిందల్లో నీళ్లు ముంచుకుని తాగినట్టు ఉందని, కేసీఆర్ బడ్జెట్ చెరువులో నీళ్ళు తెచ్చుకుని తాగినట్టుగా మాటకు కట్టుబడి...వాస్తవానికి దగ్గరలో బడ్జెట్ ఉందని తెలిపారు. కేసీఆర్ ఊరందరికీ మటన్ బిర్యానీ వందుతున్న అని ప్రచారం చేస్తారని, పొయ్యి.. పొయ్యి మీద గిన్నె లు పెడతారు కానీ మటన్ ఉండదని, మటన్ ఎప్పుడు వస్తుందో అని మనం ఎదురు చూస్తాం... అక్కడ మటన్ లేదు.. ఏం లేదని, ప్రజలను బడ్జెట్ విషయంలో కేసీఆర్ కూడా అట్లనే మోసం చేశారని తెలిపారు. ఆరు గ్యారెంటీ లకు సరిపడా నిధులు కేటాయించారని, వ్యవసాయానికి 72 వేల కోట్లు ఇచ్చి కాంగ్రెస్ మరోసారి రైతు ప్రభుత్వమని నిరూపించుకుందని, 10 వేల కోట్లతో హైదరాబాద్ అభివృద్ధి చేసి పారిశ్రామిక వేత్తలు విరివిగా రావచ్చని, రియల్ ఎస్టేట్ పెరుగుతుందని, కార్మికులు... పరిశ్రమలు అభివృద్ధి జరుగుతుందని, హైదరాబాద్ కి ఇంటర్నేషనల్ బ్రాండ్ ఉందని, దేశంలో వ్యాపారస్తులు హైదరాబాద్ కి ప్రాధాన్యత ఇస్తారని, బీఆర్ఎస్ అలా చేయలేదని, హైదరాబాద్‌కు నిధులు పెట్టలేదని, తాము హైదరాబాద్ కి 10 వేల కోట్లు పెడితే కేసీఆర్ కుళ్లుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ వేసిన ఫ్లైఓవర్ లకు కేటీఆర్ రిబ్బన్ కట్ చేశారని తెలిపారు. కేటీఆర్, పొన్నం ఇద్దరు ఆర్టీసీ బస్సులో ఎక్కాలని, ఉచితంగా బస్సు లో మహిళలు వెళ్తున్నారా లేదా అని తెలుస్తుందని తెలిపారు. తుమ్మలతో కలిసి రైతుల దగ్గరికి పొండి... రుణాలు మాఫీ ఐతున్నాయా లేదో తెలుసుకోవాలని, కేటీఆర్ బీఆర్ఎస్ కార్యాలయంలో కూర్చొని, తాము గాంధీ భవన్ లో కూర్చొని మాట్లాడటం ఎందుకు అని ప్రశ్నించారు. భట్టితో కలిసి 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటు వస్తుందో లేదో చూడండి సూచించారు. ఉత్తమ్‌ను తీసుకుని 500 సిలిండర్ ఇస్తున్నారో లేదో అడిగి తెలుసుకోవాలని సూచించారు.

# అడవుల్లో భారీ కూంబింగ్

- అడుగడుగునా జల్లెడ పడుతున్న పోలీస్ బలగాలు



**కొత్తగూడ జూలై 25 (జనంసాక్షి) :** మహబూబాద్ జిల్లా కొత్తగూడ, గంగారం మండలాలలోని ఏజెన్సీ అటవీ ప్రాంతాన్ని పోలీసు భద్రత బలగాలు జల్లెడ పడుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడ జిల్లా గుండాల మండలం అటవీ ప్రాంతంలో పోలీసులకు నక్సలైట్లకు ఎదురు కాల్పుల్లో అశోక్ అనే (నక్సలైట్) వ్యక్తి మృతి చెందినట్లుగా తెలుస్తుంది. మరి కొంతమంది గాయాలు కావడంతో గుండాలకు సమీప ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లా గంగారం కొత్తగూడ మండలాలలోని అటవీ ప్రాంతంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## భారత్ సైనికుల ధైర్యానికి చిహ్నం

# కార్గిల్ విజయ దినోత్సవం



***హిమాలయ శిఖరాలపై యుద్ధ మేఘాలు, భారత్ సైనికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి గుండె ధైర్యంతో శత్రువులతో పోరాటం సాగించారు. కార్గిల్ భూమి రణరంగంగా మారినప్పుడు, భారతం సైనికులు తమ గుండెల నిండా దేశభక్తి జ్వాలలు నింపుకొని శత్రువుల దాడిని తిప్పి కొట్టారు. ప్రతి ఒక్క సైనికుడు ఒక వీరుడై ధీరత్వంతో యుద్ధభూమిలో విజయం వైపు అడుగులు వేశారు. వారి ధైర్యము మనకు స్ఫూర్తినిస్తుంది. భారతదేశం కోసం ప్రాణాలు అర్పించిన వారిని స్మరించుకుంటూ.ప్రతి సంవత్సరం జులై 26న కార్గిల్ విజయ దినోత్సవాన్నిజరుపుకుంటాము 1999లో జరిగినభారత-పాకిస్తాన్ యుద్ధంలో భారతదేశం సాధించిన ఘన విజయానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ యుద్ధంలో భారత సైనికులు అద్భుతమైన శౌర్యాన్ని, దేశభక్తిని ప్రదర్శించి, ఎత్తైన కార్గిల్ శిఖరాలను జయించారు.***

1999 మే నెలలో, పాకిస్తాన్ సైనికులు భారతదేశం యొక్క లడఖ్ ప్రాంతంలోని కార్గిల్‌లోని కొన్ని కీలకమైన పర్వత శిఖరాలను ఆక్రమించుకున్నారు. భారత సైన్యం వెంటనే స్పందించి, "ఆపరేషన్ విజయ్"అనే పేరుతో ఒక పెద్ద యుద్ధాన్ని ప్రారంభించింది. భారీ శత్రు దాడిని ఎదుర్కొన్నప్పటికీ, భారత సైనికులు అద్భుతమైన ధైర్యంతో పోరాడారు. కఠినమైన వాతావరణం, ఎత్తైన ప్రదేశాలు వంటి అనేక సవాళ్లను అధిగమించి, చివరికి కార్గిల్ శిఖరాలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. కార్గిల్ యుద్ధంలో ఒక మలుపుగా నిలిచిన ఈ కీలకమైన శిఖరాన్ని భారత సైన్యం జూలై 1న స్వాధీనం చేసుకోంది. పాయింట్ ఫోర్ ఫైవ్ నైన్ భారత సైనికులు ఎత్తైన శిఖరాన్ని జులై 13న స్వాధీనం చేసుకున్నారు. డ్రాస్ జులై 26న డ్రాస్ సెక్టార్ లోని చివరి పాకిస్తాన్ స్థావరాలను భారత్ సైన్యం సాధనం చేసుకుంది. మూడు నెలల పోరాటం తర్వాత భారత సైన్యం పాకిస్తాన్ సైన్యం ఆక్రమించిన భారత్ భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంది. ఈ విజయంలో భారత సైన్యం 500 కి పైగా సైనికులను కోల్పోయింది. వేలాది మంది గాయపడ్డారు. పాకిస్తాన్ సైనికులకు భారీ నష్టం కలిగించింది. అంతర్జాతీయ సమాజం నుండి మద్దతు పొందింది. ఈ యుద్ధం భారత సైనికుల ధైర్యం, దేశభక్తికి ఒక స్మారక చిహ్నం. భారతదేశం యొక్క సైనిక శక్తిని ప్రపంచానికి చాటింది. భారతదేశం యొక్క జాతీయ భద్రతకు ముప్పు నుండి దేశాన్ని రక్షించింది. ఈ యుద్ధంలో పాల్గొన్న సైనికుల త్యాగాలను స్మరించుకోవడానికి మరియు వారి ధైర్యాన్ని గౌరవించడానికి కార్గిల్ విజయ దినోత్సవాన్ని జరుపుకుంటాము. భారతదేశం అంతటా వివిధ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. వీర సైనికులకు నివాళులు అర్పించబడతాయి. యుద్ధంలో గాయపడిన సైనికులకు సహాయం చేయబడుతుంది.

కొత్త తరాలకు దేశభక్తి, పౌరసేవ గురించి నేర్పించబడుతుంది. భారత సైనికుల ధైర్యం, దేశభక్తిని స్మరించుకుంటూ. భారత సైనికుల ధైర్యం మరియు త్యాగాలను మనం ఎప్పటికీ మర్చిపోకూడదు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికులను మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. దేశవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటాము. ఈ సందర్భంగా వీర సైనికులకు నివాళు లర్పిస్తాము. దేశంలోని పాఠశాలలో మరియు కళాశాలలో ఈ యుద్ధం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి ఈ యుద్ధంలో పాల్గొన్న సైనికులను సత్కరించి వారి త్యాగాలు చాటి చెప్పాలి. ఈ యుద్ధం భారతదేశం యొక్క సైనిక శక్తిని ప్రపంచానికి చాటి చెప్పింది. జూలై 26 కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా భారత వీరుల త్యాగాలను స్మరించుకుందాం. వారి ధైర్యం దేశభక్తిని గుర్తుంచుకుందాం. భారతదేశ కోసం ఎల్లప్పుడూ యుద్ధానికి సిద్ధంగా ఉందాం.

(జులై 26 కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా)



**పూసపాటి వేదాద్రి**
కవి, సాహితీ విశ్లేషకులు
9912197694

# ఎదుటి మనిషిని ఓర్వలేనివాడు నేతనా?

***ఎదుటి మనిషిని, ఓర్వలేని వాడు,సాటి మనిషి పట్ల ఓర్వలేని తనం ఉన్న వాడు రాజకీయ నాయకుడిగా అనర్హుడు!అలాగే మతం ను పట్టుకుని ఊగులాడే వాడు కూడ రాజకీయాల్లో పనికి రాడు!ఇప్పుడు ఉన్న రాజకీయ పార్టీ లలో సగానికి పైగా ఉన్న నేతలు, ప్రజా ప్రతినిధులు అలాంటి అనర్హులే ఉన్నారు.నిజానికి మతం పేరు మీద రాజకీయం ఎందుకు? అలాంటి వారు ఏ మత పెద్దలు గా మారి పోవడం మంచిది. ఏ చర్చ్ ఫాదరో, ఏ మస్జీద్ కు ఇమామ్, లేదా ఏ గుడికి పూజారి, మఠాధిపతులు అయిపోవడం బెటర్!రాజకీయాలకు ఎందుకు?రాజకీయాల లో ఎదుటి మనిషి కులం, మతం చూస్తూ, ఒరవలేని తనం ఏ మాత్రం మంచిది కాదు. భారతదేశం లో కొన్ని రాజకీయపార్టీలు, అపార్టీల నేతలు ఇప్పుడు మతం, కులం నే నమ్ముకుంటున్నారు. విద్వేషాల ను రెచ్చగొట్టడం,జనం ను కులం, మతం పేరుమీద విడదీయడం, రాజకీయాలు చేయడం షరా మాములు అయిపోయింది. రాజకీయాల్లో నిజం తక్కువ, అబద్ధం ఎక్కువ అనే పరిస్థితి అయిపోయింది. సర్వ మతాలు, కులాలు ఒక్కటే అనే భావన ఉన్న రాజకీయ నాయకులు ఇప్పుడు గుప్పెడు అనే పరిస్థితి వచ్చింది. ఉన్నది. ఆచరణలో ప్రస్తుతం రాజకీయ పరిస్థితి దేశంలో కనిపిస్తున్నది.***





**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

ఉత్తర్ ప్రదేశ్ లోని ముజఫ్ఫర్ నగర్ లో ఇటీవల దుకాణాల ముందు యజమానుల పేర్లు రాయించి పెట్టించారు. ఒక సామాజిక వర్గం ను కావాలని ఎక్స్క్లూజ్ చేసి ఆర్థికంగా దెబ్బ తీసే కుట్రలను అపాలని కొందరు కోర్ట్ కు వెళ్లగా కోర్ట్ తీవ్రంగా స్పందించి, ఒక ఆర్డర్ ను పాస్ చేస్తూ, అలాంటి చర్యలను ఆపాలని ఆదేశించడం తో దుకాణ దారులు అంతా అలాంటి బోర్డులను, బ్యానర్లను, నేమ్ కార్డులను, కోర్ట్ ఆర్డర్ మీద హర్షం వ్యక్తం చేస్తూ తొలగించారు. కావడి యాత్ర పేరిట యూపీ ప్రభుత్వం జారి చేసిన ఈ అన్యాయపు, జనాన్ని మతం పేరిట విడదీసే కుట్రను సుప్రీం కోర్ట్ తప్పు పట్టడం, మతోన్మాద రాజకీయాలు చేసే వారికి చెంప పెట్టులాంటిది. నిజానికి కావడి యాత్రకు సంబంధించి, కావడిలు తయారు చేస్తూ జీవనం సాగించే ముస్లిం కుటుంబాలు కూడ యూపీలో బోలెడు ఉన్నాయి. మనుషులను మతం పేరిట విడదీసే రాజకీయాలు చేసేది, పక్కా గా రాజకీయ నేతలే అంటే అతిషయోక్తి కాదు. భారతదేశం రాజకీయాల్లో గత పది ఏండ్ల క్రితం దాకా మతం, కులం పాలు కొంత తక్కువే ఉండేది.

### మత జాడ్యం పెంచిందెవరు !

పది ఏండ్లలో జాడ్యం పెరిగింది. దీనికి కేవలం భాద్యులు, రాజకీయ పార్టీ లు, నేతలు మాత్రమే, అంటే అతిషయోక్తి కాదు. హిందూ, ముస్లిం, సిక్కు, ఈసాయి లు ఒక్కటిగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన, ప్రాణ త్యాగం చేసిన చరిత్ర ఉన్నది. మతోన్మాద రాజకీయ నేతలు దేశంలో గత పది ఏండ్లలో ఒక వర్గం ప్రజలను, ముఖ్యంగా ముస్లింలను అడుగడుగునా, అవమానాల పాలు చేయడం, హత్యలకు గురిచేయడం, కేసులు పెట్టడం, ప్రజల్లో అబాసు చేయడానికి అబద్దాల ప్రచారం చేయడం, ముస్లింలను బ్లేమ్ చేయడానికి ఒక్క అవకాశంను కూడ మిస్ కానీయకుండా అన్ని రకాల ఉపాయాలు చేశారు. చేస్తున్నారు. తమ హిందుత్వ ఎజండా ను అమలు చేయడం కోసం అన్ని రకాల వ్యూహాలను అమలు చేశారు.

### భాద్యత గల మనిషి మాటలేనా ఇవి!

దేశంలో మన లాగే మానవ పుట్టుక పుట్టిన ఒక ప్రధానమంత్రి లాంటి అత్యుత్తమమైన పదవి లో ఉన్న వ్యక్తి తన పుట్టుక బయాలజికల్ కాదని, ఈశ్వరుడు తనని పంపాడు అని చెప్పుకుంటాడు! మనలో కొందరు నిజం అని ఎలా అనుకుంటారు? ఏమి జరుగుతున్నది, మన దేశంలో?మనిషి మన ముందు కనిపిస్తాడు,వాస్తవ చరిత్ర , జగమెరిగిన సత్యమే, అతను తాను మనం పుట్టినట్లు, పుట్టలేదు, అని చెప్పడం ను ఎలా మనం మనుషులుగా జీర్ణించుకుంటాం! ఇది మన పొలిటిషన్స్ కథ! వీరా! మనల్ని పాలించేది, వీరినా మనం ఎన్నుకునేది! ఇంకెంత కాలం ఇలా?భరించుడు! ఒక కులం,ఒక మతం పట్ల ఓర్వలేని తనం ఉన్నోళ్లు మనకు ఎలా నాయకులు అవుతారు?అలాంటి వారే ఇప్పుడు ఎక్కువగా ఎమ్మెల్యే లు, ఎంపీలు గా ఎంపిక అవుతున్నారు. ఓటర్లు ఏదో ఒక ట్రాన్స్ పడిపోయి అలాంటి వారిని గెలిపిస్తున్న కారణంగానే దేశంలో కుల,మతాల, మీద చర్చ ఎక్కువగా జరుగుతున్నది. విభజన చోటు చేసుకుంటున్నది. ముందు ఆ జాడ్యం ఉన్న వాడిని ఎంపిక చేసుకోవడం మనం మానుకోవాలి. వారు సమాజంలో కలుపు మొక్కల లాంటి వారు, వారిని దూరం ఉంచితేనే సమసమాజం సాధ్యం!ఎదుటి మనిషిని, ఎదుటి మనిషిని, తన లాగే మనిషిగా భావించి, అతని సమస్యలను తన సమస్యలు అనుకునే వారే నాయకులు, అలాంటి వారికే ఆ హక్కు ఉంటుంది.దేశంలో నేను,నా పుట్టుక బయోలాజికల్ కాదు,అనే లాంటి వారు,కుల,మత రాజకీయాలు చేసే వారు కాదు నాయకులు! జాగో మేరే భారత్ వాసియో, జాగో! మేల్కొనండి నా భారతదేశం పౌరులారా, అందులో ముఖ్యంగా యువత మేల్కొనండి! ఇప్పుడు కాకుంటే, మరెప్పటికి సాధ్యం కాదు!

# ఊతకర్రలకు ఊతమిచ్చిన కేంద్ర బడ్జెట్

2024-25 బడ్జెట్ లో కేంద్ర ఆర్థిక మంత్రి తెలంగాణకు 11వ సారి కూడా తీవ్ర అన్యాయం చేశారు.గత పదేళ్ళలో మోది ప్రభుత్వ తెలంగాణ అభివృద్ధికి "శుష్క వాగ్దానాలు,శూన్య హస్తాలు" చూపారు. ఈ సారి కూడా మోదీ సూచన మేరకు ఆర్థికమంత్రి,తెలుగింటి కోడలు నిర్మలా సీతారామన్ గారు 'తెలంగాణ' అనే పదాన్ని కూడా కూడా తన 85 నిముషాల బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావించ లేదు. మన తెలంగాణకు బీజేపీ ఇంత అన్యాయం గత పదేళ్ళుగా అదే పనిగా చేస్తున్నా బుద్ధి,జ్ఞానం లేని మన తెలంగాణ ప్రజలు ఏమాత్రం సోయి లేకుండా బీజేపీకి ఓట్లు గుద్ది 8 పార్లమెంట్ సీట్లను కట్టబెట్టారు. ఇప్పుడు తలలు పట్టుకొని ఏం లాభం?

మోదీకి మొదటి నుంచి వ్యక్తిగతంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం ఇష్టం లేదు. ఇప్పటికే రెండు మూడు సార్లు 'తల్లిని చంపి, బిడ్డను తీసారు' అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్ళలో అనేక సార్లు తెలంగాణ అభివృద్ధి పథకాలకు ఆర్థిక సహాయం కోసం కేసీఆర్, ఆయన మంత్రులు కేంద్రానికి అనేక వినతి పత్రాలు ఇచ్చారు,ఇప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా గత 8 నెలల కాలంలో 3 సార్లు తెలంగాణ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని స్వయంగా విజ్ఞప్తులు చేశారు. కేంద్ర మంత్రులను కలిసి ప్రాధేయపడ్డారు. అయినా మోదీ ప్రభుత్వం వారి విజ్ఞప్తిని పెడచెవిన పెట్టింది.

ఆంధ్ర ప్రదేశ్ కు ఈ బడ్జెట్ లో పోలవరం నిర్మాణానికి హామీ లభించింది. రాజధాని నిర్మాణానికి నిధులు సమకూర్చింది. ఉత్తరాంధ్ర, రాయల సీమ పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటు ఇస్తుంది.అలాగే బీహార్ కు రహదారుల నిర్మాణానికి రూ.26 వేల కోట్లు,పవర్ ప్లాంట్ నిర్మాణానికి రూ21,400 కోట్లు,వరదలు నివారణకు రూ.11,500 కోట్లు,గయలో ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణానికి, అలాగే పర్యాటక కేంద్రంగా నలంద ప్రాంతం అభివృద్ధికి,కొత్త ఎయిర్ పోర్టులకు,వైద్య కాలేజీలకు బీహార్ రాష్ట్ర బడ్జెట్ ను తలపించేలా కేంద్ర బడ్జెట్లో కేటాయింపులను ఈసారి నిర్మలమ్మ ప్రభుత్వం చేసింది. సంతోషమే ఆ రాష్ట్రాల అభివృద్ధికి నిధులు ఇవ్వవలసిందే.మనకు అభ్యంతరం లేదు. వారిపై మనకు సోదర రాష్ట్రంగా అసూయ లేదు.కానీ రాష్ట్ర పునర్విభజన చట్టంలో తెలంగాణ కూడా ఉందనే విషయం మోదీ ప్రభుత్వానికి తెలియదా? తెలంగాణ పై ఇంత చిన్నచూపెందుకు?

తెలంగాణ పెండిగ్ సమస్యలు ఉదాహరణకు మూసీ రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్, మెట్రోరైల్, బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్, ఐటీఐఆర్ వంటి సమస్యలపై కనీసం బడ్జెట్ లో ఎందుకు నిధులు కేటాయించే ప్రస్తావన చేయలేదు? తెలంగాణ పై ఇంత కక్ష దేనికి? ఈబడ్జెట్ లో ఎంతో కొంత నిధులు కేటాయిస్తే కేంద్రానికి పోయేదేముంది? మన బీజేపీ ఎంపీలకు తెలంగాణ నుంచి ఓట్లు, సీట్లు మాత్రమే కావాలి కానీ,వారికి తెలంగాణ అభివృద్ధి అవసరం లేదన్నారు.ప్రధానిని,ఆర్థిక మంత్రిని నిధుల కోసం ఎందుకు నిలదీయలేదు?

తెలంగాణలో కాంగ్రెస్,బీఆర్ఎస్ ఉమ్మడిగా బీజేపీ పతనానికి ఏకం కావాలి. బీజేపేతర రాష్ట్రాలలో విపక్ష కూటమితో చేతులు కలిపి దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీని గెలవకుండా చూడాలి.దక్షణాది రాష్ట్రల సొమ్ముతో బీజేపీ పాలిత లేదా బీజేపీ అనుకూల రాష్ట్రల అభివృద్ధికి పక్షపాతంతో ఏకపక్షంగా బీజేపీ ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. తెలంగాణ కూడా భారత దేశంలో ఉందనే సోయి బీజేపీ ప్రభుత్వానికి లేదు. 2014 నంచి ఒక పథకం ప్రకారం సమాఖ్యా విధానానికి బీజేపీ తూట్లు పొడుస్తుంది. లౌకిక సిద్ధాంతానికి హాని చేస్తుంది. కుల,మత భావోద్వేగాలను రెచ్చగొట్టి జాతీయ సమైక్యతా భావాన్ని తృణీకరిస్తుంది. ఉత్తర,దక్షణ ప్రాంతాలుగా సంకుచిత విభజన రాజకీయాలు చేస్తుంది.దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా విపక్షాలు ఐక్యంగా పూర్వపు జనతా పార్టీలా, విపక్షాల ఐక్య సంఘటనగా ఏర్పడి బీజేపీ విముక్త భారత్ నిర్మించుకోవాలి. అప్పుడేమన దేశం వివక్షతలు లేని దేశంగా బాగుపడుతుంది. రేపు శాసన సభలో తెలంగాణ అభివృద్ధికి జరిగిన అన్యాయంపై కాంగ్రెస్, బీఆరెఎస్ ఉమ్మడిగా తీర్మానం చేసి ఉమ్మడిగా రాష్ట్ర సంక్షేమం కోసం ఐక్యంగా పోరాడాలి. మన హక్కులు,అభివృద్ధిని కాపాడుకోవాలి.

- డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్, 9849328496.

# చేదునిజాల కేంద్ర బడ్జెట్!



కేంద్రంలో హ్యాట్రిక్ కొట్టిన మోడీ ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్ ఒక ఆశ ..అనేక నిరాశల మధ్య ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోకసభలో 48.21లక్షల కోట్లతో నిరాడంబరంగా ప్రవేశపెట్టింది.కేంద్ర ప్రభుత్వంలోని భాగస్వామ్య రాష్ట్రాలకు పెద్దపీట వేసింది. మోడీ ప్రభుత్వం భవిష్యత్ రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ కు బడ్జెట్ లో భారీగా నిధులు కేటాయించుతారని ఆశించాం. ప్రభుత్వం మారినా కేంద్రంలోని బీజేపీ తీరు మారలేదు. దశాబ్దంగా రాష్ట్రానికి దక్కింది గుండు సున్నానే. ఇన్నాళ్లు తెలంగాణ,ఏపీ లకు విభజన చట్టంలోని అనేక హామీలను నెరవేర్చకుండా దాటవేసిన మోడీ ప్రభుత్వం అధికారపీఠం క్రిందికి నీళ్లు వస్తాయనే భయంతో ఆంధ్రప్రదేశ్ ను అందలం ఎక్కించింది. ఏ మాత్రం రాజకీయ సంకల్పం లేకపోతే ఇలాగే ఉంటుంది. ఈ బడ్జెట్ రైతులకు, తెలంగాణ కు ఎంతోకొంత మేలు చేస్తుందని ఎదురుచూసిన వారికి దింపుడు కళ్ళం ఆశలే మిగిలాయి. ఇలా ఆశ పెట్టుకోవడానికి కారణాలు లేకపోలేదు, అందులో మొదటిది వ్యవసాయం పండుగలా లేదన్న వాస్తవాన్ని ఆర్థిక సర్వే గుర్తించింది. ఈ పరిస్థితిలో సేద్యం భవిష్యత్ మరింత క్లిష్టతరం కాగలదని కూడా సర్వే అంగీకరించింది. రెండవ పర్యాయం ప్రధాన మంత్రిగా దేశంలో పలుచోట్ల రైతుల ఆందోళనలు మిన్నంటినాయి. ఇది రైతుల అసంతృప్తికి ప్రతిబింబించే పరిణామమే. ఇప్పటికే గ్రామీణ ప్రాంతంలో అన్నదాతలు అసంతృప్తికి లోనైతే ఎలాంటి పరిణా మాలు చవిచూస్తారో పార్లమెంట్ ఎన్నికల్లో తెల్సివచ్చింది. వ్యవసాయానికి ఈ పెంపు రైతాంగానికి ఏ విధంగా ఊతం ఇస్తుందో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

ఈ బడ్జెట్‌లో వ్యవసాయ,అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు.పైగా ఉత్పాదకత,వాతావరణాన్ని తట్టుకునే 9 రకాల వంగడాలను పెంచడంపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టడం ఆనవాయితీ.అంటే వ్యవసాయానికి కావాల్సిన ఇన్ పుట్స్,సాధనాలు,నీటి పారుదల,విద్యుత్ ,మౌలిక వసతులు,ఎరువులు వగైరాలపై దృష్టి పెట్టడం ద్వారా అధిక ఉత్పత్తి సాధించడం అందుకు భిన్నంగా ప్రధాని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని, కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి రైతన్నల నడ్డివిరిచింది. 2023-24 సంవత్సరంలో 1,25,036 కోట్లు కేటాయించి ఎన్నో విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది.బ్యాంకుల ద్వారా కార్పొరేట్ సంస్థలకు,చిన్న పరిశ్రమలకు రుణమాఫీ ప్రకటించిన ప్రభుత్వం రైతుల విషయంలో మాత్రం అలంటి ఔదార్యం చూపకపోవడంతో వారి మనోభావాలు తీవ్రస్థాయిలో గాయపడ్డాయి. ఈ పరిస్థితులలో రుణ సదుపాయాలు కూడా సరైన ఫలితాలు సాధించడం కష్టం. ఓట్లు దండుకోవడానికి బూటకపు వాగ్దానాలు, అవసరమైన రంగాలకు తక్కువ కేటాయింపులు, సంక్షేమ రంగాలకు కేటాయించిన నిధులను కూడా ఇతర రంగాలకు ఇబ్బడి, ముబ్బడి కేటాయింపులు చేసి, అంత కన్నా ఎక్కువ కూడ వెచ్చించడం అనే భారత బడ్జెట్ల నిత్య స్వభావానికి ఈ బడ్జెట్ అద్దం పడుతున్నది. వ్యవసాయం, గ్రామీణాభి వృద్ధి, ఆరోగ్యం, విద్య, ఉపాధికల్పన, మధ్యతరహా, చిన్న, సూక్ష్మ పరిశ్రమ రంగాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని ప్రకటించిన నిర్మలా సీతారామన్ ఉపన్యాసంలోని అంకెల గారడీని అబద్దాల ను, అతిశయోక్తులను విప్పి చూస్తే వాస్తవంగా ఆ రంగాలకు ఒరిగినది ఏమిలేదనే విమర్శ ఉంది.

దేశ ఆర్థికవ్యవస్థ మందగమనంలో ఉన్నప్పటికీ దేశంలోని కుబేరుల సంపద మాత్రం అంతకంతకూ పెరిగింది.ఒక శాతంగా అత్యంత ధనవంతుల సంపద 95 కోట్లమంది పేదల సంపద కన్న నాలుగింతలు ఎక్కువ. దేశంలో ఉన్న 60శాతం మంది కోటీశ్వరుల వద్ద ఉన్న సంపద మనదేశ బడ్జెట్ 2024-25 కన్నా ఎక్కువగా ఉన్నది.మరో వైపు ఆర్థికవ్యవస్థ స్థితిగతుల గురించి మాట్లాడుకుంటున్నప్పుడు మాత్రం దేశ ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగానే, మందగమనంలో ఉన్నదని తెలుస్తున్నది.మోడీ బాధ్యతలు తీసుకున్న తర్వాత 2016-17 ఆర్థిక సంవత్సరం నుంచి దేశ ఉత్పాదకతను పెంచుతూ ఉద్యోగ కల్పనకు పెద్దపీత వేసేందుకు కార్పొరేట్ పన్నులను తగ్గిస్తున్నట్లు చెప్పుకొచ్చారు.ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని డంబాచారం చేసినా.. అది వాస్తవరూపంలో కన్పించలేదు.దేశంలో చిన్న పరిశ్రమల స్థాపన, అభివృద్ధి ఆశించిన మేర జరుగలేదు. పారిశ్రామిక,కార్మిక సంబంధాలు,పర్యావరణ పరిరక్షణ చర్యలు బలహీనపడినాయి.ఫలితంగా మోడీ ప్రభుత్వం చెప్పినట్టుగా వృద్ధిరేటు నమోదు కాలేదు.ఇది పూర్తిగా రాజకీయ బడ్జెట్ గా కుర్చీ కాపాడుకునేందుకు బీహార్ రాష్ట్రానికి దాదాపు 60వేల కోట్లు వివిధ రూపాల్లో కేటాయించారు.మోడీ అసంబద్ధ విధానాలతో దేశంలో పేదరికం,ఆకలి దారిద్ర్యాలు పెరిగిపోయాయి.ఈ పేదరికం కేంద్ర,పాలిత ప్రాంతాలు కూడా చేరటం ఆందోళన కల్గించే విషయం. నిరుద్యోగిత రేటు పెరుగుతున్న వేళ వ్యతిరేకతను తగ్గించుకోవడానికి ఉపశమనాన్నిచ్చే ప్రకటనలు చేసింది. భవిష్యత్ కాలం కోసమైనా తాజా బడ్జెట్ ఉపిరిపోస్తుందని ఎదురు చూసి,ప్రయోజనం లేకుండా పోయిందని సబ్బండ వర్గాలు దుయ్యపడుతున్నారు.

గత పదేండ్లుగా దేశంలోని బడుగు,బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయం ఈ బడ్జెట్ లో మరోసారి పునరావృతం అయ్యింది. కులగణన, జనగణన పై బీజేపీ చూపుతున్న వివక్ష మరోమారు రుజువు అయ్యింది. కులగణన కు కట్టుబడి ఉన్నామని చెప్పే ఇండియా కూటమి నిలదీసి, ప్రతిఘటించాల్సిన అవసరం ఉంది. బీజేపీ,బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంలో పదహారు సీట్లు కట్టబెట్టనందుకు తెలంగాణపై వివక్షతో మొండి చెయ్యి చూపింది.తెలుగు రాష్ట్రం కోడలు తెలంగాణ పేరును ప్రస్తావించడానికి కూడా ఇష్టపడలేదు. సబ్ కో సాత్ సబ్ కా నిరాశ్ అన్న రీతిలో ఏ వర్గాన్నీ పెద్దగా ఆకట్టుకోలేక పోయింది.నాడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా మోడీని కలవలేదని, అడగలేదని చెప్పుకొచ్చే బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత వివిధ అంశాలపై ప్రతిపాదనలతో 18సార్లు కల్సినప్పటికీ తెలంగాణ కు భరోసా కల్పించడంలో సవతి ప్రేమ చూపింది.డబుల్ ఇంజన్ సర్కార్ కె ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. వికసిత భారత్- 2047 లక్ష్యం చేధించేందుకు ఉద్దీపన చర్యలు చేపట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో ద్రవ్య లోటు 4.9శాతానికి పరిమితం చేయాలనీ నిర్దేశించుకుంది. అదేవిధంగా వృద్ధి రేటు 7శాతం వరకు ఉండొచ్చని అంచనా వేసింది.కాంగ్రెస్ తల్లిని చంపి బిడ్డను వేరు చేసిందనే భావంతో ఉన్న మోడీ కాంగ్రెస్ పాలిస్తున్న తెలంగాణ రాష్ట్రాన్ని బడ్జెట్ లో అనాథను చేసిందనే అభిప్రాయం నెలకొంది.రాష్ట్రంలోని కిషన్ రెడ్డి,సంజయ్ మంత్రులుగా ఉండి కేటాయింపుల్లో గుండు సున్నా రావడమేమిటని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.తెలంగాణ ప్రజలు మోడీని నమ్మి ఎనిమిది సీట్లు ఇచ్చిన పాపానికి నట్టేట ముంచారని, భవిష్యత్ లో ఇక నూకలు చెల్లడం ఖాయం.



**డాక్టర్ సంగని మల్లేశ్వర్**
విభాగాధిపతి, జర్నలిజం శాఖ,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్,
9866255355

# అరబ్బులు.. ఆడు జీవితం

ఇస్లామియా ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ఈజిప్ట వెళ్తున్నప్పుడు తను ప్రయాణించే ఒంటెపై ఎక్కువ భారం మోపటం ఇష్టం లేక తన వద్ద పనిచేసే ఒంటెను లాగే సేవకునితో 'నీవు కొద్ది దూరం ఒంటెను నడిపించు, నేను కొద్ది దూరం ఒంటెను నడిపిస్తాను, నేను నడిపేటపుడు నీవు ఒంటెపై కూర్చో' అని పురమాయిస్తారు. అలా సాగిన ఆ ప్రయాణంలో ఈజిప్ట సరిహద్దులు వద్దకు చేరేసరికి సేవకుడు ఒంటెపై కూర్చుని ఉంటాడు. ఖలీఫా ఉమర్ ఒంటె లాగుతుంటారు. అక్కడ వేచి ఉన్న ప్రజలు ఒంటెపై కూర్చుని ఉన్నది సేవకుడని, సేవకుని స్థానంలో ఉన్నది ఖలీఫా అని తెల్సుకుని ఆశ్చర్యపోతారు. మరొక సందర్భంలో అల్సిపోయి విశ్రమించిన సేవకునికి కాళ్లు వత్తుతూ సేవ చేస్తారు. ఇది హజ్రత్ ఉమర్ రజిలో ఇస్లాం తెచ్చిన మార్పు...ఎవరీ ఉమర్ రజి? ఇస్లాం స్వీకరణకు పూర్వం అత్యంత కర్కోటకుడిగా పేరొందిన ఉమర్ - ఇస్లాం స్వీకరించాక అత్యంత దయామయునిగా, ఇస్లామియా చరిత్రలోనే గొప్ప పాలకునిగా పేరుగాంచారు. మహాత్మా గాంధీ ఓ సందర్భంలో "హజ్రత్ ఉమర్ రజిఅల్లాతాలన్హా వంటి వారు ఈ భూమండలాన్ని పాలిస్తే మానవాళిలో సుఖశాంతులు వర్ధిల్లుతాయని అన్నారంటే ఉమర్ రజి ఏమిటో అర్థమౌతుంది...వీరంతా అరబ్బులే.

ఇస్లాం అరబ్బులలో లేని కాలంలో అరబ్బులు ఎలా ఉండేవారు ? జూదం, వ్యభిచారం, మద్యపానం, హింస సర్వసామాన్యమైన సమాజం.ఒక జాతి వానికి చెందిన ఒంటె దారి తప్పి వేరే జాతి వానికి చెందిన పొలంలో మేత మేస్తే రెండు జాతులు యుద్ధం చేసుకుని వేల మంది మరణించారు.తమకు ఆడపిల్లలు జన్మిస్తే అవమానం గా భావించి ఎడారిలో సజీవంగా పాతిపెట్టే మూర్ఖులతో నిండిన సమాజం. ఇలాంటి సమాజంలో జన్మించిన దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని ప్రేమ, దయ, కారుణ్యం వైపుకు నడిపారు. విద్యను, విజ్ఞాన్వేషణను ప్రోత్సహించి వారిని ఆధునిక యుగం వైపుకు నడిపారు. అందుకు హజ్రత్ ఉమర్ రజిఅల్లాతాలన్హాలో వచ్చిన మార్పు ఒక ఉదాహరణ మాత్రమే.

అయితే అరబ్బులంతా ఇలాంటి వారేనా?వారిలో క్రూరులు, మానవత్వం లేనివారు ఉండరా?అసలు ప్రపంచంలోని అన్ని సమాజాల్లోనూ మంచి వారు,చెడ్డ వారు ఉంటారు. చెడ్డ వారిని ఉదాహరణగా చూపి ఒక జాతిని పూర్తిగా చెడ్డవారిగా నిర్ధారించడం సమంజసమేనా ?అలాగని నేను అరబ్బుల్ని సమర్ధించటం లేదు.అరబ్బులేమీ ఆకాశం నుండి ఊడిపడలేదు. పవిత్ర ఖుర్ఆన్ మానవులంతా సమానులే అంటోంది.ఒక జాతిని దైవజనులుగా ఇస్లాం చెప్పదు. ప్రపంచానికి విజ్ఞాన శాస్త్రాల్ని, తాత్విక దృక్పథాన్ని అందించిన అరబ్బులు ఈ రోజెందుకు విమర్శించబడుతున్నారు.(అందరూ కాదు) కారణం వారు ఇస్లాంను కేవలం తమ ప్రార్ధనలకు మాత్రమే పరిమితం చేసుకున్నారు. ఆయిల్ బావులతో ఇబ్బడిముబ్బడిగా వచ్చిన సంపదతో ఇస్లాం ప్రబోధించిన విద్య,విజ్ఞాన్వేషణలకు దూరమయ్యారు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి దాసోహులైన అరబ్బు రాజులు పాలకుని ప్రజలే ఎన్నుకోవాలనే ఇస్లామియా ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి నేటి ఆధునిక ప్రజాస్వామిక యుగంలో సైతం అనువంశిక రాజరికాన్నే పాటిస్తున్నారు..వీరి విశ్వాసరాహిత్యంలో లోపాల్ని గమనించిన యూరోపియన్ సామ్రాజ్యవాదులు వీరిని షియాలుగా, సున్నీలుగా చీల్చి ఒకరిపై ఒకరికి విబేధాలు కల్పించి యుద్ధాలు ఎగదోస్తున్నారు..భారత దేశంలోని హైదరాబాద్ వంటి పేద బస్తీల్లో నిఖా పేరుతో కొంతమంది అరబ్బు విలాసపరులు సాగిస్తున్న దుర్మార్గాలను నా కవిత్వంలో ఎప్పుడో ప్రశ్నించాను.

'పాతబస్తీ మఖ్మల్కా పట్టా
పైసాతో నిఖా నామా
నెత్తురు పల్చబడ్డాక తలాఖ్ నామా
యా అల్లాహ్ హమ్ కో మాఫ్ కర్నా"

ఇక ఆడు జీవితం సినిమా గురించి జరుగుతున్న చర్చ గురించి మాట్లాడుకుందాం. నేనా సినిమా చూడలేదు.ఆ సినిమాలో చూపించారని చెప్తున్న ఉదంతాలన్నీ అబద్దాలేమీ కావు.అరబ్బులంతా దయామయులేమీ కాదు.అందులోనూ శ్రమదోపిడీ చేసే తత్వం, క్రూరత్వం నిండిన యజమాను లుండటం అసహజమేమీ కాదు.ఆ మాటకొస్తే ప్రపంచంలోని ఏ జాతికి ఇటువంటి మినహాయింపు లేమీ లేవు.కానీ అరబ్బు యజమానులు తమ వద్ద పనిచేసే వారిపై సాగించే దుష్ప్రవర్తనకు మూలం వారు సరియైన ఇస్లామియా జ్ఞానానికి దూరం కావటమే.ఇస్లామియా అవగాహన ఉన్నవారు హజ్రత్ ఉమర్ రజిఅల్లాతాలన్హాలా తమ ఆచరణను మార్చుకుంటారు.అలా లేని వారు క్రూరుడైన అబూజహల్ లా జీవిస్తారు....

దశాబ్దాలుగా పాలస్తీనియన్లను లక్షలమందిని చంపుతూ ఇజ్రాయెల్ సాగించిన,సాగించే మారణకాండకు మొత్తం యూదుల్ని నిందించటం, రెండు ప్రపంచ యుద్ధాలలో కోట్ల మంది ప్రజల్ని మట్టుబెట్టిన అమెరికా,తదితర యూరోపియన్లను సాకుగా చూపి మొత్తం యూరోపియన్లను,వారి మతాన్ని నిందించగలమా ?మయన్మార్లో రోహింగ్యలపై బుద్ధిస్టులు అని భావించుకునేవారు సాగించిన హింసకు బౌద్ధం కారణమా?ఏదో ఒక సాకుతో నిరంతరం ఇస్లాంపై సాగించే దుష్ప్రచారం వల్ల ఇస్లాంకు వచ్చిన నష్టం ఏమీ లేదు..కాకపోతే మన అసహనం బయట పడుతుందంతే...

- కవి కరీముల్లా

## స్త్రీ పూజింపబడే నా దేశంలో...

ఎటు చూసినా కామపిశాచులే
బడిలో.. గుడిలో
కార్యాలయంలో
కార్ఖానాలో
ఎటు చూసినా కామపిశాచులే
పసికూన మొదలు
పండు ముదుసలి వరకు
వయోభేదం లేదు
వావి వరసలు లేవు
బంధుత్వాలు లేవు
నిండు గర్భిణిని సైతం
ఎవ్వరినీ వదలరు
ఎటు చూసినా కామపిశాచులే.
స్త్రీ పూజించబడే నా దేశం
సంస్కృతీ, సాంప్రదాయాల
దేవాలయం నా దేశం
స్త్రీ తోనే జననం
ఆమె తోనే గమనం
అమ్మతోనే పయనం
అంతటా ఇంతియే కదా!
కానీ..ఎటు చూసినా
ఎగాదిగా చూసే కళ్లే
అర్థరాత్రి మహిళ
ఆరు బయటకు వస్తే
మరణ సమానమే
కామపిశాచుల కళ్ళను
కుళ్ళ పొడిచినప్పుడే
గాంధీజీ కలలు కన్న
గ్రామ స్వరాజ్యం



**గూళ్ల వెంకటయ్య,**
ప్రధానాచార్యులు,
ప్రభుత్వ జూనియర్ కళాశాల,
మంగపేట
99633 08744

# ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజాసంక్షేమ బడ్జెట్

### ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, జూలై 25 (జనంసాక్షి)**

రాష్ట్ర అసెంబ్లీలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిందని, గతంలో మునుపెన్నడూ లేనంత ఒక పకడ్బందీ వ్యూహంతో సబ్బండవర్గాలకు మేలుచేకూర్చే విధంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టడం జరిగిందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడిగాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం శేరిలింగంపల్లిలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర సమాగ్రాభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని, ఎందుకు రాష్ట్ర రథసారథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని సమన్వయపరచుకుంటూ విజయవంతంగా కార్యాచరణలు చేపట్టడం జరిగిందని అరికెపూడి కొనియాడారు. అధిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క రెండు లక్షల 91 వేల 159 కోట్ల రూపాయలతో అత్యంత భారీ బడ్జెట్ ను ప్రవేశపెట్టడమే కాకుండా, ప్రతి సామాజిక వర్గం, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చే విధంగా బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధికై 10 వేలకోట్ల రూపాయలను కేటాయించడం ఎంతో హర్షణీయమని, ఆరోగ్యశ్రీ, ఉచిత వైద్యం తదితర పథకాలకు భారీ నిధులను కేటాయించడం ముఖ్యమంత్రి దూరదృష్టికి నిలువెత్తు నిదర్శనం అన్నారు. పౌరసరఫరాలకు, మహిళా సంక్షేమానికి, విభిన్న సంస్కృతమైన సమాజంలో అట్టడుగున ఉన్న ఆఖరి వ్యక్తి దాకా ప్రగతి ఫలాలను అందించాలని, రాష్ట్ర సంక్షేమమే ప్రధాన ఆశయంగా రాష్ట్రాన్ని ప్రగతి పదం వైపు నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కైనా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌పై మేయర్ కలెక్టర్‌కు ఫిర్యాదు

**రాజేంద్రనగర్, జూలై 25(జనంసాక్షి)**



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ లతా ప్రేమ్ గౌడ్ పాలక వర్గం వర్సెస్ కమిషనర్ బి. శరత్ చంద్ర లకు వైరం కొనసాగుతుంది. దీనికి నిదర్శనమే గురువారం కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్‌లు స్ట్రీట్ లైట్లు, అత్యవసర పనులపై పాలకవర్గంతో కౌన్సిల్ సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహించాల్సిన సమయంలో మేయర్, డిప్యూటీ మేయర్‌లను కాదని ఎమ్మెల్యేతో శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేయాల్సిందిగా కమిషనర్ సొంత నిర్ణయాలతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌లకు, తమతో విభేదాలు సృష్టిస్తున్నారని మేయర్ లతా ప్రేమ్ గౌడ్, డిప్యూటీ మేయర్ పి. రాజేందర్ రెడ్డిలు కలిసి రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్ ద్వారా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. అలాగే కార్పొరేషన్‌లో శంకుస్థాపన కార్యక్రమంలో కార్పొరేటర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కమిషనర్ వ్యవహరించారని, గతంలో శంకుస్థాపనలు ప్రారంభించిన వివిధ వార్డుల్లో తిరిగి ఎమ్మెల్యేతో శంకుస్థాపనలు చేయించడంపై కమీషనర్ వ్యవహరించిన తీరుపై కౌన్సిలర్లు విముఖత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తలారి చంద్రశేఖర్, రవీందర్ రెడ్డి, నికిలా సంగారెడ్డి, ఆసియా కాజా, సంతోషి రాజి రెడ్డిలు ఉన్నారు.



### బిజెఎంసీలో రూ.557 లక్షలతో శంకుస్థాపన

**రాజేంద్రనగర్, జూలై 25(జనం సాక్షి)**

నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ557 లక్షలతో పలు వార్డులో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వార్డు నెం.1, 10, 11, 14,16, 19వార్డులలో తిరుమల హిల్స్, ఇందిరమ్మ కాలనీ, శ్రీనివాస నగర్ కాలనీ వినాయక నగర్ ఓల్డ్ విలేజ్ దర్గాలలో సీసీ రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ బి.శరత్ చంద్ర, అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ మహేందర్ గౌడ్, పిఎసిసి చైర్మన్ రాందాస్ ముదిరాజ్, కార్పొరేటర్లు సాగర్ గౌడ్, అస్లాంబిన్ అబ్దుల్లా, కో ఆప్షన్ సభ్యులు మలాకిరత్నం నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పాపయ్య యాదవ్, గోకరి సురేష్ గౌడ్, టింకు రెడ్డి, సుమన్ గౌడ్ పాల్గొన్నారు.

## ఈ-ఆఫీసుతోనే కార్యకలాపాలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ శశాంక

**ఇబ్రహీంపట్నం, జూలై 25 (జనంసాక్షి)**



రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక ఈ-ఆఫీసు నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ ఫైళ్లన్నీ ఈ ఆఫీస్ ద్వారానే పంపాలని కలెక్టర్ తెలిపారు. ఈ ఆఫీస్ ద్వారా ఫైళ్లన్నీ పంపేందుకు ప్రతి ఒక్క శాఖ అలవాటు చేసుకోవాలని, అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఏర్పరుచుకోవాలన్నారు. ప్రతి శాఖ అవసరమైన సామాగ్రి సమకూర్చుకోవాలని, రాబోయే రోజులన్నీ సాంకేతిక పరిజ్ఞానం పైనే ఆధారపడి ఉంటాయని అందువల్లన ప్రతి శాఖలో ఈ-ఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని అన్నారు. శాఖల వారిగా లాగిన్స్ పెండుగులో లేకుండా త్వరతగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు చర్యలు చేపడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, వ్యవసాయ శాఖ, మత్స్యశాఖ, పంచాయతీ శాఖ, ఉద్యానవన శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, మైనారిటీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, పంచాయత్ రాజ్, మెప్మా మొదలైన శాఖల్లలో బల్క్ ఇమెయిల్ ఐడీలను క్రీయేట్ చేసుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇప్పటి వరకు ఐడీలు క్రియేట్ కానీ ఎడల త్వరతగతిన ఏర్పాటు చేసుకోని కావాల్సిన సాంకేతిక పరిజ్ఞాణంలో అధికారులందరూ ట్రైనింగ్ తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తతతో వ్యవహరించండి

### శేరిలింగంపల్లి జెడ్సి ఉపేందర్ రెడ్డి

**శేరిలింగంపల్లి, జూలై 25 (జనంసాక్షి) :**



వర్షాకాలంలో నీటి కాలుష్యం, వాతావరణ మార్పుల వల్ల వర్షాకాల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఈ విషయంలో జిహెచ్ఎంసి అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని మల్కం చెరువు, శిల్పారామం రోడ్డు, కొత్తగూడ కూడలి, గచ్చిబౌలి, బయోడైవర్సిటీ తదితర ప్రాంతాలలో జోనల్ కమిషనర్ గురువారం ఆకస్మిక తనిఖీలను చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వర్షాకాలం కారణంగా వాతావరణంలో బలమైన మార్పులు సంభవిస్తాయని, ఉష్ణోగ్రతలో వచ్చే తేడా, నీటి కాలుష్యం కారణంగా వివిధ వ్యాధులు ప్రబలకుండా అధికారులంతా తగిన చర్యలు చేపట్టాలని ఉపేందర్‌రెడ్డి తెలిపారు. వర్షాకాలం ముగిసే వరకు ఆయా విభాగాలు క్షేత్రస్థాయిలో ఉండి ట్రాఫిక్, ప్రజారోగ్యానికి ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జడ్సీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, విక్రం, ఈఈ శ్రీనివాస్, డీఈ శిరీష, వైద్యాధికారి డాక్టర్ నగేష్, డిప్యూటీ ఈఈలు ఉన్నారు.

## జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

### సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతి

**ఎల్బీనగర్ జూలై 25 (జనం సాక్షి)**



జిహెచ్ఎంసి ఎల్బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌ని కలిసి డివిజన్ సమస్యల పైన కొత్తపేట్ డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కి కార్పొరేటర్ వివరిస్తూ కొత్తపేట్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి కాలనీలలో అనేక సమస్యలు నెలకొన్నాయని గత ఎన్నో సంవత్సరాల క్రితం వేసినటువంటి రోడ్లన్నీ వర్షాలకు వరదలకు కొట్టుకుపోయాయి. డ్రైనేజ్ లైన్ కోసం గుంతలు తీసి మరమత్తులు చేయలేదు వాటి వల్ల రోడ్లన్నీ బురదగా మారి ప్రజలు నడవలేని స్థితిలో అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోనీ నూతన సీసీ రోడ్లను ఏర్పాటు చేయాలని కమిషనర్‌ని కోరారు. రాఘవేంద్ర కాలనీ రోడ్ నెంబర్ 2 నుంచి 5 వరకు 3 అడుగుల సీసీ పైప్ లైన్, న్యూ నాగోల్ కాలనీ రోడ్ నెంబర్ 10 నుండి సంతపురి కాలనీ బాక్స్ డ్రైనేజ్ వరకు నూతన మూడు అడుగుల ఆర్‌సిసి పైప్ లైన్ మంజూరు చేయాలని కోరడం జరిగింది. శివమ్మ నగర్ కాలనీ, శ్రీ శివశంకర్ కాలనీ కమ్యూనిటీ హాల్ లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజల అవసరాల మేరకు నూతన కమ్యూనిటీ హాల్ మంజూరు చేయవలసిందిగా కోరారు. కొత్తపేట్ డివిజన్ పరిధిలో లోతట్టు ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. భారీ వర్షాలు కురుస్తుండడంతో కాలనీలో గుంతలు ఏర్పడి జలమయంగా మారుతున్నాయి. ఎటువంటి ప్రమాదకర సంఘటనలు జరగకుండా తగినటువంటి జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కమిషనర్‌ని కోరారు.

# అన్ని వర్గాల అభివృద్ధికే ఈ బడ్జెట్

### ఆరు గ్యారెంటీలకు హామీ పత్రం ఈ బడ్జెట్
### దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**



తెలంగాణ రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపించిందని, గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం సృష్టించిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఈ బడ్జెట్ ను రూపొందించిందని మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ బడ్జెట్ ను ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖమాత్యులు మల్లు భట్టీ విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిఎంఆర్ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇది తొలి వాస్తవిక బడ్జెట్ అని, బడ్జెట్ పూర్తిగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టే విధంగా ఉందన్నారు. ఈ బడ్జెట్ రైతుల బడ్జెట్ అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని ఈ బడ్జెట్ తో మరో సారి రుజువైందన్నారు. రైతును రాజు చేసే దిశగా బడ్జెట్ ఉందని ఏకంగా 72659 కోట్ల రూపాయలను వ్యవసాయరంగానికి కేటాయింపులు జరిగాయన్నారు. రుణమాఫీ కి 31 వేల కోట్లు బడ్జెట్లో ఉందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇప్పటికీ అమలు చేసిన మహాలక్ష్మి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం 500కు గ్యాస్ సిలిండర్, గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా చేయూత పథకాలన్నింటికీ సరిపడే నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్ కేటాయించిందన్నారు. ఈ సంవత్సరం నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించి, భారీగా అప్పులు తెచ్చి విధ్వంసం చేసిందని, తెలంగాణ ఏర్పాటు నాటికి 75577 కోట్ల అప్పులు ఉండగా గత ఏడాది డిసెంబర్ నాటికి ఈ అప్పు 6 లక్షల 71 వేల 757 కోట్లకు చేరిందని, గడిచిన పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ అప్పు పది రెట్లు పెరిగిందని ఆయన అన్నారు. మా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఈ ఎనిమిది నెలల్లో 35,118 రూపాయలు రుణాలు తీసుకుంటే.. అందులో గత ప్రభుత్వం తెచ్చిన అప్పులు, వడ్డీలతో కలిపి 42892 కోట్లు రీ పేమెంట్ చేశామని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ పై అవాక్కులు, చవాకులు మాట్లాడుతున్న కేసీఆర్ తన ప్రభుత్వం లో దళిత బందుకు 17,000 కేటాయించి, ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా దళితులను మోసం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు . బడ్జెట్ గురించి మాట్లాడే హక్కు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు లేదన్నారు. చీల్చి చెండాడుతా అంటూ ఆయన వేస్తున్న కుప్పిగంతులు, ఆయన టక్కు, టమారా విద్యలు మాతో నడవవని అసెంబ్లీలో నీ జాతకం, నీ బండారం, ఆధారాలతో సహా బయట పెట్టడానికి మా ముఖ్యమంత్రి, మంత్రులు, నూతన ఎమ్మెల్యేలము సిద్ధంగా ఉన్నామంటూ జిఎంఆర్ కేసీఆర్‌పై మండిపడ్డారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలి



### ఎస్సి బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**మానవపాడు, జూలై 25 (జనం సాక్షి)**

ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ బియం సంతోష్ అధికారులకు ఆదేశించారు. గురువారం జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజకవర్గం..ఉండవెల్లి మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహంను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో రూమ్స్ , త్రాగునీటి సరఫరా, కిచెన్ రూం, పరిశుభ్రతను పరిశీలించారు. వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య, ఏ తరగతిలో చదువుతున్నారు, ఎన్ని రూమ్స్ ఉన్నాయి, పాఠశాల టైమింగ్స్, హాస్టల్ నుండి పాఠశాలకు ఎంత దూరమని అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్య, భోజనం మెనూ ప్రకారంగా అందించాలని సూచించారు. వారి చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని తెలిపారు. అనంతరం అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని పిజెపి క్యాంప్‌లోని ప్రభుత్వ క్వార్టర్స్ ను పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తి కాకుండా ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసి ఆసుపత్రి సిబ్బందికి మెరుగైన వసతులు సౌకర్యలు కల్పించాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా బీసీ అభివృద్ధి అధికారి శ్వేత ప్రియ దర్శిని, తహసీల్దార్ సాలిముద్దీన్, ఎఎస్‌డబ్లు సరోజ వసతి గృహాల ప్రత్యేక అధికారులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దొంగిలించిన 345 సెల్ ఫోన్లు స్వాధీనం



**శేరిలింగంపల్లి, జూలై 25 (జనం సాక్షి) :**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నెల రోజుల వ్యవధిలో వివిధ మహిళలు, వ్యక్తుల నుండి దొంగిలించబడిన 345 మొబైల్ ఫోన్లను సబరాబాద్ పోలీసు అధికారులు స్వాధీనం చేసుకొని గురువారం బాధితులకు అందజేశారు. ఈ మేరకు సైబరాబాద్ క్రైమ్స్ విభాగం డిసిపి నరసింహ ప్రత్యేక మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసివివరాలను వెల్లడించారు. ఈ మధ్యకాలంలో విలువైన మొబైల్ ఫోన్లను దొంగిలించడం, వాటిని నిరుపేద దేశాలకు, ఇతరులకు చౌకగా అమ్మేయడం కొన్ని మాఫియా ముఠాలు వ్యాపారంగామార్చుకోవడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో గత ఏప్రిల్, 2023 లో సిఈఐఆర్ పోర్టల్ ను సాంకేతికంగా అభివృద్ధి చేసి దేశవ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో దానిని వినియోగించుకునేందుకు మంజూరు చేయడంతో మొబైల్ ఫోన్లను తస్కరించే దొంగల పాలిట సిఈఐఆర్ ప్రాణ సంఘటనగా మారిందన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫోన్ కు సంబంధించిన వివరాలను నమోదు చేయించి కేసును రిజిస్టర్ చేస్తే మొబైల్ ఫోన్ ఎక్కడ వాడినా దొంగిలించిన వ్యక్తి లోకేషన్ ను చూపించి దొంగలను పట్టుకోవడానికి ఈ పరిజ్ఞానం ఉపయోగపడుతుందని డిసిపి వివరించారు. ఇందులో భాగంగా గత 30 రోజుల వ్యవధిలో సైబరాబాద్ పరిధిలో దొంగిలించబడిన 345 మొబైల్ ఫోన్లను స్వాధీన పరచుకొని బాధితులకు అందజేయడంతో వారంతా హర్షం వ్యక్తం చేసినట్లు సైబర్ క్రైమ్ డిసిపి నరసింహ పేర్కొన్నారు. ఎవరైనా మొబైల్ ఫోన్ ని పోగొట్టుకున్న తరుణంలో ఎన్సి ఆర్పి పోర్టల్ లో, సిఈఐఆర్ పోర్టల్‌లో లేదా 1930 కి డయల్ చేసి వివరాలను నమోదు చేయిస్తే సాధ్యమైనంతవరకు మొబైల్ దొరికే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ జగదీశ్వర్, ఐటి సెల్ టీం తదితరులను డిసిపి ప్రత్యేకంగా అభినందించారు.



## గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలు

- రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎండీ రియాజ్
- నాగారంలో గ్రంథాలయం ప్రారంభం

**కీసర,జులై 25 (జనంసాక్షి)**

గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు విద్యార్థి దశనుండే గ్రంథాలయాలకు వెళ్లి జ్ఞానాన్ని సముపార్జించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయం చైర్మన్ డాక్టర్ ఎండీ రియాజ్, గ్రంథాలయ డైరెక్టర్ ఏవిఎన్ రాజులు గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. నాగారం మున్సిపాలిటీలోని నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంధాలయాన్ని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎండీ రియాజ్, గ్రంథాలయ డైరెక్టర్ ఏవిఎన్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయం పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ.. గ్రంథాలయంలో కావలసిన పుస్తకాలను, ఎప్పటికప్పుడు పంపించేటట్టు కృషి చేస్తామని, ఎల్లప్పుడూ గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్దమయ్యే వారికి, గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులు, నిరుద్యోగులు, సీనియర్ సిటిజన్స్, ప్రతి ఒక్కరు కూడా గ్రంథాలయమును ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు సుర్వి శ్రీనివాస్ గౌడ్, పంగ హరిబాబు, బిజ్జ శ్రీనివాస్ గౌడ్, కౌకుట్ల అనంత రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు అశోక్ గౌడ్, ఆదామ్ షఫీక్, నాయకులు మోకు జగన్మోహన్ రెడ్డి, గూడూరు ఆంజనేయులు గౌడ్, కొమిరెల్లి సుధాకర్ రెడ్డి, కౌకుట్ల కృష్ణారెడ్డి, అన్నం రాజు శ్రీనివాస్, మేడ్చల్ మల్కాజ్గిరి గ్రంథాలయ సెక్రటరీ సురేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇష్టం లేని పెళ్లికి వచ్చిన పెళ్లికొడుకు కేసిఆర్

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**



ఇష్టం లేని పెళ్లికి వచ్చిన పెళ్లి కొడుకు కేసీఆర్ అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం బడ్జెట్ సమావేశాల అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ లతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలు చూడలేమనుకొన్నది , చూడరు అనుకున్నది తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు చూశారని అన్నారు. మాట్లాడానికి వీలు లేదని మీడియా పాయింట్ నే బహిష్కరించి నిషేధించిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని, కానీ ఈరోజు అదే మీడియా పాయింట్ వద్ద కేసిఆర్ బడ్జెట్ గురించి మాట్లాడడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఎట్లా ఉండాలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అర్థమైందని ఆయన చెప్పారు. ఈ బడ్జెట్ ప్రజాసంక్షేమం కోసం, రైతు బాగు కోసం, మహిళా అభివృద్ధి కోసం, విద్యా, వైద్యం బలోపేతం కోసం, యువత నైపుణ్యం శిక్షణ పెంచుట కోసం ఒకటేమిటి ప్రతి ఒక్కరికి మేలుచేసే గొప్ప బడ్జెట్ ఇదని ఆయన స్పష్టం చేశారు. ఒక్కొక్క పథకానికి ఇప్పటివరకు ఎంత ఖర్చు పెట్టినాము మిగతా నెలలో ఎంత ఖర్చు పెట్టబోతున్నామని స్పష్టంగా పారదర్శకంగా ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెరిచిన పుస్తకంగా తెలంగాణ ప్రజల ముందు ఉంచారని తెలంగాణలో వ్యవసాయాన్ని పండుగ చేయడానికి 72,000 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని దేశంలో ఏ ప్రభుత్వమైనా ఇప్పటివరకు ఇచ్చిందో లేదో తెలియదు కానీ మన తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఇదే తొలిసారి అని జరిగిందని ఆయన పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హునికి అందజేయాలన్నదే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. బిఆర్ఎస్ నాయకులు బడ్జెట్ పూర్తికాగానే ఆధారబాధరగా ఏదో మునిగిపోతుందని మేడిగడ్డకు బయలుదేరారని, అప్పుడేమో టూరిస్టులు రావాలి మేడి గడ్డను చూడాలని ప్రకటనలు ఇచ్చుకున్న వ్యక్తులు కూలిపోయిన మేడిగడ్డను చూడడానికి బయలుదేరారని ఆయన ఎద్దేవా చేశారు.

# పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

**జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్**



**వనపర్తి బ్యూరో జులై 25 (జనంసాక్షి)**
మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. గురువారం ఉదయాన్నే వనపర్తి, పాన్గల్ మండలాల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, పాటశాల విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఉదయాన్నే వనపర్తి మున్సిపాలిటీలోని 10వ వార్డులో తిరిగి డ్రైన్ల పరిస్థితి పరిశీలించారు. ఖాళీ ప్లేట్లలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను ప్లాటు యజమానులు తొలగించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని, యజమానులు శుభ్రం చేయని పక్షంలో మున్సిపాలిటీ ద్వారా శుభ్రం చేయించి యజమానిపై జరిమాన విధించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. డ్రైన్లు ఎప్పటి కప్పుడు శుభ్రం చేస్తూ నీరు సాఫీగా వెళ్లే విధంగా చూసుకోవాలని సూచించారు. గోప్లాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదే గ్రామంలో నర్సరీని సందర్శించి వన మహోత్సవ కార్యక్రమానికి ఉపయోగిస్తున్న మొక్కలను పరిశీలించారు. రెమద్దుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించడమే కాకుండా విద్యార్థులతో ముచ్చటించారు. బోధిస్తున్న మాధ్యమం పై వివరాలు తెలుసుకొని విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం పాన్గల్ మండలంలో పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ఎంతమంది ఒపిలు వచ్చారు అనేది రిజిస్టర్లు పరిశీలించారు. పిహెచ్సిలో ఉన్న మందుల నిలువలు, సమస్యలపై ఆరా తీశారు. కస్తూర్బా పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాల మరమ్మతు పనులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పానగల్ తహసిల్దార్ కార్యాలయంలో సందర్శించి ధరణి దరఖాస్తుల పరిష్కారంపై వివరాలు తీసుకున్నారు. త్వరగా పరిష్కరించి ఆర్డీఓ లాగిన్కు పంపించాలని తహసిల్దార్ను ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, పానగల్ తహసిల్దార్, ఎంపీడీఓ తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు తీరని అన్యాయం..!



- **దీనిని ఎంపీలంతా ప్రతిఘటిస్తాం**
- **పార్లమెంట్లో తెలంగాణ ఎంపీల వాణి వినిపిస్తాం**
- **జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్**

**నాగలిగిద్ద, జులై 25 (జనం సాక్షి)**
ఢీల్లీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కుర్సీ బచావో బడ్జెట్ అని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షేట్కార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్డీఏ ప్రభుత్వం నిలువడానికి బీహార్ ఏపీలకు తాయిలాలు ఇచ్చారన్నారు. తమ కూటమి నిలిచేందుకే సంతృప్తి వాద రాజకీయాలు అనుసరిస్తున్నారని విమర్శించారు. ఇదంతా బీజేపీ క్విడ్ ప్రో కో వ్యవస్థను నడుపుతున్నట్టు ఉందన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని అన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలపై ఎలాంటి కేటాయింపులు లేకపోవడం బాధాకరమన్నారు. గత పదేండ్లలో బీజేపీ, బీఆర్ ఎస్ లు రాష్ట్రానికి తీరని అన్యాయం చేశాయన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఓవర్ హాల్ యూనిట్, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఇక్కడి ప్రాజెక్టులకు జాతీయ హోదా బిజెపికి పట్టవని విమర్శించారు. తెలంగాణ పుట్టుకను ఇష్టపడని ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తెలంగాణపై వివక్ష కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో మరో సారి తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపించారని, ప్రతి సారిలాగే ఈ సారి కూడా కేంద్రం తెలంగాణ పట్ల వివక్ష కొనసాగించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు బిజెపి మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్లతో పాటు ఇక్కడ గెలిచిన బీజేపీ ఎంపీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత పదేండ్లలో బిజెపి బీఆర్ఎస్ లు రాష్ట్రానికి తీరని అన్యాయం చేశాయన్నారు. దీనిని తెలంగాణ ఎంపీలమంతా ప్రతిఘటిస్తామని, పార్లమెంట్లో తమ వాణి వినిపిస్తామని స్పష్టం చేశారు.



## నియోజకవర్గంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటన

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్న చింతకుంట, దేవరకద్ర మండలాల్లో గురువారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి విస్తృతంగా పర్యటించారు. చిన్న చింతకుంట మండలం వడ్డేమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ప్రస్తుతం పాఠశాల అడ్మిషన్ల గురించి ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 260 మంది విద్యార్థులు ఉన్నారని, పదవ తరగతిలో తెలుగు ఇంగ్లీష్ మీడియం కలిపి 62 మంది విద్యార్థులు ఉన్నారని ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ 10 వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థిని, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంగా కష్టపడి చదివితే ఆసక్తి ఉన్న రంగంలో స్థిరపడవచ్చున్నారు. బాగా చదువుకొని నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలని, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. అనంతరం చిన్నచింతకుంట మండలం మహిళా సమాఖ్య మహిళలతో కలెక్టర్ సమావేశం అయ్యారు. దమగ్న పూర్లో చిన్న చింతకుంట మండల సమీకృత గురుకుల సముదాయాలకు భూ పరిశీలన చేశారు . దేవరకద్ర మండలంలో ఆస్పత్రికి, కళాశాలకు భూమిని పరిశీలించారు.

# రైతులను పొగుడుతూనే వెన్నుపోటు

- **బడ్జెట్ ప్రసంగం పూర్తిగా ఒక కథలా ఉంది**
- **సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్**



**సంగారెడ్డి ప్రతినిధి, జులై 25 (జనం సాక్షి)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో మంత్రి బట్టి విక్రమార్కా చేసిన ప్రసంగం సినిమా కథ లాగా ఉందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడ్జెట్ ప్రసంగంలో మంత్రి బట్టి విక్రమార్క ప్రసంగం తెలంగాణ ప్రజలను మభ్య పెట్టే విధంగా ఉందన్నారు. గంటా యాభై నిమిషాలు ప్రసంగించిన మంత్రి మాటల్లో అన్ని వర్గాలకు మోసం చేసే విధంగా ఉందని మండిపడ్డారు. బడ్జెట్లో ముఖ్యమైన పథకాల ప్రస్తావన లేదని, రైతులకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ఉందన్నారు. బడ్జెట్లో రైతులను పొగుడుతూనే వెన్నుపోటు పొడిచే విధంగా ఎక్కడ కూడా రైతులు లాభపడే విధంగా నిధులు కేటాయించలేదని మండిపడ్డారు.

# భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**
పెండింగ్లో ఉన్న భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో నీటిపారుదల శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 57.44 ఎకరాల భూమి సేకరణ పనులు పెండింగ్ ఉన్నాయన్నారు. 82.35 ఎకరాల భూసేకరణకు సంబంధించిన డబ్బులు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నారాయణపేట పరిధిలో ఉన్నాయని తెలిపారు. జూరాల డ్యాం పునరావాస కేంద్రాల ప్రాంతాలైన మక్తల్ మండలంలోని అనుగొండ అంకెన్ పల్లి, ధాదన్ పల్లి భూసేకరణకు సంబందించి



డబ్బులు త్వరలోనే వచ్చే ఆస్కారం ఉందని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్ ఈ బాలరాజు, ఈఈ బ్రహ్మానంద, సంజీవప్రసాద్ డిఈఈ, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ దారిలోనే రేవంత్ సర్కార్

- **భట్టి బడ్జెట్..అంకెల గారడీ**
- **సంగారెడ్డి వరకు మెట్రో రైల్వే లైన్ మంజూరు చేయాలి**
- **ఇందిరమ్మ ఇళ్లకు నిధులు ఎక్కడ ?**
- **బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి**

**సంగారెడ్డిప్రతినిధి, జులై 25(జనంసాక్షి)**
రాష్ట్ర అసెంబ్లీలో గురువారం ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రజలను తీవ్రంగా నిరాశపర్చిందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి విమర్శిచారు. గత ప్రభుత్వ తరహాలోనే అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని ఆమె విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్పై గురువారం గోదావరి అంజిరెడ్డి స్పందించారు. ఈ మేరకు మీడియాకు ప్రకటన విడుదల చేశారు. మౌలిక వసతులు, ఉపాధి కల్పన వంటి వాటికి కేటాయింపులు లేవని అన్నారు. మెట్రో రైల్వే లైన్ సంగారెడ్డి వరకు మంజూరు చేయకపోవడంతో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో లైన్ ను పఠాన్ చెరు వరకు నిర్మించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని..అయితే లైన్ను సంగారెడ్డి వరకు పొడిగించాలని ఆమె డిమాండ్ చేశారు. అదే విధముగా సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి పథకాలకు నిధులపై స్పష్టత లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసుకుంటున్న ఆరు గ్యారెంటీల అమలుపై స్పష్టత ఇవ్వలేదని ఆమె మండిపడ్డారు. మహాలక్ష్మీ పథకం కింద మహిళలు ఇస్తామన్న నెలకు రూ. 2,500 చొప్పున ఎప్పటి నుంచి ఇస్తారో ప్రకటించలేదని విమర్శించారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం ఇస్తామని బడ్జెట్లో ఘనంగా చెప్పారని...కానీ అందుకు సంబంధించిన నిధుల కేటాయింపులు లేవని గోదావరి అంజిరెడ్డి అన్నారు. పెన్షన్ల పెంపు, రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేల చొప్పున చెల్లింపు ఎప్పటినుంచి అమలు చేస్తారో సర్కారు స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సర్కార్ లాగే రేవంత్ ప్రభుత్వం కూడా పెద్దఎత్తున అప్పుల భారం మోపుతోందని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ ఏర్పడిన స్వల్ప వ్యవధిలోనే 35 వేల కోట్లు అప్పులు చేశారని ఆమె మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లాలో అత్యంత కీలకమైన నిమ్జ్ భూ సేకరణ, సాగునీటి పథకాలకు నిధులు ఇవ్వకుండా వివక్ష చూపారని విమర్శించారు. అలవికాని హామీలు గుప్పించి గద్దెనెక్కిన



కాంగ్రెస్ ప్రభుత్వం...ఇప్పుడు వాటి అమలుపై దాటవేత ధోరణి ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతీ హామీ అమలయ్యేలా ప్రజల తరపున రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ఆమె వెల్లడించారు. అనంతరం బడ్జెట్ను నిరాకరిస్తూ మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రో ట్రైన్ కావాలని కోరితే పటాన్చెరు వరకే బడ్జెట్లో ప్రవేశపెట్టడం చాలా దురదృష్టకరమని, సంగారెడ్డి జిల్లాకు ఎలాంటి న్యాయం చేయని రాష్ట్ర ప్రభుత్వం తీరుకు నిరసిస్తూ సంగారెడ్డిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజేశ్వరరావు దేశ్పాండే, జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్ రావు, సంగారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ విష్ణువర్ధన్ రెడ్డి, జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ జగన్, అధికార ప్రతినిధి రాజు గౌడ్, జిల్లా నాయకులు భాస్కర్ యాదవ్, జహీరాబాద్ మాజీ టౌన్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, కౌన్సిలర్స్ మందుల నాగరాజు, శంషాబాద్ రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మీనా గౌడ్, రాష్ట్ర జిల్లా అసెంబ్లీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

**మున్సిపల్ కమిషనర్కు వినతి**

**పెబ్బేరు జూలై 25 (జనం సాక్షి)**
పెబ్బేరు-వనపర్తి రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని అదేవిధంగా పెండింగ్లో ఉన్న కట్టడాలను తొలగించి త్వరగా డ్రైనేజీ ప్రారంభించి రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు కోరడం జరిగింది. రోడ్ల విస్తరణలో భాగంగా ఇండ్లను కోల్పోయిన బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున న్యాయం చేస్తామని అలాంటి హామీని కమిషనర్ బాదితులకు వివరించి త్వరగా నిర్మాణాలను తొలగించాలని కోరారు.. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రధాన రహదారి అయినటువంటి రోడ్డు మొత్తం గుంతలు, బురదమయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఈ మేరకు విజ్ఞప్తి చేయడం జరిగింది..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు యాదవ్, కౌన్సిలర్ అశ్విని సత్యనారాయణ, దయాకర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, గంధం రాజు, రంజిత్ కుమార్, భాను ప్రకాష్ రెడ్డి,షకీల్,యుగంధర్ రెడ శివ సాయి, జాంగిర్, దాబా సత్తి,శరత్ కుమార్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## మక్తల్ నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

**ఢిల్లీలో మంత్రి సంజయ్ కుమార్, ఎంపి అరుణను కోరిన బిజెపి నాయకులు**

**మాగనూర్ జూలై 25 (జనం సాక్షి):**
మక్తల్ నియోజకవర్గం బీజేపీ నాయకుల ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం ఉదయం కెంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్, పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మను మర్యాద పూర్వకంగా కలిసి నియోజక వర్గంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. క్రిష్ణ మండలంలోని కృష్ణ రైల్వే స్టేషన్ లో పలు రైళ్లు నిలుదల చేయాలని, మండలంలోని గ్రామాలల్లో అంతర్గత రోడ్లు, మాగనూర్ లోని గట్టుమారెమ్మ దేవాలయం భరత్ మాలలో తొలగించకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఉజ్జలి పునరావాస ప్యాకేజి నిధుల మంజూరు, మక్తల్ మండలంలోని ఏళ్ళుగా పెండింగ్లో ఉన్న అనుగొండ, అంకెనపల్లి గ్రామాలను పునరావాస గ్రామాలుగా ప్రకటించే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సోంశేఖర్ గౌడ్, జయనందరెడ్డి, కల్లూరి నాగప్ప,కనకరాజు ప్రతాపరెడ్డి, క్రిష్ణ, మాగనూర్ మండలాల అధ్యక్ష ప్రధానకార్యదర్శి లు ఊళ్ల లక్ష్మణ్, నారాయణ, జి శ్రీనివాస్లు, నల్లే నర్సప్ప, దండు రాఘవేంద్ర, అశోక్ గౌడ్, వన్నవడ శ్రీకాంత్, కృష్ణయ్య, కొత్తపల్లి తిమ్మప్ప, జనార్దన్ గౌడ్, పిట్టల చంద్రశేఖర్, కుర్వ రాజు, ఐనపూర్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్




**జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి)**
నారాయణపేట జిల్లాలోని మక్తల్, మరికల్, పేటలో దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించడం జరిగిందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. రాత్రి సమయంలో ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఒంటిగంట నుండి నాలుగు గంటల మధ్యలో దొంగతనాలు చేసి దొరికిన సొమ్ముతో జల్సాలు చేస్తూ, పేకాట ఆడుతూ, షార్ట్ ఫిలిం తీస్తూ, డబ్బులు అయిపోయాక మళ్ళీ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు పోలాకి అప్పలనాయుడు అలియాస్ నాయుడు అమ్మన్న నాయుడు (43) వృత్తి కారు డ్రైవింగ్, చేపనపేట గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నిందితుని వివరాలు గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ యోగేష్ గౌతమ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. గురువారం ఉదయం మక్తల్ శివారులో వాహనాల తనిఖీల్లో నిందితుని పట్టుకోవడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఐదు నెలల వ్యవధిలో మక్తల్, మరికల్, నారాయణపేటలో పట్టణాల్లో 06 చోరీలు చేసి భారీగా బంగారం, వెండి ఆభరణాలు, కొంత నగదు దోచుకెళ్లినట్లు నిందితుడు అంగీకరించాడు. డి.ఎస్పి ఎన్ లింగయ్య పర్యవేక్షణలో దొంగతనాల కేసుల్లో నేరస్తుని పట్టుకోవడంలో బాగా పనిచేసిన మక్తల్, మరికల్ సిఐలు చంద్రశేఖర్, రాజేందర్ రెడ్డి, ఎస్సైలు భాగ్యలక్ష్మి రెడ్డి, మురళి, కానిస్టేబుల్స్ రవీంద్రనాథ్, తిరుపతి రెడ్డి నరేష్ యాదవ్, అశోక్ కుమార్, శ్రీకాంత్ ఐటికోర్ శ్రీనివాసులు లను ఎస్పీ అభినందించి రివార్డు అందించారు.

# సైబర్ నేరాల పట్ల జాగ్రత్త అవసరం

**జిల్లా ఎస్పీ డి. జానకి**

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
సైబర్ నేరాల పట్ల ప్రజలు ఎంతో జాగ్రత్తగా ఉండాలని మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, టెక్నాలజీని వాడుకుని సైబర్ నేరగాళ్లు, ప్రజలకు తెలియకుండానే వారి డబ్బులను దోచుకుంటున్నారు. ప్రజలు అనవసరమైన లింక్లను క్లిక్ చేయొద్దని, ఓటీపీ, పాస్వర్డ్లు ఎవరికీ చెప్పొద్దని, వ్యక్తిగత బ్యాంకు ఖాతాల వివరాలను ఎవరికి తెలియపరచరాలను పాలు పేర్కొన్నారు. వాట్సాప్, ఫేస్బుక్, ఇతర యాప్లు, లింకులు, ఈ-మెయిల్స్తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు, యువకులు, విద్యార్థులు, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని ఎస్పి సుచించారు. అపరిచిత వ్యక్తులతో ఫోన్కాల్స్, వాట్సాప్, ఫేస్ బుక్ చాటింగ్కు దూరంగా ఉండాలని, ఓటీపీలు వస్తే ఎవరికీ చెప్పవద్దని, లాటరీలు, బ్యాంకుల రివార్డు పేరిట, జాబ్స్, కమీషన్లు, డిస్కౌంట్ల పేరుతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని ప్రజలకు ఆశ చూపి మోసం చేస్తున్నారని, బ్యాంక్ నుంచి మట్లాడుతున్నామని, ఆధార్ నంబర్ చెప్పండని, మీ ఏటీఎం పని చేయడం లేదని, కారు గెల్చుకున్నారని, మనీ ఇన్వెస్ట్మెంట్ పేరుతో, క్రెడిట్ కార్డులిమిట్ పెంచుతామని ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని , సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్త పడాలని ఎస్పీ సూచించారు. ఏపీకే ఫైల్స్ డౌన్లోడ్ చేయొద్దన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు వెంటనే 1930 టోల్ఫ్రీ నంబర్కు గోల్డెన్ అవర్ (గంటలోపు) కాల్ చేసి వివరాలు తెలియజేస్తే డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉందని ఎస్పి పేర్కొన్నారు. సైబర్ నేరాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అలాగే మహబూబ్ నగర్ - సైబర్ - సెక్యూరిటీ ఇన్స్టాగ్రామ్ను ఫాలో అయితే ప్రతినిత్యం అప్డేట్స్ ఇవ్వడం జరుగుతుందాని ఎస్పీ డి. జానకి తెలిపారు.




# మైనర్ పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై క్రిమినల్ కేసులు

**జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు**

**గద్వాల నడిగడ్డ, జులై 25 (జనం సాక్షి)**
14 సంవత్సరాల లోపు మైనర్ పిల్లలను పనిలో పెట్టుకుంటే ఆయా యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు హెచ్చరించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని తన ఛాంబర్లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్ జులై 1 నుండి 31 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతుందని అన్నారు. బాల్యాన్ని బాలల హక్కులను హరించడం నేరమని,14 ఏళ్ల లోపు చిన్నారులు చదువుకునేందుకు బడుల్లో ఉండాలే తప్ప పనిలో ఉండకూడదని అన్నారు. పనిలో పెట్టుకునే యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ లో పట్టుబడిన బాల కార్మికులను వారు తిరిగి చదువుకునేందుకు వసతి గృహాల్లో చేర్పించడం జరుగుతుందన్నారు. బాల కార్మికులతో పాటు బిక్షాటన, చెత్త సేకరించుకునే బాలలు, వీధి బాలలు కూడా ఆపరేషన్ ముస్కాన్లో గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా శిశు సంక్షేమ అధికారిని సుధారాణి, జిల్లా విద్యా శాఖ అధికారిని ఇందిర, చైల్డ్ వెల్ ఫేర్ చైర్ పర్సన్ సహదేవుడు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్, సిడిపిఓలు, ఎన్జీఓలు, చైల్డ్ లైన్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బామ్మ సంకల్ప శక్తి






కరుణాకరం వచ్చాడు ఆ రోజు మా ఇంటికి. కదిలిస్తే చాలు దుఃఖం ముంచుకు వచ్చేలా ఉన్నాడు. గ్లాసులో మంచినీరు ఇచ్చి విషయం చెప్పమన్నాము. దుఃఖంతో పూడుకుపోతున్న గొంతుతో చెప్పాడు " మా అరుణకి అప్పుడే నూరేళు నిండినాయి బావా." అదేమిట్రా పిచ్చి వాగుడు, సరేలే వివరంగా చెప్పు ఏమైందో?" అన్నాను.

" అరుణ కొన్నాళ్ళుగా పొత్తి కడుపులో నొప్పితో విపరీతమైన బాధ, సరిగ్గా యూరిన్ పాస్ అవక బాధ పడుతుంటే పరీక్ష చేయిస్తే కిడ్నీస్ బాగా పాడయనాయి, త్వరలో కిడ్నీ డోనర్ దొరికితే అరుణని బ్రతికుంచుకోగలమని చెప్పారు రా బావా." అంటూ ఏడ్చేశాడు . బ్రతకటానికి అవకాశం ఉందని చెప్పారు కదరా మరి ఏ ప్రయత్నం చేయకుండా నూరేళు నిండాయి అన్న తీర్మానానికి ఎలవచ్చేశావురా. "

" ఇంత తక్కువ సమయంలో మాచింగ్ కిడ్ని దొరకటం ఎలా సంభవం రా? " ఎందుకు సంభవం కాదు? ఇంత మంది ఉన్నాము ఆందరం టెస్ట్ చేయుంచుకుందాము. ఎవరో ఒకరిది తప్పకుండా మాచ్ అవుతుంది. మన ప్రయత్నం మనంచేసి దెముడ్ని ప్రార్ధిందాము. అరుణ తప్పకుండ బాగు పడుతుంది. నువు ఊరికే భయపడి అరుణని మిగతా వారినీ గాబరా పెట్టకు అని చెప్పి కరుణాకరాన్ని ఇంటి దగ్గర దిగపెట్టి వచ్చాను. ఆ రెండో రోజు నించి మాకు దగ్గర వారైన ప్రతి ఒక్కరూ మా కిడ్నీ మాచింగ్ టెస్ట్ కి ఇచ్చాము. ఆఖరికి అప్పటికి యాభై ఐదో ప్రాయంలో ఉన్న మా అమ్మ కిడ్నీ మాచ్ అయిందని తెలిసింది. క్షణం ఆలోచించకుండా ముందుకు వచ్చింది మా అమ్మ. డోనర్ దొరికారని తెలిసాక మాకు కొంత ఊపిరి ఆడింది.. అరుణ మొహంలో కొంచెం జీవకళ కనిపించింది.. కిడ్నీ ట్రాన్సప్లాంట్ అయ్యే దాకా అవసరం అయినప్పుడు డయాలసిస్ మీద ఉంచుతున్నారు. ఇంక అసలీ పేపర్ వర్క్ మొదలెట్టారు ఇలాంటి దానం చేయ టానికి మన ప్రభుత్వ సహమతి ఉండాలని మాకు అప్పుడే తెలిసింది. ఆది క్లియర్ అయ్యాక ఆ తరువాత సైకియాట్రీస్ట్ దగ్గరకు మా అమ్మని తీసుకు వెళ్ళమన్నారు. అమ్మ మానసికంగా శారీరకంగా ఈ డొనేషన్ కి అనుకూలంగా, ఆరోగ్యంగా ఉన్నదని సర్టిఫై చేయించుకోవటానికి. తరువాత అమ్మ రెండు కిడ్నీస్ లో ఏది ఎక్కువ మాచ అవుతుంద ని తెలుసుకోటానికి మళ్ళీ మరో టెస్ట్ చేశారు. ఇవన్నీ అయ్యాక అన్నింటి కంటే ముఖ్య మయినది టిష్యు మాచింగ్ కోసం. అమ్మ టిష్యు సాంపల్స్ తీసుకుని డెల్లి పంపించారు . అందులో కనుక నెగెటివ్ వస్తే మన ఇంత ప్రయత్నం వృథాయే కానీ దేముడి దయ అనండి అరుణ అదృష్టం అనండి రిపోర్టు సుముఖంగా ఉండింది. ఇంత కాలం తీసుకున్నా ఇంత కష్టపడినా ఇద్దరికీ ఒకేసారి సర్జరీ చేసి కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ చేయ టానికి సంవత్సరం పట్టింది . సంతోషకరమైన విషయం ఏమిటంటే ఆ తరువాత అమ్మ ఆరోగ్యంగా ఉంది అరుణ పెళ్ళి అయి సుఖంగా కాపురం చేసుకుంటోంది. అరుణ పాపం తన ప్రతి పుట్టిన దినం రోజు వచ్చి మా అమ్మ కాళ్ళకి దణ్ణం పెట్టకుండా ఉండదు.

ప్రస్తుతం మా అమ్మ తొంభై రెండో ఏడు. ఎక్కువగా మంచం పైనే ఉంటునది. మా అమ్మ ఇవాళో రేపో అన్నట్టు పడుకుని ఉంది. ఆవిడ వేపు బంధువులు ఎలాంటి వార్త క్షణం వస్తుందో అని అప్పటికే ఒకరు ఒకరు వచ్చి అమ్మ ని ఆఖరి చూపు చూసి వెల్తున్నారు. ఆస్పత్రిలో డాక్టర్సు ఇక మేము చేసేది ఏమీలేదు, ఇంటికి తీసుకు వెలిపొండి అని చెప్పేశారు. ఆవిడ ఆఖరి శ్వాస హాయిగా తీసుకునెట్టు చూడండి " అని చెప్పారు. మేమందరం ఆ ప్రయత్నంలోనే ఉన్నాము. ఏదైనా చెప్పాలంటే ఆవిడ చెవి దగ్గర నోరు పెట్టి గట్టిగా చెప్తే విని స్పందిస్తుంది. ఆవిడ ఏదైనా చెప్పాలంటే సౌగ్యలతోనో లేకపోతే ఆవిడ నోటి దగ్గర చెవి పెడితే అతి మెల్లగా మాట్లాడగలుగుతోంది. మధ్యలో మెల్లగా కళ్ళు తెరిచి ఏవరి కోసమో ఆతురతతో ఎదురు చూస్తుంటే అది గమనించి అడిగితే చెప్పింది "ప్రసాదు ఇంకారాలేదా" అంటూ. ప్రసాదు నా కొడుకు హైద్రాబాదులో డాక్టర్ గా చేస్తున్నాడు మూడేళ బట్టి. " ఇవాళ రాత్రికి వస్తాడు ప్రసాదు. నువ్వు విశ్రాంతిగా పడుకో. వాడు రాంగానే నీకు చెపుతాగా. అని అమ్మని ఊరుకోబెడుతుంటే నా మనుమ రాలు అంటోంది చూశావా తాతాయ్య మేమందరం ఇన్ని పరిచర్యలు చేస్తున్నా బామ్మకి అన్నయ్య అంటేనే ఇష్టం. ఎప్పుడు తన కోసమే తాపత్రయం. నాకు కూడా కొంత వింతగా నే అనిపించింది. ఎందుకా ప్రసాదు కోసం అంతలా ఎదురు చూస్తోందని.

మా అమ్మ కిడ్నీ డొనేట్ చేశాక తన బుర్రలో పురుగు దూరి పెద్దది అవుతూ వచ్చింది. ఈ లోగా నా కొడుకు ప్రసాదు ఏం.బి.బి.ఎస్ చేసి ఆర్తో స్పెషలైజేషన్ చేశాక తనని కాన్ఫిడెన్స్ లోకి తీసుకుని ఏదో కూడ పలుకుంటూ ఉండేవారు. నాకుగాని మరో మనిషికి మాత్రం ఏం తెలియ నిచ్చేవారు కాదు. రాత్రి పది గంటలకు ప్రసాద్ వచ్చి కనబడ్డాక అమ్మ కళ్ళలో చిన్న మెరుపు మెరిసింది. తన తలగడ కింద నుంచి లామినేటెడ్ కార్డొకటి తీసి తన చేతిలో పెట్టి మెల్లగా ప్రశాంతంగా కళ్ళు మూసుకుని పడుకుంది. ఇక తనకు ఏమైనా మనవడు అన్నీ చూసుకుంటాడని ధీమా అది.

"ఏమిట్రా ప్రసాదు మీ ఇద్దరి మధ్య మాకు తెలీకూడనన్ని రహస్యాలు ఏమిట్రా?" మాకేవరికి తెలియని ఖజానా ఏమైనా ఉందేమిట్రా?" అంటూ నేను హాస్యం ఆడితే 'తను ఆఖరి శ్వాస వదిలే దాకా ఎవరికి చెప్పవద్దని బామ్మ ఒట్టు వేయించుకుంది నాన్నా. తను కళ్ళు మూసే దాకా ఎవరికి విషయం చెప్పొదని మాట ఇవ్వమంది నాన్నా.. ఆఖరి రోజుల్లో తన మాట ఎందుకు కాదనాలని చెప్పటంలేదు. లేకపోతే అంత చెప్పకూడని విషయం ఏమీ లేదు.

తనని చూడంగానే ప్రశాంతంగా మారిన బామ్మ మొహం చూసి ప్రసాదు గతంలోకి వెళ్ళాడు. ఎనభయ్యో ఏటి వరకు అంటే తన పనులు తాను ఎవరి సాయం లేకుండా చేసుకోకలిగనంత కాలం బామ్మ బాగానే ఉంది ఒక రోజు కన్నీళ్ళు పెట్టుకుంటూ "ఒరేయ్ ప్రసాదు నాకు ఇంక ఇలా బ్రతకాలని లేదురా. కాళ్ళూ చేతులు పూర్తిగా పడిపోక ముందే నువు డాక్టర్వి కదా నేను ప్రశాంతంగా కళ్ళు మూసుకునే మందు ఏదైనా తెచ్చి ఇవ్వరా . నా ఒంట్లో పనికి వచ్చే భాగాలు ఏమైనా ఉంటే ఆస్పత్రికి ఇచ్చిస్తే అవసరం ఉన్నవారి ఎవరికైనా పనికి వస్తయేమో చూడు' అంటూ చాలాసార్లు ప్రార్ధెయపడుతూ అడగటం నేను నవ్వుతూ అదేంటి బామ్మా నా పెళ్ళీ చూడకుండానే వెళిపోతావా ఏం? అదేం కుదర్దు అని హాస్యంగా కొట్టి పడేయటం అయింది. తరవాత తప్పని సరి చెప్పాను " బామ్మా నీకు నీ శరీరర భాగాలన్నీ ఆస్త్రి కి దానం చేయాలన్న బలమైన కోరిక ఉండటంలో తప్పు లేదు కానీ నీ కోరిక తీర్చటం కోసం నీ ప్రాణాలు తీయమని కొరటం మాత్రం పాపం. నన్ను ఆ మహా పాపం చేసి జైలుకి పొమ్మంటావా? అని అడిగాను అప్పటి నుంచి ఇక చేసేది లేక తన చావు కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. ఇన్నాళ్ళకి తొంభై రెండో ఏట బామ్మ కోరిక తీరేలా కనిపించి కిందటి సారి వచ్చి నప్పుడు ఆడింగింది. ఏమిరా ప్రసాదు ముందు ఎన్నిసార్లు అడిగినా ఒప్పుకో లేదు ఇప్పుడు ఈ తొంభై ఏళ్ళ శరీరం ఎవరికైనా పనికి వస్తుదంటావా? మొన్న ఇలాగే మళ్ళీ సందర్భం వస్తే ఐనా బామ్మా నీ తాపత్రయం కానీ తొంభై ఎళు దాటాక శరీర ఏ అవయవం ఎన్నాళు పని చేస్తుంది చెప్పు. అనవసరంగా నీ శరీరం కోసి మళ్ళీ అంతా పాక్ చేసి ఇచ్చేస్తారేమో చూసుకో అని హాస్యం చేసేవారం. కానీ దానికి కూడా బామ్మ చలించలేదు."మొన్నెప్పుడో మాలతి నాకు గూగల్ లో చదివి చెప్పింది ఎవరో తొంభై ఎళ ఆవిలివర్ అరవై అయిదేళ ఆవిడకి డొనేట్ చేశారుట. నా ప్రాణం ఉండంగానే అటు వంటి అదృష్టం నాకూ ఉందేమో కనుక్కుని చెప్పరా. ఎవరూ తీసుకోకపోతే నా దేహాన్ని మెడికల్ కాలేజీకి దానం చేసెయి కానీ నా దేహానికి దహన సంస్కారం మాత్రం వీలు లేదు.. ఆధునిక పరిజ్ఞానమ్ కొంత వరకు ఉన్న బామ్మని మాట్లాల్తో మభ్యపెట్టలేమని నాకు తెలుసు. తనలో ఉన్న ఈ బలమైన కొరికకి జోహార్లు చెప్పకుండా ఉండలేక పోయాను. నేను వచ్చిన రెండో రోజుకి బామ్మ నా చేతుల్లోనే ప్రాణాలు విడిచింది. ఎంత మునపటి నుంచి సిద్ధముగా ఉన్నా అందరూ దుఃఖించ కుండా ఉండలేక పోయాము. నాన్న నా దగ్గరకు వచ్చి ఏం రా ఇప్పటికీ ఐనా మీ ఇద్దరి మధ్య రహస్యం ఏమిటో చేపుతావా అని అడిగారు. మారు మాట్లాడకుండా బామ్మ తన అరవయ్యో ఏట తన పేరు ఆర్గన్ డొనేషన్ కోసం రిజిస్టర్ చేయించుంచుకున్న కార్డ్ తీసి నాన్న చేతిలో పెట్టాను. ఏమిటి రా ఇదంతా అంటూ విభ్రాంతిగా చూశారు నా వేపు.

" అదే మరి మనం ఎప్పుడూ కలలో కూడా అనుకోని పని బామ్మ ఎప్పుడు ఎలా ఎవరి సాయంతో చేసుకుందో తెలీదు." ఇప్పుడు ఏం చేద్దాం అంటావురా అయితే. అమ్మ కూడా విని అబ్బురపడింది. అత్తయ ఎప్పుడూ అంతే తనకి ఉన్న మనోబలం మనెవ్వరికీ లేదు." అంటూ కళ్ళు తుడుచుకుంది మిగతా బంధువులు అందరూ తలా ఓ విధంగా మాట్లాడుతున్నారు" ఇదేం కోరిక అంట రాజ్యంది మరీనూ. శుద్ధమైన శాస్త్రోక్త కుటుంబంలో పుట్టి దహన కర్మ చేయకుండా ఎలగుటా !!! మరీ విడ్డూరం కాకపోతే..."

వంశానికి వారసడు లేకపోతే ఎలాని కొడుకు పుట్టాలని ఈ నాటికీ కోరుకునే సమాజం కదా మనది చక్కగా కొడుకు మనవడు ఉండగా రాజ్యానికి ఈ వింత కోరిక ఎలా పుట్టిందో!!!" ఆ మాటలు ఏమీ పట్టించుకోకుండా నేను వెంటనే మాట్లాడి ఉంచిన మెడికల్ కాలేజీ నిర్వాహకులు అవసరమైన పరికరాలతో పాటు రమ్మని బామ్మ శరీరాన్ని తీసుకు వెళ్ళే ప్రయత్నము మొదలెట్టాను. మిగతా అవయవాలు మాట ఏమో కానీ చర్మము కళ్ళూ ఉప యోగించవచ్చని అనుకుంటున్నాము. ఆవిడకి అంత బలమైన సంకల్పం ఉంది అంటే మిగతా భాగాలు కూడా పనికి రావచ్చు చూద్దాం అన్నారు కాలేజు వారు. అన్నీ పనులు పూర్తి అయ్యాక అస్థికలు తీసి ఇస్తాము అప్పుడు రండి అని చేప్పారు. ఛిన్న భిన్నమైన శరీరాన్ని తెచ్చి దహనం చేయటానికి మా మనుసు ఒప్పుకోక వారు అన్నదానికే సరే అన్నాము. మిగతా కార్యక్రమాలు మాత్రం బామ్మ ఇ అయిష్టాలుతో ప్రమేయం లేకుండా దశాహం. సంతర్పణ అన్నీ శాస్త్రోక్తంగానే చేశాము. బామ్మదేహాన్ని తీసుకువెళ్ళిన రెండో రోజు కాలేజు వారి ఫోను వచ్చింది మీ అమ్మగారి సంకల్ప శక్తొ ఏమో కానీ మేము అనుకున్న దాని కంటే మీ అమ్మగారి అవయవాలు మంచి స్థితిలో ఉన్నా యండి ఈ అవయవాలు పుచ్చుకున్న వారు ఏవారైనా సరే కనీసం ఎనిమిదేళ్ళైనా నిశ్చింతగా బతికేయవచ్చు. మిగతా శరీరం కూడా మేము స్టడీస్ కొసం ఉంచుకుందా మని అనుకుంటున్నాము. మీకు అభ్యంతరం లేకపోతే అని అడిగారు. మేము ఏమంటాము. ఆవిడలో ఉన్నసంకల్ప శక్తి , మనోబలం అటువంటిది ఏమో!!!! చేతు లెత్తి దణ్ణం పెట్టగలిగాము అంతే కార్యక్రమాలన్నీ పూర్తి అయ్యాక ముందు అమ్మానాన్నా మిగతా బంధువులు కూడా చాలా మంది ఆర్గన్ డొనెషన కి రిజిస్టర్ చేయించుకున్నామని వేరేగా చెప్పక్కర్లేదేమో.

- కందుల అనుపమ, రాంనగర్, కరీంనగర్

## విద్యార్థుల ఆరోగ్యం, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- సర్వేల్ గురుకుల పాఠశాల ప్రభుత్వ జిల్లా పరిషత్ హై స్కూల్ అంగన్వాడి కేంద్రాల ఆకస్మిక తనిఖీ
- కలెక్టర్ హనుమంత్ కే.జండగే



**భువనగిరి ప్రతినిధి, జూలై 25 (జనం సాక్షి) :** వసతి గృహాల విద్యార్థుల ఆరోగ్యం చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ హనుమంత్ కి జండేగా ఆదేశించారు. సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గురుకులాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు, సిబ్బందికి సంబంధించిన హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్ లో ఉన్న సరుకులను వివరాలను తెలుసుకున్నారు. అన్ని తరగతి గదులను పరిశీలించారు. 8, 9వ తరగతుల విద్యార్థులతో పాఠాల ను చదివించి, వెనుకబాటు ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక తరగతులు తీసుకోవా లని సూచించారు.ఇంగ్లీష్ మీడియంపై శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. వసతి గృహంలో నూతనంగా పూర్తి అయిన అదనపు గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

అనంతరం సర్వేల్ జిల్లా పరిషత్ హైస్కూల్ సందర్శించి పిల్లలతో పాఠాలు చదివించారు. ప్రత్యేక బోధనా తరగతులు తీసుకోవాలని ఉపాధ్యాయులకు చెప్పారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన తాగునీరు, టాయిలెట్ పనులను పరిశీలించారు. పనులకు సంబంధించిన పేమెంట్ పనులు త్వరగా చేయాలని ఆదేశించారు. తదుపరి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి గర్భిణీ స్త్రీ సేవల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పౌష్టికాహారం పట్ల వారికి తగిన సూచనలు ఇవ్వాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలకు వచ్చే 3 – 5 ఐదు సంవత్సరాల పిల్లలకు నూతన జాతీయ విద్యా విధానం అనుసరించి కేంద్రాలలో ఆటపాటల ద్వారా విద్య అందించాలని, పిల్లల ఆరోగ్యమైన ఎదుగుదలకు ప్రతినెలా ఎత్తు, బరువులను పర్యవేక్షిస్తూ సరైన ఆహారం పిల్లలకు అందించడంలో తల్లులకు తగు సూచనలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ప్రమోద్ కుమార్, సర్వేర్ గురుకులం ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు ఉన్నారు.

- పట్టించుకోని అధికారులు
- బదిలీల తర్వాత ఈ కొరత ఏర్పడింది
- ఎక్కడ ఆగిన పనులు అక్కడే







### జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

## వేదిస్తున్న ఉపాధ్యాయుల కొరత

**దౌల్తాబాద్ జులై 25,(జనం సాక్షి):** మండలంలోని బలంపేట్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధి లోను ఎక్కడ పనులు అక్కడే. గతంలో మన ఊరు మనబడి కింద సెలెక్ట్ అయిన ఉన్నత పాఠశాల ఇక్కడ బిల్డింగ్, బాత్రూంలు, మధ్యాహ్నం భోజనా నికి వంటగది లేకపోవడంతో పాఠశాలల్లో చదువుకుం టున్న విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో ఉపాధ్యా యుల కొరత రెండు సంవత్సరాల నుంచి కొనసాగుతూనే ఉంది. అయితే ప్రస్తుతం 235 మంది విద్యార్థులకు ఐదు మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అందు లోనూ ఒకరు ప్రధాన ఉపాధ్యాయులు ఇందులోనూ విశేషమేంటంటే వచ్చే నెలలో ఈ అయిదుగురులోను హిందీ పండితుడు పదవి విరమణ పొందు తారు. తర్వాత మిగిలేది నలుగురే ఉపాధ్యాయులు. అలాగే పాఠశాల ప్రారంభం అయ్యి సంవత్సరాలు గడుస్తున్న నుండి నేటి వరకు బెంచీలు లేకపోవడం చాలా బాధాకరం. విద్యార్థులకు చదువుకోవడానికి చాలా ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం ఉన్న నాలుగు ఐదు క్లాస్‌రూమ్స్‌లో ఇంగ్లీష్ మీడియం మరియు తెలుగు మీడియం రెండు కలిపి చెప్పడంతో విద్యార్థు లకు చాలా ఇబ్బందికరంగా కలుగుతుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు వెళ్లి పాఠశాలను పరిశీలించిన తర్వాత గతం లో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడి పనులు అక్కడే నిలచిపోయాయి. కొత్తగా వచ్చిన నేటి ప్రభుత్వంలో కూడా పనులు ఆగిపోవడంతో చాలా బాధాకరంగా ఉంది అని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని అలాగే పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చేయాలనీ ఎస్ఎఫ్ఐ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజు గౌడ్ అన్నారు.

### ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక శాఖ మంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలియజేసిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ఖమ్మం, (జనం సాక్షి):** నేడు ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్ లో 72,659 కోట్లు రూపాయలు వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తు అన్నదాతలకు అలంబనగా నిలుస్తు ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ నూటికి నూరు శాతం రైతు పక్షపాత బడ్జెట్ గా ప్రవేశపెట్టినందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క ని హైదరాబాద్ ప్రజా భవన్ లో డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,హస్తకళ కార్పోరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ,మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు కలిసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.


## విద్యుత్ షాక్‌తో గేదె మృతి

### గేదె మృతితో రోధిస్తున్న రైతు కుటుంబ సభ్యులు

**శంషాబాద్, జూలై 25 (జనంసాక్షి) :** మండల పరిధిలోని చౌదరిగూడ గ్రామంలో విద్యుత్ ఘాతానికి ఓ గేదె మృత్యువాత పడింది. శంషాబాద్ మండల పరిధిలోని చౌదరి గూడ గ్రామంలో మల్చలం బిక్షపతి అనే రైతు ప్రైవేటు వెంచర్లో విద్యుత్ షాక్ తో గేదె మృతి చెందింది. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గురువారం వెంచర్ లో మేత మేస్తూ ప్రక్కనే ఉన్న ట్రాన్స్ఫార్మర్ వర్షానికి తడిసి మేతమేస్తున్న గేదెకు విద్యుత్ శాఖ తలగడంతో అరుస్తూ కింద పడింది. అటుగా వెళ్లిన భిక్షపతి కి సంబంధించిన గేదె విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిందాని స్థానికులు తెలపడంతో బిక్షపతి సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన గేదని చూసి బోరన విలపించాడు. విద్యుత్ అధికారులు వ్యవసాయ శాఖ అధికారులు తమకు న్యాయం చేయాలని కన్నీటి పర్యంతామయ్యారు. వ్యవసాయంపై నమ్మకం పెంచాలని వ్యవసాయ శాఖ అధికారులకు బిక్షపతి కుటుంబ సభ్యులు మొరపెట్టుకున్నారు.

## దుకాణాలు ఇవ్వండి మహాప్రభో..

- అలాట్మెంట్ లెటర్లు ఇచ్చారు.. స్థలం చూపించడం మరిచారు
- సంవత్సర కాలంగా లబ్ధిదారుల ఎదురుచూపు
- ఖమ్మం ఆర్టీసీలో వింత పోకడ


ALLOTMENT LETTER
PERSONNEL OFFICER, KHAMMAM



**ఖమ్మం జిల్లా ప్రతినిధి, (జనం సాక్షి):** ఆర్టీసిని లాభాల బాట పట్టించడం కోసం సంస్థ అనేక సంస్కరణల కు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆర్టీసీని మహాలక్ష్మి స్కీం కాస్త ఆదుకుంటుంది. అయితే ఖమ్మం ఆర్టీసీలో మాత్రం సంస్థ ను లాభాల బాట పట్టించేందుకు అంతగా ఆసక్తి ఉన్నట్లు కనిపించ డం లేదు. ఉన్నతాధికారుల నిర్లక్ష్య ఫలితమో.. గత పాలకుల రాజకీయ స్వార్థం ఫలితమో గాని ఆర్టీసీ ఆదాయానికి మాత్రం భారీ గా గండిపడుతోంది. దీనిని ప్రశ్నించే నాధుడే కరవయ్యాడు. కొత్తగా వచ్చిన ప్రభుత్వమైన పట్టించుకోని సమస్యను పరిష్కరిస్తుంది అనుకు ంటే ప్రస్తుత అధికార పార్టీలోని ఒక నాయకుడు సైతం గత పాలకు ల నిర్ణయానికే మద్దతు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అసలు సంగతి ఇదీ**

ఖమ్మం నడిబొడ్డున ఉన్న పాత బస్టాండ్ ఆవరణలో కొత్తగా 16 దుకాణాలు ఏర్పాటుచేసి అద్దెకు వచ్చేందుకు గత ఏడాది మేలో సంస్థ నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటికి ఇ-టెండర్ల ద్వారా దుకాణదారుల నుండి టెండర్లను ఆహ్వానించింది. సుమారు 50 మంది దుకాణదారులు ఒక్కొక్కరు రూ.3500 చొప్పున అప్లికేషన్ ఫామ్ డౌన్లోడ్ చేసుకుని, రూ.30,000 ఈఎండీ జత చేసి టెండర్ దాఖలు చేశారు. అనంతరం టెండర్లను ఓపెన్ చేయగా 16 మంది ఈ దుకాణాలను దక్కించుకున్నారు. వీరికి నాటి ఆర్ఎం పోస్టు ద్వారా అలాట్మెంట్ ఆర్డర్ కాపీలను పంపించారు. ఇక అప్పటినుండి నేటి వరకు ఈ విషయంలో ఎటువంటి కదలిక లేదు. ఈ లెటర్ చేరిన నాటి నుండి 15 రోజుల్లోగా ఒక్కొక్క దుకాణదారుడు ఏడు నెలల అద్దెను అడ్వాన్స్ రూపంలో ఆర్టీసీకి చెల్లించాలి. అప్పుడు సంస్థ దుకాణ దాగురుడికి అగ్రిమెంట్ చేస్తుంది. అయితే దుకాణదారులే సొంతంగా దుకాణాలను ఆర్టీసీ ఆవరణలో నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం సంస్థ పాత బస్టాండ్ ఆవరణలో స్థలాన్ని వారికి చూపించాలి. బస్టాండ్ వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించుకునేందుకు అనుమతిస్తామని నాడు ఆర్టీసీ అధికారులు వాళ్లకి తెలియజేశారు. అది నమ్మిన దుకాణదారులు టెండర్ ప్రక్రియలో పాల్గొని షాపులను దక్కించుకున్నారు. ఈ షాపులను యథావిధిగా ఏర్పాటు చేసుకుని అవకాశం కల్పిస్తే సంస్థకు నెలకు లక్షల్లో ఆదాయం చేకూరుతుంది. ఇక్కడ రాజకీయ ప్రయోజనాల కన్నా సంస్థ గౌరవం పెరిగే విధంగా అధికారులు వ్యవహరించాల్సి ఉంది.

**ప్రక్రియ ఆపిన అదృశ్య హస్తం ఎవరిదో..?**

దుకాణదారులు టెండర్ల ద్వారా షాపులు దక్కించుకున్న నాటి నుండి జరగాల్సిన ప్రక్రియ పూర్తిగా ఆగిపోయింది అని చెప్పాలి. అయితే ఇది ఆగటం వెనుక నాటి ప్రభుత్వంలోని పెద్దల హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం ఓటు బ్యాంకు కోసమే దుకాణాలు ఏర్పాటు చేయకుండా కొంతమందికి లబ్ది చేకూరేందుకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. ప్రభుత్వం మారినా టెండర్ దక్కించుకున్న యజమానులకు మాత్రం దుకాణాలు ఏర్పాటు చేసుకొని అవకాశం నేటికీ కల్పించలేదు. దీంతో టెండర్ దక్కించుకున్న దుకాణదారులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. త్వరలోనే ఈ విషయంపై జిల్లా మంత్రులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు

# బడ్జెట్‌పై కెసిఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ కౌంటర్

- బిజెపి ఆదేశాలతో అసెంబ్లీకి వచ్చారని మండిపాటు
- కేంద్రబడ్జెట్‌పై స్పందించకుండా.. ఇక్కడ విమర్శలా
- అసెంబ్లీలో చర్చకు ఎందుకు రాలేదని నిలదీసితన సీతక్క

**హైదరాబాద్, జూలై 25 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్ఎస్ అధినేత, విపక్ష నేత కేసీఆర్ చేసిన కామెంట్స్‌కు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడిన మంత్రులు, ఎమ్మెల్యేలు.. కేసీఆర్ వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. కేంద్ర బడ్జెట్‌పై స్పందించని కేసీఆర్.. రాష్ట్ర బ్జడెట్ మీద మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి సీతక్క విమర్శించారు. తెలంగాణకు ద్రోహం చేసన కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేస్తే కేసీఆర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడని కేసీఆర్.. రాష్ట్ర బడ్జెట్‌ను విమర్శించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని సీతక్క అన్నారు. బీజేపీతో ఒప్పందంలో భాగంగానే అసెంబ్లీకి వచ్చిన మొదటి రోజే రాష్ట్ర ప్రభుత్వాన్ని కేసీఆర్ టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ మెప్పు కోసమే కేసీఆర్ విమర్శలు చేస్తున్నారన్నారు. 6 నెలల తరువాత అసెంబ్లీ సమావేశాలకు రావడమే ఇందుకు నిదర్శనం అన్నారు. అదికూడా బిజెపి ఆదేశిస్తేనే అసెంబ్లీకి వచ్చారని అన్నారు. 'ఎన్నడూ లేని విధంగా ఈ రోజు కేసీఆర్ మీడియా పాయింట్‌కి వచ్చారని అచ్చంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీ కృష్ణ అన్నారు. తొందర్లోనే కోర్టు బోన్‌లోకి వస్తారు. కేసీఆర్ ఊహల్లో బతికారు. ఇంకా నేనే రాజు అనుకుంటున్నారు. మీరు పెట్టిన బడ్జెట్ ఎవరికి ఉపయోగ పడలేదు. నీళ్ళు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ తెచ్చుకుంది. కానీ గత ప్రభుత్వం నీళ్ళు ఇవ్వలేదు.. నిధులూ ఇవ్వలేదు.. ఇంక నియామకాల ఊసే అస్సలు లేదు. అప్పులు చేసి తెలంగాణ ప్రజల జీవితాలపై వేశారు.' అని ఎమ్మెల్యే వంశీ కృష్ణ ఫైర్ అయ్యారు. వాస్తవానికి బ్జడెట్ దగ్గర ఉందని నారాయణఖేడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి అన్నారు. అందుకే ప్రతిపక్షానికి మింగుడు పడటం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు గంగలో కలిపారు. లక్ష రూపాయల రుణమాఫీ ఇప్పటికే చేసిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కింది. ఇప్పటికి పెండింగ్ బిల్లులు రావడం లేదని అన్నారు. గత ప్రభుత్వం మాదిరి అంకెల రూపంలో బడ్జెట్ పెట్టకుండా.. అన్ని శాఖలకు కేటాయింపులు చేపట్టారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. వాస్తవిక బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది. ఒక్కో రంగానికి ఎన్ని డబ్బులు కేటాయిస్తున్నం అనేది విపులంగా వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు జరగాలని కేటాయింపులు చేయడం జరిగింది. గత బడ్జెట్ లో కన్నా వైద్య విద్య కోసం ఎక్కువ కేటాయింపులు చేశారు. రూ. 9 వేల కోట్లు పైచిలుకు బడ్జెట్ పెట్టి.. వైద్య విద్యకు



పూర్వ వైభవం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తుంది. బడ్జెట్ ను తులనాడే విధంగా కేసీఆర్ మాట్లాడారు. గత బడ్జెట్ పేపర్లకు పరిమితం అయ్యింది. కేసీఆర్ ఇంకా ఊహల్లో ఉండకుండా.. బడ్జెట్ ను ఆహ్వానించాలని అన్నారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమం బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే మధన్ మోహన్ రావు అన్నారు. ఇది రైతు బడ్జెట్. తెలంగాణ వచ్చిన పదేళ్లలో నీటిపారుదల ప్రాజెక్టులు అని డబ్బులు తగలేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు.. త్రాగు నీటి సదుపాయాలు లేవు. స్కూల్స్‌లో టీచర్స్ లేరు. వైద్య, విద్య రంగాలకు నిధులు కేటాయింపు చేయడం జరిగింది. జాబ్ క్యాలెండర్ కూడా పెట్టడం జరిగింది. సెప్టెంబర్ 5, 6 లోగా గ్లోబల్ మేథోసంపత్తి కోసం స్కిల్ యునివర్సిటీ పెట్టే విధంగా ఏర్పాటు చేస్తున్నాం. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్షల కోట్లు తగల వేశారు. కానీ, ఇప్పుడు అన్ని రంగాలకు, సంక్షేమానికి బడ్జెట్లో నిధులు పెట్టారని అన్నారు.

## హైదరాబాద్‌లో పడకేసిన

# పారిశుధ్యం

### ఎక్కడ చూసినా చెత్తకుప్పల దర్శనం: కెటిఆర్



**హైదరాబాద్,జూలై25 (జనంసాక్షి):**
హైదరాబాద్‌లో ఎక్కడా చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సుమారు 1000 స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదన్నారు. బస్తీలు, కాలనీల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని చెప్పారు. డెంగీ, మలేరియా, అతిసారం వంటి సీజనల్ వ్యాధులతో ప్రజలు అవస్థలుపడుతున్నారని వెల్లడించారు. చెత్త తరలింపు కేవలం కాగితాల్లో మాత్రమే కనిపిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేయర్, అధికారుల ఆకస్మిక పర్యటనలు లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణ గాడితప్పుతున్నదని చెప్పారు. పర్యవేక్షించాల్సిన పార్ట్‌-టైం మున్సిపల్ మంత్రేమో ఎమ్మెల్యేల కొనుగోళ్లు, ఢిల్లీ చక్కర్లలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇకనైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, పౌరుల ఆరోగ్యాలు కాపాడాలని ప్రభుత్వానికి సూచించారు.

# గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం

### డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు

### హోంశాఖకు బడ్జెట్ లో రూ.9,564 కోట్లు కేటాయింపు



**హైదరాబాద్,జూలై25 (జనంసాక్షి):**
రాజధాని హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా పేట్రేగిపోతున్న గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇటీవల సినీ పరిశ్రమకు కూడా కీలక సూచనలు సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజా బడ్జెట్ లోనూ దీన్ని ప్రధానంగా ప్రస్తావించారు. యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాల కట్టడి, శాంతి భద్రతల కోసం హోం శాఖకు బడ్జెట్ లో రూ.9,564 కోట్లు కేటాయించింది. మాదక ద్రవ్యాల వినియోగం చాలా ప్రమాదకరం. యువత దీని బారినపడితే దేశ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారు తుంది. రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులను ఈ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నాం. డ్రగ్స్ రవాణా, వినియోగం చేస్తూ పట్టుబడితే వారిని ఉపేక్షించొద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. తెలంగాణ మాదకద్రవ్య నిరోధక సంస్థకు తగిన సౌకర్యాలు కల్పించి దాన్ని బలోపేతం చేశాం. విద్యాసంస్థల్లో వీటి కట్టడికి యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి.. 4,137 మంది విద్యార్థులను యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా నియమించాం. మాదక ద్రవ్యాల వల్ల జరిగే హానిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సినీ ప్రముఖుల సహకారం తీసుకుంటున్నాం. వీటికి సంబంధించిన కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇస్తున్నాం అని ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. మరోవైపు నానాటికీ పెరుగుతున్న సైబర్ నేరాలపైనా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విషయాన్ని కూడా మంత్రి భట్టి బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. రాష్ట్రాభివృద్ధికి శాంతి భద్రతల పరిరక్షణ ఎంతో అవసరం. అభద్రతా వాతావరణంలో పెట్టుబడి పెట్టడానికి అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపించవు. ఈ మధ్య వైట్ కాలర్, సైబర్ నేరాలు పోలీసు వ్యవస్థకు సవాల్‌గా మారుతున్నాయి. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు సైబర్ సెక్యూరిటీ విభాగానికి అవసరమైన వాహనాలు అందించాం. ఆధునిక నేర పరిశోధనలో పోలీసులకు శిక్షణ ఇస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులను నమోదు చేసే అవకాశం కల్పించాం. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులు చేసేలా వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబరుపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. కేంద్రం తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించేలా శిక్షణా తరగతులు నిర్వహించాం అని మంత్రి భట్టి వివరించారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్ ఐ



**భద్రాద్రి కొత్తగూడెం జూలై25 (జనంసాక్షి):**
ఓ కేసు విషయంలో ఓ ఎస్ఐ న్యాయవాది నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచకు చెందిన సీరపు శ్రావణి అనే మహిళ కొత్తగూడెంకు చెందిన బాలసాని గణేశ్ గౌడ్‌కు రూ.20 వేలు అప్పుగా ఇచ్చింది. ఈ క్రమంలో అతడు మర ణించగా.. అప్పు డబ్బుల కోసం అతడి కుటుంబ సభ్యులపై కొత్తగూడెం కోర్టులో శ్రావణి కేసు వేసింది.అయితే గణేశ్ గౌడ్‌కు చెందిన ఆస్తిని పాల్వంచకు చెందిన చావా శ్రీనివాస్ అనే వ్యక్తి కోర్టులో కేసు ఉండగానే కొనుగోలు చేశాడు. దీనిపై బాధితురాలు శ్రావణి తరఫున హైకోర్టు న్యాయవాది గా పనిచేస్తున్న పాల్వంచకు చెందిన లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చావా శ్రీనివాస్‌తో సంప్రదింపులు జరపగా.. ఆ డబ్బులు తానే ఇస్తానని ఒప్పుకొని తర్వాత వేధింపులకు గురి చేశాడు. దీంతో ఆమె పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో 2024, మే 19న పట్టణ ఎస్ఐ బాణాల రాముకు ఫిర్యాదు చేసింది. కేసు విషయంలో చార్జిషీట్ దాఖలు చేయడానికి కోర్టుకు ఎఫ్ఐఆర్ కాపీ కావాలని సదరు న్యాయవాది ఎస్ఐని సంప్రదించగా.. తనకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముందుగా తనకు రూ.20 వేలు ఇవ్వాలని చెప్పడంతో న్యాయవాది లక్ష్మారెడ్డి హైదరాబాద్‌లో ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్‌కు సమాచారం అందించారు. గురువారం మధ్యాహ్నం సమయంలో పాల్వంచలోని తన ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వాలని ఎస్ఐ రాము న్యాయవాదిని కోరారు. దీంతో సదరు బాధిత మహిళ శ్రావణి తరఫు న్యాయవాది లక్ష్మారెడ్డి నుంచి ఎస్ఐ రాము రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు డీఎస్పీ వై.రమేశ్ ఆధ్వర్యంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# లయన్స్ కంటి హాస్పిటల్ ను సందర్శించిన మాజీ మంత్రి ఆర్డీఆర్

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల లయన్స్ కంటి హాస్పిటల్ ను మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి గురువారం సందర్శించారు. హాస్పటల్ లో రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ కి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, మీలా మహదేవ్, ధరావత్ వీరన్న నాయక్, హాస్పిటల్ చైర్మన్ దోసపాటి గోపాల్, చిలుముల శ్రీనివాస్ రెడ్డి, మర్రు హనుమంతరావు, డాక్టర్ క్రాంతి, మేనేజర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



# అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

### లారీని ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి

**పెద్దపల్లి, జూలై25 (జనంసాక్షి):**
పెద్దపల్లి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులకు బుధవారం రాత్రి 11గం ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలలోకి వెళ్తే.. వివరాల్లోకి వెళ్తే.. ఈశాల తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దాడి శివ, కొండ వికాస్, పొన్నం సాయి కిరణ్ గోదావరిఖని నుంచి ఈశాల తక్కళ్లపల్లి గ్రామానికి వారి బైక్ పైన వస్తున్నారు.ఈ క్రమంలో ఐ.ఓ.సి పెట్రోల్ పంపు యూ టర్న్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో దాడి శివ(18) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే 108లో గోదావరిఖని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టార. శివ మృతి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పాఠశాలల్లో వర్షపు జల్లులు

### గొడుగులు పట్టుకుని విద్యార్థుల చదువులు

**మంచిర్యాల,జూలై25 (జనంసాక్షి):**
రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత, మౌలిక వసతుల లేమితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండా, వాన నుంచి కాపాడాల్సిన తరగతి గదే నీళ్లలో ముంచెత్తుతుండటంతో విద్యార్థులు గొడుగులు ఆసరగా చేసుకొని చదువువాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషాదకర సంఘటన మంచిర్యాల జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..కృష్ణపల్లి జెడ్పీ సెకండరీ స్కూల్భవనంలో వర్షపు నీరు లీక్‌అవ్వడంతో విద్యార్థులు క్లాసు రూంలో గొడుగులు పట్టుకొని పాఠాలు వింటున్నారు. పుస్తాకాలు, పెన్నులు పట్టుకొని చదువాల్సిన విద్యార్థులు ఓ చేతితో పెన్ను మరో చేతితో గొడుగు పట్టుకొని చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కాగా, రూ.2 లక్షలతో మరమ్మతులు చేశామని చెప్పిన వర్షపు నీరు లీక్ అవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## పశువుల కొట్టంలోకి దూసుకెళ్లిన బస్సు



**ఆదిలాబాద్, జూలై25 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్రంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పశువుల కొట్టంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దాదాపు 20 మంది ప్రయాణికులకు గాయాలైనట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలో కరంజీ (టి) నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్న బస్సు ఆర్లీ(టి) గ్రామంలోకి రాగానే అదుపుతప్పి బస్సు రోడ్డు పక్కనే ఉన్న బక్కి ఆనిల్ అనే రైతు కొట్టంలోకి దూసుకెళ్లి.. కట్టేసి ఉన్న ఎద్దును ఢీ కొట్టింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా.. చాలా మందికి గాయాలు అయినట్లు చెబుతున్నారు. ఇక గాయాలు అయిన వారిని వెంటనే ఆస్పత్రికి కూడా తీసుకెళ్లారట. ఈ ప్రమాదంపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## తలసరి ఆదాయంలో మనమే మిన్న

### జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు ఎక్కువ

**హైదరాబాద్, జూలై25 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన బడ్జెట్ ప్రసంగం చేస్తూ.. తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు చాలా ఎక్కువగా ఉందని చెప్పారు. 'ప్రస్తుతం తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు ఎక్కువ. రాష్ట్రంలో తలసరి ఆదాయ సగటు రూ.3,47,299 ఉంటే.. జాతీయ తలసరి ఆదాయ సగటు కేవలం రూ.1,83,236గా ఉంది. అంటే జాతీయ తలసరి ఆదాయ సగటుతో పోల్చితే.. రాష్ట్ర తలసరి ఆదాయ సగటు రూ.1,64,063 ఎక్కువగా ఉన్న ది' అని భట్టి విక్రమార్క చెప్పారు. అయితే తలసరి ఆదాయ స్థాయిల్లో జిల్లాల మధ్య తీవ్ర అంతరం ఉన్నదని, రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం రూ.9,46,862 ఉంటే.. వికారాబాద్‌లో రూ.1,80,241 ఉన్నదని ఆర్థిక మంత్రి చెప్పారు. జిల్లాల మధ్య ఉన్న ఆదాయ అంతరాలను తగ్గించడానికి తాము కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

# విజన్ లేని భట్టి బడ్జెట్

### ఎఫ్‌డిసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం



**హైదరాబాద్,జూలై25 (జనంసాక్షి):**
అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను వంచనకు గురి చేసేలా ఉందని ఎఫ్‌డిసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ..గత ప్రభుత్వంలో నాటి సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎన్నో మంచి పథకాలు తీసుకొ చ్చారు. అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసేలా బడ్జెట్ ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. కానీ, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పక్కన బెట్టి కాంట్రాక్టు, కమీషన్ వచ్చే వాటికి ప్రాధాన్యతనిస్తున్నాయని విమర్శించారు.ఆరు నెలలుగా ఎక్కడ కూడా నూతన విధానాలని రూపొందించలేదని మండిపడ్డారు. వారికి అలాంటి విజన్ ఉన్నట్టు కనపడడం లేదన్నారు. ఎంత సేపు రాజకీయ కోణంలోనే పాలన సాగుతుందని, ఇతర పార్టీల నాయకులని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని దాని పై ఉన్న శ్రద్ధ రాష్త అభివృద్ధి పై లేదని మండిపడ్డారు. ఇటీవల కేంద్ర బ్జడెట్‌లో సైతం ఒక్క రూపాయి తేలేని అసమర్థ దద్దమ్మ ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని ఘాటుగా విమర్శించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో వీరి ప్రజా వ్యతిరేక విధానాలని ఎక్కడికక్కడ ఎండ గడతారని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నాయకులని ఊర్లో తిరిగే పరిస్థితి లేకుండా చేస్తారన్నారు.

# ట్రాఫిక్ పోలీసులు అత్యుత్సాహం

### వాహనదారుడిని చితకబాదిన పోలీసులు

### నెట్టింట వైరల్‌గా మారిన వీడియో



**హైదరాబాద్,జూలై25 (జనంసాక్షి):**
చేవెళ్లలో ట్రాఫిక్ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ ఓ వాహనదారుడిని చితకబాదారు. ఘోరంగా తిడుతూ.. కాళ్లతో తన్నుతూ బైకర్ ను ఈడ్చుకెళ్లారు. చేవెళ్ల లోని శంకర్ పల్లి రోడ్డులో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చేవెళ్లలోని శంకర్ పల్లి రోడ్డులో బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, కానిస్టేబుల్ జందార్ శీను, హోంగార్డ్ కేశవ్. డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఓ వాహనదారుడికి ట్రాఫిక్ పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో రెచ్చిపోయిన ట్రాఫిక్ సీఐ వెంకటేశం, కానిస్టేబుల్ జందార్ శీను, హోంగార్డ్ కేశవ్ లు బైకర్ ను చితకబాదారు. బూతులు తిడుతూ, కాళ్లతో తన్నుతూ ఈడ్చుకెళారు. పోలీసులు బైకర్ ను కొడుతుండగా.. మరో ప్రయాణికుడు వీడియో తీశాడు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చేవెళ్ల ట్రాఫిక్ సిఐ వెంకటేశం, కానిస్టేబుల్ శ్రీను, హోమ్ గార్డ్ కేశవ్ ల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.ప్రజల పట్ల అవమానకరంగా ప్రవర్తిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

## ములుగు జిల్లాలో భారీ వర్షాలు

### చెట్టు కూలి వ్యక్తి మృతి



**ములుగు, జూలై25 (జనంసాక్షి):**
ములుగు జిల్లాలో వానలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు చెరువులు, కుంటలు మత్తడి దుంకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలుచోట్ల చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాజాగా జిల్లాలోని ఏటూరు నాగారం మండలం చిన్నబోయినపల్లి వద్ద గల 163వ జాతీయ రహదారిపై భారీ వృక్షంకూలింది. ఈ ప్రమాదంలో చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన జహంగీర్ అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జహంగీర్ తన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా బోయిన పల్లి వద్దకు రాగానే ఒక్కసారిగా భారీ వృక్షం కూలి తన మీద పడడంతో ఆక్కడికక్కడే మృతి చెందాడు. సమా చారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

## భూమిలేని కూలీలకు ఏటా 12 వేల సాయం

**హైదరాబాద్,జూలై25 (జనంసాక్షి):**
రాష్ట్రంలో భూమిలేని గ్రామీణ ప్రజానీకం ఎక్కువగా రైతు కూలీలుగా జీవనం గడుపుతోందని, వారికి ఎలాంటి ఆర్థిక భద్రత లేకపోవడంతో పనిదొరకని రోజుల్లో పస్తులు ఉండాల్సి వస్తున్నదని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అసెంబ్లీలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతూ ఆర్థిక మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి సొంత భూములు లేవని, దాంతో వాళ్లు రైతు కూలీలుగా జీవనం గడుపుతున్నారని ఆర్థిక మంత్రి చెప్పారు. వారి జీవితాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. అందుకే భూమిలేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సాయాన్ని ఈ సంవత్సరమే ప్రారంభిస్తామని చెప్పారు.



# ఐటీఆర్‌లో తప్పులా..?

## ఇలా చేస్తే రివైజ్డ్ ఐటీఆర్ అవసరం లేదు!




ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలి. ఫారం-16, 26 ఏఎస్, ఏఐఎస్ వంటి వాటిని ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలి.ఎంత జాగ్రత్తగా వ్యవహరించినా కొన్నిసార్లు పొరపాట్లు జరుగుతుంటాయి. ఇలా జరిగితే ఒకప్పుడు రివైజ్డ్ ఐటీఆర్ సమర్పించడం ఒక్కటే మార్గం. 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్తగా మరో వెసులుబాటు తీసుకొచ్చారు. అదే డిస్కార్డ్ ఆప్షన్ . ఐటీఆర్‌లో తప్పులు గుర్తించిన వారు నిర్దేశిత గడువులోగా ఈ ఆప్షన్‌ను వినియోగించు కోవచ్చు. ఐటీఆర్‌లో పొరపాట్లను గుర్తించి సకాలంలో రిటర్నులు దాఖలు చేయడానికి ఆదాయపు పన్ను శాఖ తీసుకొచ్చిన సదుపాయమే డిస్కార్డ్ ఐటీఆర్. సింపుల్‌గా చెప్పాలంటే మీరు ఫైల్ చేసిన ఐటీఆర్‌ను డిలీట్ చేసి మళ్లీ కొత్తగా ఐటీఆర్‌ను ఫైల్ చేసుకోవడమే దీని ఉద్దేశం. అంటే డ్రాఫ్ట్‌లో పెట్టిన ఇ-మెయిల్ తరహాలో దీన్నీ డిలీట్ చేసుకోవచ్చన్నమాట. అయితే, వెరిఫై కాని ఐటీఆర్‌ల విషయం లోనే ఈ ఆప్షన్ ఉపయోగపడుతుంది. అంటే ఐటీఆర్ స్టేటస్ దగ్గర 'అన్ వెరిఫైడ్/ పెండింగ్ ఫర్ వెరిఫికేషన్' అని ఉన్నప్పుడు మాత్రమే ఈ వెసులుబాటును ఉపయోగించుకోవడానికి వీలుంటుంది. ఎన్నిసార్లయినా డిలీట్ చేసి కొత్త ఐటీఆర్ ఫారాన్ని ఎంచుకుని రిటర్నులు దాఖలు చేయొచ్చని ఇ-ఫైలింగ్ పోర్టల్‌లో ఐటీ శాఖ పేర్కొంది.

**ఎలా చేయాలి?**

డిస్కార్డ్ ఐటీఆర్ ఆప్షన్‌ను వినియోగించుకోవాలంటే ఈ-ఫైలింగ్ పోర్టల్‌లోకి లాగిన్ అవ్వాలి. అందులో ఈ-వెరిఫై ఐటీఆర్ అనే ఆప్షన్‌లోకి వెళ్లాలి. అక్కడ మీరు ఫైల్ చేసిన ఐటీఆర్ వివరాలు కనిపిస్తాయి. ఈ-వెరిఫై పక్కనే డిస్కార్డ్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి కొత్తగా రిటర్నులు దాఖలు చేయాలి. సాధారణంగా రిటర్నులు దాఖలు చేసిన 30 రోజుల్లోగా రిటర్నులను ఈ-వెరిఫై చేయాల్సి ఉంటుంది. అలా చేయకుండా పెండింగ్‌లో ఉంచిన వారు ఈ ఆప్షన్ వినియోగించుకోవచ్చు.

**ఈ తేదీకి ముందే..**

డిస్కార్డ్ ఆప్షన్‌ను జులై 31 కంటే ముందు మాత్రమే వినియోగించాలి. ఒకవేళ ఆ తేదీ తర్వాత డిలీట్ చేస్తే గడువు దాటాక ఐటీఆర్‌ను ఫైల్ చేసినట్లవుతుంది. అప్పుడు పెనాల్టీ చెల్లించాల్సి వస్తుంది. గడువు తర్వాత బిలేటెడ్ ఐటీఆర్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ గడువు తేదీ దాటిన తర్వాత తప్పులను గుర్తిస్తే డిసెంబర్ 31లోపు రివైజ్డ్ ఐటీఆర్ దాఖలు చేయడం ఉత్తమం. అప్పుడు రివైజ్డ్ ఐటీఆర్‌నే ఐటీ శాఖ పరిగణనలోకి తీసుకుంటుంది.

# సుప్రీం ఆదేశాలతో నీట్ తుది ఫలితాల వెల్లడి

**61 నుంచి 17కు తగ్గిన టాప్ ర్యాంకర్ల సంఖ్య**

**వెబ్‌సైట్‌లో ఫలితాలను విడుదలచేసిన ఎన్‌టిఎ**



**న్యూఢిల్లీ,జూలై25 (జనంసాక్షి):**
నీట్ యూజీ 2024 పరీక్ష వివాదం వేళ ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఫిజిక్స్ విభాగంలోని ఓ ప్రశ్నకు ఒకటే సమాధానం ఉంటుందని నిపుణుల కమిటీ తేల్చడంతో దాని ఆధారంగా ఫలితాలను సవరించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పరీక్ష తుది ఫలితాలను ఎన్‌టీఏ గురువారం విడుదల చేసింది. ఇందులో 4.2లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులను కోల్పోయారు. దీంతో టాప్ ర్యాంక్ సాధించిన వారి సంఖ్య కూడా 61 నుంచి 17కు తగ్గింది. సవరించిన ఫలితాలను విద్యార్థులు ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఫిజిక్స్ విభాగంలోని అటామిక్ థియరీకి సంబంధించిన 29వ ప్రశ్నకు రెండు సమాధానాలు ఉన్నాయని, వాటిలో దేన్ని ఎంపిక చేసినా మార్కులిచ్చారని ఆరోపిస్తూ ఓ అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. ముగ్గురు నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, నివేదిక అందించాలని ఐఐటీ-దిల్లీని ఆదేశించింది. ఈ క్రమంలోనే సంబంధిత ప్రశ్నకు ఒక సమాధానమే ఉందని, రెండు లేవని... ఆప్షన్ 4 ఒక్కటే సమాధానమని నిపుణుల కమిటీ కోర్టుకు విన్నవించింది. దాంతో ఆప్షన్ 4ను ఎంచుకున్న అభ్యర్థు లకే మార్కులు ఇవ్వాలంటూ ధర్మాసనం పరీక్ష నిర్వాహకులను ఆదేశించింది. ఫలితంగా మరోసారి రివైజ్డ్ ర్యాంకులను విడుదల చేయడం అనివార్యంగా మారింది. తాజాగా ఎన్‌టీఏ తుది ఫలితాలను వెల్లడించగా.. సుమారు 4.2లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులు కోల్పోయారు. దీంతో మెరిట్ లిస్ట్ మారింది. అంతేకాదు.. 720కి 720 స్కోరు సాధించిన 61 మందిలో ఈ ప్రశ్నకు మార్కులు పొందిన వారు 44 మంది ఉన్నారు. వారి స్కోరు కూడా మారడంతో టాప్ ర్యాంకర్ల జాబితా 17కు తగ్గింది.

# విద్యార్థులకు అరుదైన అవకాశం

**స్పీకర్ చొరవతో అసెంబ్లీ వీక్షణం**



**అమరావతి,జూలై25 (జనంసాక్షి):**
ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు విద్యార్థులకు అసెంబ్లీ సమావేశాలు చూసే అవకాశం కల్పించారు. మొట్ట మొదటి సారిగా చదువుకునే విద్యార్థులకు ఏపీ అసెంబ్లీ సమావేశాలు చూసే అవకాశం ఆయన కల్పించారు. ప్రతిరోజు 100 మంది సభను చూసే అవకాశం ఉంది. గత మూడు రోజులుగా వివిధ కాలేజీల నుండి విద్యార్థులు అసెంబ్లీ సమావేశాలు వీక్షిస్తున్నారు. గురువారం నాల్గవ రోజు అసెంబ్లీ సమావేశంలో భాగంగా రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులు సుమారు 100 మంది సమావేశాలు స్వయంగా వీక్షించారు. స్వయం గా అసెంబ్లీ సమావేశాలు వీక్షించడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు అన్నారు. టీవీలలో చూడటం తప్ప స్వయంగా వచ్చి ఈ అసెంబ్లీ సమావేశాలు వీక్షించడం చాలా సంతోషంగా ఉందని, ఈ అవకాశాన్ని కల్పించిన గౌరవ స్పీకర్ అయ్యన్న పాత్రుడుకు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. తెలుగు భాష గొప్పతనాన్ని అందరికీ తెలియజేయడం తో పాటు.. మాతృ భాష ప్రాధాన్యత తగ్గకుండా ఉండేలా అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టే సమయంలో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు పూర్తిగా తెలుగుభాషనే ఉపయోగిస్తూ కొత్త సంప్రదాయానికి నాందిపలికారు. మంగళవారం, బుధవారం సభలో ప్రవేశపెట్టిన బిల్లుల సందర్భంగా బిల్లులు ప్రతిపాదించే సమయంలోనూ, ఆమోదం పొందే సమయంలోనూ ఆయన పూర్తిగా తెలుగు భాషను ఉపయోగించారు. తాను ఈ సంప్రదాయాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తున్నానని.. సభ్యులంతా సహకరించాలని ఆయన కోరారు.



# శాంతిభద్రతల్లో రోల్ మోడల్‌గా ఏపి

**ప్రజలకు భద్రత కలిగించేలా చర్యలు**

**విస్తృత చర్చ చేపట్టి నిర్ణయాలు తీసుకోవాలి**

**అసెంబ్లీలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్**

**అమరావతి,జూలై25 (జనంసాక్షి):**
ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతల పర్యవేక్షణపై ప్రత్యేక చర్చ పెట్టాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోరారు. ఏపీ అసెంబ్లీ సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ మీద లోతైన చర్చ జరగాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించాలని కోరారు.శాంతి భద్రతల పై ప్రభుత్వం తీసుకునే భవిష్యత్ ప్రణాళిక , చట్టం అంటూ భయం వచ్చే విధంగా ఉండాలని పేర్కొన్నారు. చర్చల్లో సభ్యులందరి సూచనలు తీసుకొని 5కోట్ల మంది ప్రజల భద్రత కలిగించేలా ఉండాలని అన్నారు. భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ శాంతి భద్రతల్లో తలమానికంగా ఉండేలా విస్తృతస్థాయి చర్చ జరిగి విధి, విధానాల రూపకల్పన చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ వచ్చే బ్జడెట్ సమావేశాల సందర్భంగా ఒకరోజు శాంత భద్రతల అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. నేరాలను అరికట్టేందుకు ప్రజా చైతన్యం ఎంతో అవసరమని అన్నారు. పోలీసు వ్యవస్థను పటిష్టవంతం చేయాల్సిన అవసరముందని అన్నారు. గత వైసీపీ పాలనలో ప్రజాప్రతినిధులు, సామాన్య ప్రజానికంపై రాజకీయ ప్రేరేపితంగా పెట్టిన కేసులను విచారించి చర్యలను తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని గౌరవించాలని అన్నారు. కూటమి సభ్యులు ఎవరూ కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని కోరారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎంతటివారిపైనా చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేయనని చంద్రబాబు వెల్లడించారు.

## జనంసాక్షి జాతీయం అంతర్జాతీయం



# ఘోర బోటు ప్రమాదం..

## 15 మంది మృతి.. -150 మంది గల్లంతు

అబుజా: ఆఫ్రికాలోని మారిటానియా సముద్రతీరంలో ఘోర బోటు ప్రమాదం జరిగింది. యూరప్ దిశగా వెళ్తున్న బోటు బోల్తాపడి 15 మంది ప్రాణాలు కోల్పోయారు.మరో 150 మంది గల్లంతైనట్లు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఓఎం) తాజాగా వెల్లడించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపింది. సుమారు 300 మంది వలసదారులతో వెళ్తున్న బోటు మారిటానియా రాజధాని నాఖ్కోట్ సమీపంలో సోమవారం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. సమాచారం అందుకున్న కోస్టు గార్డు సిబ్బంది 120 మందిని రక్షించినట్లు బుధవారం ఐఓఎం ఓ ప్రకటన విడుదల చేసింది. దురదృష్టవశాత్తు 15 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తాజాగా వెల్లడించింది.పశ్చిమ ఆఫ్రికాకు చెందిన వేలాది మంది స్పెయిన్‌కు చెందిన కానరీ దీవులకు వలస వెళ్తున్నారు. దీనికోసం చిన్న చిన్న చేపల బోట్ల ద్వారా అట్లాంటిక్ సముద్రంలో సెనెగల్ మార్గంలో ప్రయాణించి.. మారిటానియాకు చేరుకుంటున్నారు. అక్కడి నుంచి ఉత్తర దిక్కుగా ప్రయాణించి కానరీ దీవులు చేరుకుంటున్నారు. దగ్గరి మార్గంతోపాటు, ప్రయాణ ఖర్చులు తక్కువగా ఉంటాయన్న కారణంతో ప్రమాదకరమని తెలిసినప్పటికీ.. ఎక్కువ మంది ఇదే మార్గాన్ని ఎంచుకుంటున్నారు.పేదరికం, ఆయా ప్రాంతాల్లో అస్థిరత కారణంగా యూరప్ దేశాలకు వలస వెళ్లే ఆఫ్రికన్ ప్రజల సంఖ్య పెరిగిపోయింది. కొందరు పిల్లల్ని తల్లిదండ్రులే బలవంతంగా పంపిస్తుండటం అక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 20వేల మంది వలసదారులు ఈ ద్వీపాలకు వెళ్లినట్లు ఐఓఎం చెబుతోంది. గతేడాది ఇదే సమయంతో పోల్చుకుంటే ఈ సంఖ్య మూడు రెట్లు ఎక్కువ. గతేడాది ఈ మార్గంలో ప్రయాణించిన వారిలో కనీసం 1,950 మంది ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని ఐఓఎం అంచనా వేస్తోంది.

# సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం

**అమరావతి,జూలై25 (జనంసాక్షి):**
ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సమావేశం కొనసాగుతోంది. పోలవరం ప్రాజెక్టులోని డయాఫ్రం వాల్ నిర్మాణంపై కేబినెట్‌లో చర్చించనున్నారు.కొత్త డయాఫ్రం నిర్మాణ ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం నీతి ఆయోగ్‌లో ఏపీ ప్రతిపాదించనుంది. దిల్లీలో ఈ నెల 27న జరిగే నీతి ఆయోగ్ సమావేశంలో డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రతిపాదనలు సీఎం పెట్టనున్నారు. నీతి ఆయోగ్‌లో ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తప్పనిసరి కావటంతో ప్రస్తుతం దానిపై అత్యవసర కేబినెట్ భేటీ నిర్వహిస్తున్నారు. బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యం ఇవ్వటంపైనా కేంద్రాన్ని అభినందిస్తూ కేబినెట్‌లో తీర్మానం

# ఎపిలో ఐదేళ్లపాటు జగన్ అరచాకం

**కక్షసాధింపుతో విపక్ష నేతలపై కేసులు**

**నిరాఘాటంగా అరాచక, విధ్వంస పాలన**


**యథేచ్ఛగా హత్యలు, అత్యాచారాలు, దాడులు, దోపిడీలు**

**బాధితుల్లో కోడెల, రఘురామ, పవన్,అచ్చెన్న, అయ్యన్న,అనిత**

**రఘురామ టార్చర్ చూసి జగన్ పైశాచికానందం**

**అసెంబ్లీ వేదికగా అక్రమ వేధింపు కేసుల చిట్టా విడుదల**

**శాంతిభద్రతలపై శ్వేతపత్రం విడుదల చేసిన సిఎం చంద్రబాబు**




**అమరావతి,జూలై25 (జనంసాక్షి):**
హింస, నేరప్రవృతి గల జగన్ లాంటి వ్యక్తులకు రాజకీయాల్లో అర్హత లేదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మెరుగైన సమాజం రావాలంటే మంచి రాజకీయ వేత్తలు అధికారంలో ఉండాలని వెల్లడించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల నాలుగోరోజున ఆయన అసెంబ్లీ లో శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచక , విధ్వంస పాలన కొనసాగిందని, శాంతి భద్రతలు కరువయ్యాయని అన్నారు. ఈ సందర్భంగా ఐదేండ్ల వైఎస్ జగన్ పాలనలో జరిగిన హత్యలు, అత్యాచారాలు, దాడులు, దోపిడీలు, నేరాలకు సంబంధించిన అంశాలను చంద్రబాబు స్లైడ్‌ల ద్వారా వివరించారు. ప్రజాప్రతినిధులను కూడా ఎవరిని వదలలేదని ఆరోపించారు. జగన్ హయాంలో కేసులకు గురైన వారిని ఎన్నికల్లో గెలిపించి అసెంబ్లీకి పెద్ద సంఖ్యలో పంపించారని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులందరిపైన కేసులు పెట్టి హింసించారని తెలిపారు.కోడెల శివప్రసాద్ , రఘురామకృష్ణంరాజు, పవన్‌కల్యాణ్,అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు తదితరులపై కేసులు పెట్టారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం న్యాయవ్యవస్థను కూడా వదల్లేదని ఆరోపించారు. 2019-24 మధ్య కాలంలో ప్రభుత్వమే హింసను ప్రేరేపించిందని అన్నారు. శాంతి భద్రతలు విఫలమయ్యారని వైసీపీ నేతలు ఢిల్లీలో నిరసన తెలుపడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శాంతి భద్రతలను సక్రమంగా నిర్వర్తించడంపై పూర్తి బాధ్యత తీసుకుంటుందని చంద్రబాబు ప్రకటించారు. కూటమి పాలనలో నేరాలను పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని అరికడతామని స్పష్టం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక తనపై 17 కేసులు పెట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పోలీస్ వ్యవస్థను జగన్ ప్రభుత్వం పూర్తిగా విధ్వంసం చేసిందని మండిపడ్డారు. బాబ్లీ కేసు తప్ప తనపై గతంలో ఎప్పుడూ కేసులు లేవని స్పష్టం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై 7 కేసులు పెట్టారని గుర్తుచేశారు. వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని విమర్శించారు. కక్ష సాధింపు చర్యలకు గతంలో పోలీసులు ఆయుధంగా మారారని, ప్రభుత్వంతో పోలీసులు కుమ్మక్కై నిబంధనలు ఉల్లంఘించారని అన్నారు. వైసీపీ నేతలతో విభేదిస్తే పోస్టింగ్‌లు ఉండవు.. వీఆర్‌లో ఉంచేవారని తెలిపారు. ఐదేళ్లపాటు వీఆర్‌లో ఉన్న అధికారులు కూడా ఉన్నారని అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విపక్ష నేతలను అణచివేసే కుట్ర చేశారన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై 60కి పైగా కేసులు పెట్టారని, పల్లా శ్రీనివాసరావు ఇంటిని కూల్చివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. పులివెందులలో పోటీ చేసిన రవీంద్రనాథ్‌ను జైల్లో పెట్టారన్నారు. సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయంటూ.. ధూళిపాళ్ల నరేంద్రను జైలులో పెట్టారని చెప్పారు. ప్రభుత్వ అధికారులపై దాడుల నెపంతో కూన రవికుమార్‌పై కేసు పెట్టారని తెలిపారు.మహిళలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టారు. ఫర్నీచర్ దుర్వినియోగం చేశారని దివంగత నేత కోడెల శివప్రసాదరావుపై 18 కేసులు పెట్టారు. అవమాన భారంతో బతకలేక కోడెల ఆత్మహత్య చేసుకున్నారు. నాటి సీఎం జగన్ ఇంట్లో ఇప్పటికి కూడా ప్రభుత్వ ఫర్నీచర్ ఉంది. వంగలపూడి అనితపై అట్రాసిటీ కేసు పెట్టారు. అయ్యన్న పాత్రుడుపై అట్రాసిటీ, అత్యాచారయత్నం కేసు పెట్టారు. అచ్చెన్నా యుడు ఆరోగ్యం సరిగా లేకున్నా,పైల్ ఆపరేషన్ చేయించుకుని బాధపడుతున్న సంగతి తెలిసీ 600 కి.మీ. వాహనంలో తిప్పారు. రఘురామరాజును లాకప్‌లో చిత్రహింసలు పెట్టారు. రఘురామను సొంత నియోజకవర్గానికి వెళ్లకుండా చేశారు. చిత్రహింసల వీడియో చూసి నాటి సీఎం పైశాచిక ఆనందం పొందారని చంద్రబాబు ధ్వజమెత్తారు. సంబంధం లేకపోయినా పేపర్ లీక్ అయిందని పొంగూరు నారాయణపై కేసు పెట్టారు. న్యాయమూర్తుల పైనా ఫేక్ పోస్టులు పెట్టారు. టీడీపీ, జనసేన కార్యాలయాల పై దాడులు చేశారు. జై జగన్ అనలేదని తోట చంద్రయ్యను చంపారు. వైసీపీ ప్రభుత్వం అక్రమంగా జీవో1 తీసుకువచ్చింది. టీడీపీ నేతలపై 591 కేసులు పెట్టారు, 162 మందిని అరెస్ట్ చేశారు. మా కార్యకర్తలపై1969 కేసులు పెట్టారు, 2370 మందిని అరెస్ట్ చేశారు. జనసేన నేతలు, కార్యకర్తలపై 206 కేసులు పెట్టారు. సొంత చెల్లి షర్మిలపై కూడా 2 కేసులు నమోదు చేశారు. శాంతిభద్రతలు విఫలమయ్యా యని వైసీపీ నేతలు ఢిల్లీలో నిరసన తెలుపుతున్నారు. లా అండ్ ఆర్డర్ సక్రమంగా నిర్వర్తించడం మా బాధ్యత. తప్పుడు రాజకీయాలు చేస్తే సహించం' అని చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2019-24 మధ్య దయనీయంగా మారిన శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు నాయుడు గురువారం అసెంబ్లీశ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..అమరావతికి ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చినందుకు 2525మందిని అరెస్టు చేశారని తెలిపారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం కార్యక్రమంలో రోడ్డుపై భోజనం చేసేలా చేశారన్నారు. అరసవెల్లి వెళుతుంటే దాడి చేసి అడ్డుకున్నారన్నారు. జగన్ మీటింగ్‌లకు వెళ్లే వారి బ్లాక్ చున్నీలను తీయించి పంపడం ఇలా... ఎన్ని అరాచకాలు చేయాలనుకున్నారో అన్ని చేశారని సీఎం విమర్శించారు. దేవాలయాలపై దాడులు చేశారని అన్నారు. అంతర్వేదిలో రథాన్ని అంటించి కథలు చెప్పారని మండిపడ్డారు. రాముడి తల తీయడం, వెండి సింహాలు దొంగిలించారన్నారు. ఎన్నికల అక్రమాలు, బోగస్ కార్డులు తయారు చేశారన్నారు. స్థానిక ఎన్నికలు అన్ని ఏకగ్రీవం చేసుకున్నారని వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ కమిషనర్ కేంద్రం నుంచి రక్షణ కోరారని సీఎం తెలిపారు. హూ కిల్డ్ బాబాయ్ మొదట హార్ట్‌ఎటాక్ అన్నారని... తరువాత లోకల్ ఎంపీ, గంగిరెడ్డి, జగన్ రోడ్డు జర్నీలో వెళ్లారని.. గ్యాంగ్ ఆర్డర్ తెచ్చారన్నారు. సునీతను కూడా నమ్మించారన్నారు. చివరకు నిందితుడు అని భావిస్తున్న ఎంపీని అరెస్టు కూడా చేయనివ్వలేదని తెలిపారు. కోడికత్తి డ్రామా,గులకరాయి డ్రామాలు ఆడారన్నారు. కల్తీ మద్యం, గంజాయి విషయంలో అప్పటి ముఖ్యమంత్రి ఒక్కరోజు అయినా సమీక్ష చేశారా అని ప్రశ్నించారు. గంజాయిని ఎట్టిపరిస్థితుల్లో నియంత్రణ చేస్తామని స్పష్టం చేశారు. అలవాటు పడ్డవారు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏజెన్సీలో వారు గంజాయి సాగు చెయ్యొద్దని అడుగుతున్నానన్నారు. నేరస్తులే ముఖ్యమంత్రి అయితే ఏం జరుగుతుందో గత అయిదేళ్లు చూశామన్నారు. చరిత్రలో ఇలాంటి నాయకుడిని ఎప్పుడైనా చూసారా? నేను నలభై అయిదు ఏళ్ళలో ఎవ్వరిని చూడలేదని అన్నారు. కేసులు ఉన్న సభ్యులు ఓసారి లేవాలని సీఎం కోరగా.. పవన్‌కల్యాణ్, నారా లోకేశ్ సహా చాలా మంది తమ స్థానాల్లో నిలుచున్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ రాజకీయ పోరాటం చేసిన అందరిపైనా కేసులు పెట్టారన్నారు. ఎప్పటికీ బయటకు రానీయకూడదనుకున్నారని.. కానీ ప్రజలు నేరుగా అసెంబ్లీ పంపించారని చెప్పారు.రాయలసీమలో ఫ్యాక్షనిజం పోవడానికి తెదేపా హయాంలో చేపట్టిన చర్యలే కారణమని చంద్రబాబు తెలిపారు.'సీమలో ఫ్యాక్షనిజం లేకుండా చేయాలనే దృఢ సంకల్పంతో వెళ్లాం. గతంలో హైదరాబాద్‌లో మత ఘర్షణలను ఉక్కుపాదంతో అణచివేశాం. మత సామరస్యానికి విఘాతం లేకుండా చేశాం. హైదరాబాద్ అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా మారింది. నాగరిక ప్రపంచంలో వామపక్ష తీవ్రవాదం మంచిది కాదు. గ్రేహౌండ్స్, ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లు ఏర్పాటు చేశాం' అని చంద్రబాబు వివరించారు.

# ఇండియా కూటమితో పొత్తుకే ఢిల్లీ టూర్

## జగన్‌పై మంత్రి పయ్యావుల విమర్శలు



**అమరావతి,జూలై25 (జనంసాక్షి):**
ఇండియా కూటమితో పొత్తు కోసమే వైకాపా అధ్యక్షుడు జగన్ దిల్లీ వెళ్లినట్లు ఉందని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శాసనసభ వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. దిల్లీ నుంచి అమరావతికి వచ్చిన జగన్ అసెంబ్లీకి రావాలి. ఆయన చెబుతున్న రాజకీయ హత్యల వివరాలు సభలో పెట్టాలి. ఆ అంశంపై చర్చించి సమాధానం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దిల్లీ రోడ్లపై ఏపీలో శాంతిభద్రతల గురించి గగ్గోలు పెట్టడం దేనికి అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి. ఇవాళే ఆ అంశంపై శ్వేతపత్రం విడుదల చేస్తున్నాం అని పయ్యావుల తెలిపారు.




## విపణి

# ఐదో రోజూ నష్టాల్లో సూచీలు..

## 24,400 ఎగువన నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, మూలధన లాభాలపై బడ్జెట్ లో పన్ను ప్రతిపాదించడం వంటి కారణాలతో గురువారం ఉదయం భారీ నష్టాలతో సూచీలు ట్రేడింగ్‌ను ఆరంభించాయి.యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లో అమ్మకాలు సూచీలను పడేయగా.. టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టీ స్టాక్స్ దన్నుగా నిలిచాయి. దీంతో భారీ నష్టాల నుంచి సూచీలు గట్టెక్కాయి. నిఫ్టీ 24,400 స్థాయిని నిలుపుకొంది.సెన్సెక్స్ ఈ ఉదయం 79,542.11 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,148.88) నష్టాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం నష్టాల్లో కొనసాగినప్పటికీ.. నష్టాలు క్రమంగా తగ్గుముఖం పడుతూ వచ్చాయి. చివరికి 109.08 పాయింట్ల నష్టంతో సెన్సెక్స్ 80,039 వద్ద వద్ద స్థిరపడింది. నిఫ్టీ 7.40 పాయింట్ల నష్టంతో 24,406.10 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.17గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టీ, సన్‌ఫార్మా, కోటక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, నెస్లే ఇండియా, టైటాన్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా స్టీల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 80.22 డాలర్లు వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయంగా బంగారం ధర కాస్త తగ్గుముఖం పట్టింది. ఇన్నాళ్లూ ఔన్సు బంగారం ధర 2400 డాలర్లపైన ట్రేడవుతూ రాగా.. ప్రస్తుతం 2371 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దేశీయంగా కస్టమ్స్ సుంకం తగ్గించడంతో బంగారం ధరలు దిగివచ్చాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
26.07.2024

## పగతి నిరోధక బడ్జెట్



**కరీంనగర్ బ్యూరో, జులై 25 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాబడి, ఖర్చుల లెక్క పత్రం లాగా ఉందని బిజేపి సీనియర్ నాయకులు పి.సు గుణాకర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేటాయింపులు చెప్పడం మినహా లక్ష్యం లేని బడ్జెట్ భవిష్యత్తులో ఎలాంటి అభివృద్ధి చేయబోతున్నారనే దానిపై ఎలాంటి విజన్ లేని బడ్జెట్, యథాస్థితి విధానానికి ఊతమిస్తున్నదని అభివృద్ధి, ఉద్యోగ కల్పన, వివిధ వర్గాల సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, రాష్ట్ర భవిష్యత్తు గూర్చి విజన్ లోని లెక్కల పట్టి ఈ బడ్జెట్, వారు ఇచ్చిన ఎన్నికల హామీలు కూడా తీర్చలేని బడ్జెట్, ఒక్క మాటలో చెప్పాలంటే ఎలాంటి విజన్ లేని ప్రగతి నిరోధక బడ్జెట్ అని బిజేపి సీనియర్ నాయకులు పి.సుగుణాకర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

**కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ సత్యనారాయణ**



**సైదాపూర్ జులై 25(జనంసాక్షి):** ప్రభుత్వ జూనియర్ కలశాల సైదాపూర్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ సత్యనారాంజనేయ మాట్లాడుతూ కరీంనగర్ కలెక్టర్ ఆదేశాలను అనుసరించి కాలేజీ లో వివిధ రకాల మొక్కలను నాటడము జరిగింది. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని విద్యార్థులు కూడా వారి వారి ఇంటి వద్ద పరిసర ప్రాంతంలో మొక్కలు నాటలని వాటిని సంరక్షణ కూడా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమనీలో ఔూ ప్రోగ్రానీ అధికారి ఖ.రాజశేఖర్ గారు మరియు అధ్యాపకులు మహేంద్రరావు రాజు రవి రాజశేఖర్ వినయ్ లు సుజాత రాజు కిరణ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమ సమన్వయ బడ్జెట్

**రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్**



**గోదావరిఖని,జనంసాక్షి:** కేంద్రం వివక్షత.. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాల మధ్య తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చేలా ఈ బడ్జెట్‌ను రూపొందించిన డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖామాత్యులు మల్లు భట్టివిక్రమార్క,వారి బృందానికి, ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్,రాష్ట్ర ఐటి, పరిశ్రమలు అండ్ శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్‌బాబుకు సహచర శాసనసభ్యులతో కలిసి రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## ఎస్సారెస్పీ కెనాల్‌లో పూడికతీత



**మంథని(జనంసాక్షి) :**మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు రామగిరి మండలం బేగంపేట డి- 83 ఎస్సారెస్పీ కెనాల్ నుండి పేరుకపోయిన మట్టిని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో తొలగించడం జరిగింది. ఎస్సారెస్పీ కెనాల్ లో పూడిక పేరుకుపోయి సాగునీరు వెళ్లే పరిస్థితి లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే స్పందించిన ఆయన ఆర్జీ3. జిఎంను ఆదేశించగా జిఎం యంత్రాల సహాయంలో కెనాల్ లోని పూడిక మట్టి తీసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి శ్రీధర్ బాబుకు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్ కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.


## ఘనంగా తీజ్ ఉత్సవం

**రాయికల్ (జనంసాక్షి)**లోక్య నాయక్ తండా లో బంజారా సాంప్రదాయమైన తీజ్ పండగను ఘనంగా నిర్వహించారు. తండా నాయక్ భూక్య అర్జున్ నాయక్ కార్భారీ లావుడియా కెవుడియ నాయక్ డావ్ అజ్మీర మంగ్యా నాయక్ దండ మాజీ సర్పంచ్ భూక్య బంగారి నునావత్ రాజు నాయక్ మాలవత్ రాజు నాయక్ భూక్య మురళి నాయక్ నునావత్ బలరాం నాయక్ కెతావత్ దేవుల నాయక్ రవి నాయక్ రతిలాల్ నాయక్ రాజేందర్ నాయక్ చందు నాయక్ తిరుపతి నాయక్ గంగాధర్ నాయక్ రమేష్ నాయక్ పాల్గొన్నారు



# నేతన్నా.. నీకు దిక్కెవరన్నా!

- కేంద్రం చూడకపోయే.. రాష్ట్రం పట్టించుకోకపాయే..
- బడ్జెట్లలో అరకోరా నిధులు..ఆందోళనలో నేతన్నలు.



**రాజన్న సిరిసిల్ల బ్యూరో(జనంసాక్షి).** దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధికంగా చేనేత, మరమగ్గాలపైని ఆధారపడి ఉన్నారు. ఈ రంగాలు ఇప్పటికి రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంక్షోభంలో కూరుకుపోయిన పరిస్థితి ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్లలాంటి వస్త్ర పరిశ్రమ కేంద్రాలు సర్కారు అందించే సహాయం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఉన్నది. ఇటీవల కేంద్రంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రంలోని నేతన్నల పట్ల పట్టింపు లేకుండా పోయిందని విమర్శలు ఉన్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్లో దేశంలోని 28 రాష్ట్రాలు ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాలకు కలుపుకొని కేవలం 4,392 కోట్లు చేనేత, జౌళి, హస్తకళలకు కేటాయింపులు చేసింది.. చేనేతకు కేవలం 200 కోట్ల నుంచి 190 కోట్లకు తగ్గించింది. 4.5 శాతం మాత్రమే.జౌళి రంగం నుంచి ఏ మేరకు పరిశ్రమకు నిధులు వస్తాయన్నది గత అనుభవాలను చూసినప్పుడు ప్రశ్నార్థకమేనని సిరిసిల్ల వస్త్ర పారిశ్రామికుడొకరు తెలిపారు. మొదటి నుండి నేతన్నల పట్ల కొంత సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా ఆదుకుంటుందని ఆశగా ఎదురుచూసిన నేతన్నలకు తీరని నిరాశే ఎదురైంది. ఓదార్పు మాటలు తప్ప పెద్దగా చేసింది ఏమీ లేదని బడ్జెట్ పద్దులు చూస్తుంటే అర్థమవుతుందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. మొత్తంగా పరిశ్రమల శాఖకు 2,763 కోట్ల కేటాయింపులను రాష్ట్ర ప్రభుత్వం చేసింది. పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న చేనేత జౌళి శాఖ కు వచ్చేసరికి ఏమోస్తాయి అన్నది అర్థం కాకుండా పోయిందని పలువురు నేత కార్మిక సంఘాల నాయకులు పెదవి విరుస్తున్నారు. అటు కేంద్రాల్లోనూ ఇటు రాష్ట్రంలోనూ బడ్జెట్లో కేటాయింపులు సక్రమంగా లేవన్న అభిప్రాయం సిరిసిల్ల నేతన్నల్లో కనిపిస్తుంది. సంక్షోభాలతో ఎదురిద్దుతూన్న సిరిసిల్ల నేతన్నలకు చేయుత ఏ మేరకు దొరుకుతుందో ప్రశ్నార్థకమే. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ల అంకెల గారడిలో నిలబడ్డ నేత కార్మికులు ఉపాధి కోసం అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం దొరుకుతుందా..

## మెరుగైన విద్యకు పటిష్ట చర్యలు

**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**



**పెద్దపల్లి(జనంసాక్షి):**జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పాఠశాల విద్య పై పెద్దపల్లి, సుల్తానాబాద్,ఓదెల మండలాల కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ లతో సమీక్షించారు. ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమం అమలు, కాంప్లెక్స్ పరిధిలో పాఠశాలల మానిటరింగ్, విద్యా బోధన విధానాలు, ప్రస్తుత విద్యా సంవత్సరం రూపొందించుకున్న లక్ష్యాలు మొదలగు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల తనిఖీ నిర్వహించిన కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ లు పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాల వివరాలను కలెక్టర్ కు వివరించారు.పిల్లలకు మంచి అలవాట్లు, వ్యక్తిత్వం పెంపొందించే విధంగా నీతి కథలు, మోరల్ స్టడీస్ బోధించాలని, విద్యార్థుల ప్రమాణాలు పెరిగేలా చూడాలని అన్నారు. వచ్చే నెల రోజుల వ్యవధిలో ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులందరూ ఆంగ్లం, తెలుగు అక్షరాల గుర్తింపు, చదువడం, రాయడం వంటి కనీస విద్యా ప్రమాణాలు పూర్తి స్థాయిలో సాధించడమే లక్ష్యంగా మనమంతా పని చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా అకడమిక్ అధికారి పీఎం షేక్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**మహిళా శక్తి కార్యక్రమం గ్రౌండింగ్‌కు చర్యలు..**

మహిళా శక్తి కార్యక్రమం క్రింద రూపొందించిన 12 రకాల మాడ్యుల్స్ యూనిట్ల గ్రౌండింగ్ కు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. కలెక్టరేట్ లో మహిళా శక్తి కార్యక్రమం అమలుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా శక్తి కార్యక్రమం క్రింద పాడి పశువుల, కోళ్ళ ఫారం, ఆహార శుద్ధి కేంద్రాలు, మైక్రో ఎంటర్ప్రైజెస్ మొదలైన 12 రకాల మాడ్యుల్స్ లో రూపొందించిన వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్ కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఒకేసారి మహిళా శక్తి కార్యక్రమం అమలు చేయడం కంటే ముందుగా ఒక పైలట్ మండలాన్ని ఎంపిక చేసుకొని, అందులో నిర్దేశిత వ్యాపార యూనిట్ల ఏర్పాటు చేయాలని, ఇందులో నుంచి వచ్చిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మిగిలిన మండలాల్లో మహిళా శక్తి కార్యక్రమాన్ని మరింత మెరుగ్గా అమలు చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళా శక్తి కార్యక్రమం క్రింద వివిధ వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడిని సంబంధిత మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా రుణాలు అందజేయాలని కలెక్టర్ లీడ్ బ్యాంకు మేనేజర్ ను ఆదేశించారు.జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రవీందర్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, అదనపు డిఆర్డిఓ, ఏపిఎంలు, మెప్మా సిబ్బంది, సంబంధిత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌జీ-1లో వనమహోత్సవం



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి రామగుండం ఏరియా-1 మేడిపల్లి ఓపెన్‌కాస్ట్ డంప్ యార్డులో ఘనంగా వృక్షారోపన్ అభియాన్..వనమహోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్, రామగుండం కార్పోరేషన్ కమిషనర్ శ్రీకాంత్ , ఆర్‌జీ-1 ఏరియా జీఎం చింతల శ్రీనివాస్, ఆర్‌జీ-1 సింగరేణి సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి-శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరై మొక్కలు నాటారు.ఈ సందర్భంగా రామగుండం మేయర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆదేశానుసారం వృక్షారోపన్ అభియా న్..వన మహోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టామ న్నారు.నాటిన ప్రతి మొక్కను పరిరక్షించాలని తెలిపారు. మొక్కలు నాటడం వలన పర్యా వరణ సమతుల్యత పెంచినవారమవుతామని తెలిపారు.సింగరేణి యాజమాన్యం పెద్దఎత్తున మొక్కలు నాటి వాటిని పర్యవేక్షిస్తున్నారని అభినందిచారు.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. కోల్ బెల్ట్ ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచి పర్యవరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు.ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాసు మాట్లాడుతూ వృక్షారోపన్ అభియాన్..వనమహోత్సవం చాల గొప్ప కార్యక్రమమన్నారు.గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం అధిక ఉష్ణోగ్రతలను తగ్గించటానికి ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉన్న మొక్కలు నాటాలని..నాటిన ప్రతి మొక్కను పరిరక్షించాలని తెలిపారు.మొక్కలను నాటడం వలన ఈ పచ్చదనం వలన 33శాతం పర్యావరణ సమతుల్యత పెంచినవారమవుతామని తెలిపారు.విరివిగా మొక్కలు నాటడం వలన పర్యావరణంతో పాటు భూమండలం కుడా రక్షించిన వాళ్లమవుతామని తెలిపారు.సీఎంఓఐ నాయకులు పోనోగోటి శ్రీనివాస్, ఎస్ఓటు జీఎం రాంమోహన్, ఏజీఎం (పర్సనల్) సి.హెచ్.లక్ష్మినారాయణ, ఏరియా సేఫ్ అధికారి భైద్య, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, ఏజెంట్ చిలక శ్రీనివాస్, మల్లిఖార్జున్‌యాదవ్, అభిలాష్, డీజీఎం (వర్క్‌షాప్) జితేందర్‌సింగ్, డివైఎస్‌సి వరప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## క్రికెట్ కిట్లు పంపిణీ



**ముస్తాబాద్ జులై 25 (జనంసాక్షి):** ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామంలో యువజన విభాగం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, సంబరాలు నిర్వహించారు సిరిసిల్ల ఎమ్మెల్యే రామన్న ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థించడం ప్రత్యేక పూజలు జరిగింది. ఇట్టి కార్యక్రమానికి కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మేంగన్ మనోహర్ మున్సిపల్ మండల యూత్ అధ్యక్షుడు శీలం స్వామి చిప్పలపల్లి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాచ్చేటి లక్ష్మణ్ తాడేపు ఎల్లం కోమటి రాజమల్లు వీరబోయినా అమర్ యుత్ అధ్యక్షులు గాడిచెర్ల భారత్ పోతారం సతీష్ చందన అంజయ్య బొమ్మనవేణి బాబు స్వామి సిలివేరి శ్రీకాంత్ శ్రవణ్ బాలకొమురయ్య శ్రీకాంత్ పోచయ్య రమేష్ చందు పాల్గొనడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మా చిట్టి లక్ష్మణ్ గ్రామంలోని పిల్లలకు క్రికెట్ కిట్లు అందించడం జరిగింది

## విద్యారంగానికి నిధులు కేటాయించాలి

**టీఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్ గౌడ్**



**సిరిసిల్లటౌన్(జనంసాక్షి)** గత పది సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేస్తూ వచ్చిందని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పాకాల శంకర్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక 2014 బడ్జెట్లో 10.8% విద్యా రంగానికి నిధులు కేటాయించగా అది క్రమేణా తగ్గుతూ వస్తూ ఈసారి 7.31% నిధులు మాత్రమే కేటాయించారని, దేశంలో ఢిల్లీ అస్సాం ,హిమాచల్ ప్రదేశ్ బీహార్ రాజస్థాన్ ,చత్తీస్ గడ్ ,మనకన్నా అత్యధిక నిధులు విద్యారంగానికి కేటాయిస్తున్నా యని భారత దేశంలో మొదటి 20రాష్ట్రాల్లో అతి తక్కువ విద్యారంగ బడ్జెట్ కేటాయిం పులు తెలంగాణలో మాత్రమే జరిగా యన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులు ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి ఏమాత్రం సరిపోవనిఅన్నారు. విద్యారంగ అభివృద్ధికి 20% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## కేంద్రం వంచించినా .. రాష్ట్రం కరుణించింది

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**



**కరీంనగర్ బ్యూరో, జులై 25 (జనంసాక్షి):** కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం జరుగగా, రాష్ట్ర బడ్జెట్ వల్ల తెలంగాణ ప్రజలకు న్యాయం చేకూరిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసన సభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై ఆయన వ్యాఖ్యానిస్తూ కేంద్ర బడ్జెట్ నిరాశపర్చగా, రాష్ట్ర బడ్జెట్ సంతోషం కలిగించదన్నారు. అన్నివర్గాల ప్రజలను సంతృప్తి కలిగించేలా ఉందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయం, విద్య, మహిళా, మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేయడం రేవంత్ రెడ్డి సర్కార్ చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ బడ్జెట్ పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ఉందని ఆయన కొనియాడారు. హార్టికల్చర్ కోసం ఈ బడ్జెట్‌లో రూ.737 కోట్లు కేటాయింపు, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడమే కాకుండా నాణ్యమైన విత్తనాలను అందించేందుకు అవసరమైన చర్యలకు పూనుకోవడం ద్వారా ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చనున్నదని ఎమ్మెల్యే సత్యనారాయణ పేర్కొన్నారు. గూడు లేని నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేలా ఈ బడ్జెట్ రూపకల్పన చేశారని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున మొత్తం రాష్ట్రంలో 4లక్షల 50 వేల గృహాల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడం నిరుపేదలకు వరమని ఆయన పేర్కొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

**సీనియర్ జడ్జ్ రాధిక జస్వాల్**



**తంగళ్ళపల్లి(జనంసాక్షి):**విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ జడ్జి రాధిక జస్వాల్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల స్పెషల్ సంయుక్త అవగాహన కార్యక్రమంలో భాగంగా బద్దెనపల్లి గురుకుల రెసిడెన్షియల్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జడ్జి రాధిక జస్వాల్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, భవిష్యత్తు ప్రణాళిక సూచనలు, హెల్ప్ లైన్ నెంబర్లు తెలపడం జరిగింది, కౌమార దశలో వస్తున్నటువంటి మార్పులని అర్థం చేసుకుంటూ వాటికనుగుణంగా వాళ్ళ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలికల మీద అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు వంటివి జరిగినప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి తెలుపాలని, 1098 టోల్ ఫ్రీ నెంబర్స్ ని సంప్రదిస్తే సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడంతోపాటు తగిన సహాయాన్ని వెంటనే అందించడం జరుగుతుందని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజ్యం, మహిళ సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా, కళాశాల ప్రిన్సిపల్ పద్మ గారు, ఆబూం, డిహబ్, సఖి ,బాల రక్ష భవన్ సిబ్బంది. ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్మిత సబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

**దివ్యాంగుల నెట్‌వర్క్ జిల్లా కన్వీనర్ ఇనుముల సతీష్**



**మంథని(జనంసాక్షి):**దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని దివ్యాంగుల నెట్ వర్క్? జిల్లా కన్వీనర్ ఇనుముల సతీష్ డిమాండ్ చేశారు. మంథనిలోని ప్రెస్క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లక్షలాది మంది దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాల్సిన ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ వారు మనోధైర్యాన్ని కోల్పోయే విధంగా సోషల్ మీడియా వేదిక అయిన ట్విట్టర్ ద్వారా మాట్లాడటం బాధకరమన్నారు. ఐపీఎస్, ఐఎఫ్ఎస్లో దివ్యాంగులకు సైతం రిజర్వేషన్ కల్పించాలని సూచించాల్సింది పోయి ఐఏఎస్లో దివ్యాంగులకు రిజర్వేషన్ ఎందుకని మాట్లాడటం మమ్మల్ని ఎంతగానో బాధించిందన్నారు. గత ప్రభుత్వంలో కీలక పదవీ కొనసాగిన ఐఏఎస్ స్మిత సబర్వాల్ గర్వంతో ఇలా మాట్లాడటం సరికాదన్నారు. మా దివ్యాంగులకు ఉన్న హక్కులను కాల రాసే విధంగా స్మిత సబర్వాల్ మాటాడిన మాటలను తాము తీవ్రంగా ఖండిస్తున్నా మని, ఆమె తన మాటలను భేషరతుగా వెనక్కి తీసుకోవడంతో పాటు బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన స్మిత సబర్వాల్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు దోర్లగొర్ల శ్రీనివాస్, కొమురోజు సురేష్, వడ్లూరి ఈశ్వరచారిలు పాల్గొన్నారు.

## సేవలకు సన్మానం

**ఉద్యోగ విరమణ పొందనున్న అధికారికి వీడ్కోలు**



**రామగిరి,జనంసాక్షి:** సింగరేణి ఆర్‌జీ-3 ఏరియా ఎఎల్‌పి గని కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న కార్పోరేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్ కె.గురువయ్యకు ఎ.పి.ఎ. ఏరియా జి.ఎం. కె.వేంకటేశ్వర్లుతో పాటు ఇతర అధికారులు గురువారం ఘనంగా సన్మానించారు.వారు మాట్లాడుతూ కె.గురవయ్య సింగరేణి సంస్థలో సుమారు 42 సంవత్సరాల పాటు వివిధ హోదాలలో, వివిధ గని, విభాగాలలో విధేయతతో, అంకిత భావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శ మన్నారు.గురువయ్య ఇదివరకు ఎన్నడూ లేని విధంగా భద్రతా విభాగంలో ఎన్నో సంస్కరణలు చేపట్టి ఉన్నతాధికారుల మన్ననలు పొందా రన్నారు.అదేవిధంగా ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడ పాలని ఆకాంక్షించారు. రామగుండం రీజియన్ సేఫ్టీ జి.ఎం.కె.హెచ్.ఎన్.గుప్తా, ప్రాజెక్ట్ అధికారి కె.నాగేశ్వరరావు, ఎస్వోటు జీఎం బి.సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఇంజినీర్ రఘురాం, మేనేజర్లు జనార్ధన్, తిరుపతి అధికారులు పాల్గొన్నారు.

## చెక్‌డ్యామ్‌కు వెంటనే మరమ్మతులు చేయాలి

**నీటిని వృధాను అరికట్టాలి : కాంగ్రెస్ యూత్ నాయకుడు మద్దుల ప్రశాంత్ పటేల్**



**వీణవంక (జనంసాక్షి)**రైతుల సంక్షేమం కోసం సాగు నీటిని వృధా చేయవద్దని గత బిఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రైతుల కోసం వీణవంక మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామంలో 2018 సంవత్సరంలో రైతులకు దృష్టిలో ఉంచుకొని సుమారు రెండు కోట్ల పైచిలుకు నిధులతో వీణవంక వాగుపై లక్ష్మక్కపల్లి గ్రామం వద్ద వ్యవసాయ రైతుల కోసం నీళ్లు తో పంటలు పండించుకోవడానికి రైతుల కొరకు వ్యవసాయానికి నీళ్లు అందే విధంగా దృష్టిలో ఉంచుకొని రైతులకు చెక్ డ్యామ్ ను నిర్మించారు.చెక్ డ్యామ్ కట్టకు గండిపడి గత రెండు సంవత్సరాల నుండి నీరు వృధాగా పోతున్నాయి. గండి పడి నీరు వృధాగా పోవడంతో పాటు ఇదే గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ భూమి చెక్ డ్యామ్ గండిపడ్డ వరదకు సుమారు 5 ఎకరాల సాగు భూమి కొట్టుకుపోయింది.దశాబ్దాలు కాలంగా ఉండవలసిన ఈ చెక్ డ్యామ్ నిర్మాణంలో నాణ్యత లోపించి గండి పడడం జరిగింది.చెక్ డ్యాం కట్టిన అప్పటి కాంట్రాక్టర్.సంబంధించిన అధికారులు కుమ్మక్కై నాణ్యత లేని చెక్ డ్యాం నిర్మాణం చేపట్టారు. వారి నిర్లక్ష్యం వల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.ఉన్నతాధికారులు దృష్టి సారించి చెక్ డ్యాం మరమ్మతులకు చర్యలు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు

## స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టిసారించాలి



**ముస్తాబాద్(జనంసాక్షి):**మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేక పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోనికి తీసుకువెళ్లాలని, బిజెపి పార్లమెంటు కో కన్వీనర్ ఆడేపు రవీందర్ అన్నారు, మండల బిజెపి కార్యవర్గ సమావేశం బిజెపి మండల అధ్యక్షులు మెరుగు అంజ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఆడే పురవీందర్ మాట్లాడుతూ , రానున్న స్థానిక సంస్థ ఎన్నికలపై దృష్టి పెట్టి ప్రజలకు దగ్గరే విధంగా కృషి చేయాలి ప్రజల సమస్యలపై ప్రతి కార్యకర్త పాటుపడాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గారెంటీలు అమలు చేస్తామని ఉచిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు 2500 ఆసరి పింఛన్ రైతులకు రైతుబంధు అనేక హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫ్లమైందని అన్నారు, బిజెపి నాయకులను బిజెపి మండల అధ్యక్షులు మేరు అంజా గౌడ్ బిజెపి నాయకులను సన్మానించారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్మిక సభ్యులు మెరుగు హనుమంత గౌడ్ ,కో కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి ,జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్ రెడ్డి, ఏళ్ల శ్రీధర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బాధ నరేష్, సౌల క్రాంతి, కుడుకల జనార్ధన్, బిజెపి మహిళా అధ్యక్షురాలు బుచేల్లి మహేశ్వరి, మాజీ ఎంపిటిసి పద్మ, చిగురు వెంకన్న, రమేష్ రెడ్డి, పప్పుల శ్రీకాంత్, చిట్లేని శ్రీనివాసరావు, కోళ్ల కృష్ణ, కార్తీక్ రెడ్డి, ఏదునూరి గోపి, వివిధ గ్రామాల బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

## ఖనిజాలు, గనులపై రాష్ట్రాలు రాయల్టీ విధించొచ్చు

చెప్పింది. ఖనిజాలపై పార్లమెం టుకున్న పన్ను విధించే అధికారం అనేది రాష్ట్రాల నియంత్రణాధికారాన్ని తుడిచిపెట్టేస్తోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది.గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టం-1957 (ఎంఎండీఆర్) ప్రకారం.. ఖనిజాలపై రాయల్టీని పన్నుగా పేర్కొనవచ్చని, దీనిపై పార్లమెంటుకు గంపగుత్త అధికారముందని మైనింగ్ కంపెనీల తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదించారు. దీనిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 1989లో ఇండియా సిమెంట్స్ లిమిటెడ్ వర్సెస్ తమిళనాడు ప్రభుత్వం కేసులో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. రాయల్టీని పన్నుగా గుర్తించవచ్చని తీర్పు చెప్పింది. అయితే 2004లో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం వర్సెస్ కేశోరాం ఇండస్ట్రీస్ లిమిటెడ్ కేసులో తీర్పు చెబుతూ.. 1989 నాటి తీర్పులో అచ్చుతప్పులు దొర్లాయని, రాయల్టీ.. పన్ను కాబోదని స్పష్టంచేసింది. దీంతో రెండు విభిన్నమైన తీర్పులు రాగా.. అప్పట్లో ఈ వివాదాన్ని తొమ్మిది మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి కోర్టు అప్పగించింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఫిబ్రవరిలో దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. మార్చిలో తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా కీలక తీర్పు వెలువరించింది.

### రాష్ట్రపతి భవన్‌లో పలు వేదికల పేర్లు మార్పు

అవార్డుల కార్యక్రమం వంటి ప్రధాన వేడుకలను ఈ దర్బార్ హాల్‌లో నిర్వహిస్తుంటాం. ఆంగ్లేయులు, భారత పాలకులు సమావేశాలు నిర్వహించిన ప్రాంతాన్ని దర్బార్ అనేవారు. భారత్ గణతంత్ర రాజ్యంగా మారిన తర్వాత ఆ పదం ప్రాముఖ్యతను కోల్పోయింది. గణతంత్ర భావన భారత సమాజంలో లోతుగా పాతుకుపోయింది. అందుకే ఈ హాల్‌కు గణతంత్ర మండపం సరైంది" అని పేర్కొంది. "అశోక్ హాల్ ఒక బాల్‌రూమ్. అశోక్ అంటే అన్ని బాధల నుంచి విముక్తుడైన వ్యక్తి అని అర్థం" అని వెల్లడించింది. అలాగే భారత చరిత్రలో అశోక చక్రవర్తి, సమాజంలో అశోక చెట్టుకున్న ప్రాముఖ్యత దృష్ట్యా దానికి అశోక్ మండపం అని మార్చినట్లు వివరించింది.ఈ పేర్ల మార్పుపై విపక్షాలు విమర్శలు చేశాయి. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ.. "దర్బార్ అనే కాన్సెప్ట్ లేదు అని అన్నారు.



# పారిస్ ఒలింపిక్స్‌లో అద్భుతం

- జ్యోతి పట్టుకుని వీధుల్లో నడిచిన పారాలింపిక్స్ కెవిన్ పియెట్

మరికొన్ని గంటల్లో పారిస్‌లో ఒలింపిక్స్ సంబరాలు మొదలు కానున్నాయి. వేసవి ఒలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకకు ముందు చాలా మంది ప్రసిద్ధ ఆటగాళ్లు ప్యారిస్ వీధుల్లో టార్చ్‌లతో పరుగెత్తడం కనిపించింది. ఆ ఆటగాళ్ళలో ఫ్రెంచ్ టెన్నిస్ స్టార్ కెవిన్ పియెట్ ఒకడు. అతను నడవలేడు. 10 ఏళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం తర్వాత ఈ ఫ్రెంచ్ టెన్నిస్ స్టార్ నడవగలిగే శక్తిని కోల్పోయాడు. అయినప్పటికీ.. కాళ్లు పోయినంత మాత్రాన.. నడవ లేనంత మాత్రాన జీవితం అంతటితో ఆగిపోదు అంటూ పది మందికి ఉదాహరణగా నిలిచాడు ఫ్రెంచ్ టెన్నిస్ స్టార్. చేతిలో టార్చ్ పట్టుకుని పారిస్ వీధుల్లో పరుగులు తీస్తూ కనిపించాడు. నడవని వ్యక్తి పరుగులు తీయడం అనే అద్భుతం ఎలా జరిగింది అనేది ప్రశ్న. ప్రపంచం అభివృద్ధి చెందుతున్న కొద్దీ.. సాంకేతికంగా విభిన్న రీతిలో సామర్థ్యం పొందుతోంది. కెవిన్ పియెట్ కూడా ఒక టెక్నిక్ సహాయంతో పారిస్ ఒలింపిక్స్ టార్చ్ మార్చ్‌లో పాల్గొన్నాడు. ఒలింపిక్ టార్చ్‌తో పరుగెత్తడానికి.. అతను రోబోటిక్ ఎక్సోస్కెలిటన్‌ను ఉపయోగించాడు. కెవిన్ ఇంతకుముందు నుంచి కూడా ఈ పద్ధతిని ఉపయోగిస్తున్నాడు. కెవిన్ పియెట్ కూడా రోబోటిక్ ఎక్సోస్కెలిటన్ ద్వారా పారిస్ ఒలింపిక్స్ టార్చ్ రిలేలో పరుగెత్తడం ద్వారా చరిత్ర సృష్టించాడు. వాస్తవానికి, అతను ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరిగెత్తిన మొదటి అథ్లెట్ అయ్యాడు. కెవిన్ పియెట్ తన ఎక్సోస్కెలిటన్‌తో ఒలింపిక్ జ్యోతిని మోసుకెళ్లి చరిత్ర సృష్టించాడు/. ఫ్రెంచ్ పారాలింపిక్స్ టెన్నిస్ స్టార్ కెవిన్ పీట్ పారిస్‌లో చేసిన ఫీట్.. అతని ధైర్యం.. ఇతర దివ్యాంగులతో పాటు ఇతర పారా క్రీడాకారులకు ఒక ప్రేరణగా నిలుస్తుంది. ఇప్పుడు, మరికొందరు దివ్యాంగ ఆటగాళ్లు తదుపరి ఒలింపిక్స్‌లో టార్చ్ మార్చ్‌లో భాగం అయ్యే చాన్స్ ఉంది అందడంలో ఎటువంటి సందేహం లేదు.. ఆశ్చర్య పడాల్సిన అవసరం అసలే ఉండదు. రోబోటిక్ ఎక్సోస్కెలిటన్ వికలాంగులు లేదా వృద్ధులు నడవడానికి సహాయపడుతుంది. ఇది వైకల్యాన్ని పూర్తిగా తొలగించదు కానీ అది వారిని స్వావలంబనగా మారేలా చేస్తుంది. కెవిన్ పియెట్ కూడా రోబోటిక్ ఎక్సోస్కెలిటన్ సహాయంతో టార్చ్ రిలేలో ఇలాంటి స్వీయ-విశ్వాసాన్ని చూపించాడు.

# ఆర్చరీలో ప్రపంచ రికార్డు బద్దలు



ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్ పోటీల ఆరంభం రోజే ప్రపంచ రికార్డు బద్ధలైంది. ఆర్చరీ ర్యాంకింగ్స్ రౌండ్‌లో దక్షిణ కొరియా యువకెరటం లిమ్ సిహైయన్ చరిత్ర సృష్టించింది. మహిళల వ్యక్తిగత ఆర్చరీ విభాగంలో ఐదేండ్ల రికార్డు బ్రేక్ చేసింది. గురువారం జరిగిన పోటీల్లో 21 ఏండ్ల లిమ్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ 694 పాయింట్లు సాధించింది. దాంతో, 2019లో దక్షిణ కొరియాకే చెందిన కాంగ్ చీయంగ్ నెలకొల్పిన రికార్డును ఈ టీనేజర్ బద్ధలు కొట్టేసింది. ఆ ఏడాది జూలై నెలలో చీయంగ్ 692 పాయింట్లతో పుస్తకాల్లోకి ఎక్కింది. వరల్డ్ నంబర్ 2 అయిన లిమ్ సిహైయన్ ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉంది. హుండాయ్ ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 2లో రెండు బంగారు పతకాలు సాధించి ప్రకంపనలు సృష్టించింది.

**లిమ్ సిహైయన్**

ఆ తర్వాత షాంఘైలో 60 పాయింట్లతో స్వర్ణ పతకం ఎగరేసుకుపోయింది. నిరుడు ఆసియా క్రీడల్లోనూ లమ్ తన గురికి తిరుగులేదని చాటుతూ పసిడి వెలుగులు విరజిమ్మింది. తాజాగా ఒలింపిక్స్ ర్యాంకింగ్స్ రౌండ్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. వ్యక్తిగత విభాగంలో ఈ యంగ్‌స్టర్ గోల్డ్ మెడల్‌కు గట్టి పోటీదారుగా మారింది.



# మహిళల ఆర్చరీలో క్వార్టర్స్‌కు భారత్

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో.. ఇండియా పాజిటివ్‌గా స్టార్ట్ చేసింది. మహిళల ఆర్చరీ టీమ్ ఈవెంట్‌లో.. భారత జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. దీంతో ఆ బృందం క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. అంకితా భాకత్, భజన్ కౌర్, దీపికా కుమారి.. టాప్ 32లో నిలిచారు. అంకిత 11వ స్థానంలో నిలిచింది. ఆమె 666 స్కోర్ చేసింది. భజన్ 22వ స్థానంలో నిలిచింది. ఆమె 659 స్కోర్ చేసింది. దీపికా కుమారి 658 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచింది. మొత్తం 1953 పాయింట్లతో ఇండియా మహిళ ఆర్చరీ జట్టు నాలుగవ స్థానంలో నిలిచింది.

# టాప్ సీడ్స్‌కు తేలికైన 'డ్రా'

పారిస్ వేదికగా ఒలింపిక్స్ పోటీలు సందడిగా సాగుతున్నాయి. ఫుట్‌బాల్, రగ్బీ మ్యాచ్‌లతో ఆరంభమైన విశ్వ క్రీడలు అభిమానులను అలరిస్తున్నాయి. ఆర్చరీ కూడా షురూ కావడంతో టెన్నిస్ సమరం ఎప్పుడెప్పుడా? అని ఫ్యాన్స్‌లో ఆసక్తి మొదలైంది. ఈ నేపథ్యంలో గురువారం ఒలింపిక్స్ నిర్వాహకులు టెన్నిస్ డ్రా విడుదల చేశారు. టాప్ సీడ్స్, టెన్నిస్ దిగ్గజాలకు సులువైన డ్రా లభించింది. భారత టెన్నిస్ ఆశాకిరణం సుమిత్ నాగల్ తొలి మ్యాచ్‌లో కొరెంటిన్ మౌటెట్(ఫ్రాన్స్)తో తలపడనున్నాడు. పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న, శ్రీరామ్ బాలాజీలు పారిస్ జంట రెబౌల్ రోజర్ వస్సెలిన్‌లతో తాడోపేడో తేల్చుకోనున్నారు.

పురుషుల సింగిల్స్‌లో వింబుల్డన్ విజేత కార్లోస్ అల్కరాజ్‌కు తేలికైన డ్రా లభించింది. దాంతో, ఈ స్పెయిన్ కెరటం నాకౌట్ దశకు చేరడం నల్లేరు మీద నడకే. 16వ రౌండ్‌లో అల్కరాజ్. డానిల్ మెద్వెదేవ్, రూడ్‌లతో తలపడే చాన్స్ ఉంది. ఇక మాజీ నంబర్ 1 నొవాక్ జకోవిచ్, రఫెల్ నాదల్‌లు రెండో రౌండ్‌లో ఎదురుపడే అవకాశముంది. తొలి రౌండ్‌లో హంగేరికి చెందిన మార్టన్ ఫక్సోవిక్‌తో నాదల్ తలపడనున్నాడు. మాథ్యూ ఎబ్డెన్‌ను ఢీ కొట్టనున్న జకో తర్వాతి పోరులో స్పెయిన్ బుల్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. మహిళల విభాగంలో ఇగా స్వియాటెక్, ఎలెనా రిబాకినాలకు సులువైన డ్రా లభించగా.. అమెరికా సంచలనం కొకొ గాఫ్ మాత్రం కఠిన ప్రత్యర్థుల గ్రూప్‌లో ఉంది. ఇరినా కామెలియా(ఇరాన్)తో స్వియాటెక్ తొలి మ్యాచ్ ఆడనుంది. వరల్డ్ నంబర్ 2 గాఫ్ తొలి రౌండ్‌లో అజ్లా తొమ్లజనోవిక్ (ఆస్ట్రేలియా)ను ఢీ కొట్టనుంది.





**55 ఏండ్ల వయసులో ఒలింపిక్స్‌కు..**

**చరిత్ర సృష్టించనున్న జార్జియా షూటర్**

నాలుగేండ్లకోసారి జరిగే ఒలింపిక్స్‌లో ఒక్కసారైనా పాల్గొనాలని, పతకం నెగ్గే ప్రదర్శన చేయాలనేది క్రీడాకారుల కల. ఆ కల కోసం నాలుగేండ్ల పాటు ఎంతో శ్రమకోర్చి బరిలోకి దిగుతారు. రెండు, మూడు సార్లు ఒలింపిక్స్ ఆడటమే గొప్ప అంటే జార్జియాకు చెందిన ఓ షూటర్ శుక్రవారం నుంచి మొదలుకాబోయే పారిస్ ఒలింపిక్స్‌లో ఏకంగా పదోసారి బరిలోకి దిగుతోంది. 19 ఏండ్ల వయసులో తొలిసారి విశ్వక్రీడల్లో పాల్గొన్న ఆమె.. తాజాగా పారిస్ లోనూ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. 55 ఏండ్ల వయసులోనూ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ఆమె పేరు నినొ సలుక్వడ్జె.. 1969 లో నాటి సోవియట్ యూనియన్‌లో పుట్టి (ప్రస్తుతం జార్జియా) 19 ఏండ్ల వయసులో 1988లో సియోల్ (దక్షిణ కొరియా)లో జరిగిన ఒలింపిక్స్‌లో తొలిసారి పాల్గొన్న నినొ.. తొలి ప్రయత్నంలోనే స్వర్ణం గెలుచుకుంది. 25 మీటర్ల పిస్టోల్ విభాగంలో నినొ పసిడి నెగ్గింది. అదే ఈవెంట్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ ఈవెంట్‌లోనూ పోటీపడ్డ ఆమె.. రజతం గెలిచి తొలి ప్రయత్నంలోనే 'డబుల్ బొనాంజా' కొట్టింది.సోవియట్ యూనియన్ ముక్కలై జార్జియా ప్రత్యేక దేశంగా గుర్తింపు పొందిన తర్వాత నినొ.. ఆ దేశంలో షూటింగ్ క్రీడలో ఐకాన్‌గా ఎదిగింది. ఇప్పటికీ జార్జియాలో ఆమె నెంబర్ వన్ షూటర్ ర్యాంకు దక్కించుకోవడం విశేషం. 55 ఏండ్ల వయసులో ఆమె ఐఎస్ఎస్ఎఫ్ ఒలింపిక్ క్వాలిఫికేషన్ ర్యాంకింగ్స్‌లోనూ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుందంటే ఆటపట్ల ఆమెకున్న డెడికేషన్‌కు ఇదే నిదర్శనం. 1988 నుంచి 2020 టోక్యో ఒలింపిక్స్ దాకా వరుసగా తొమ్మిదిసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న నినొ.. టోక్యోలో కాంస్యం గెలుచుకుంది. 40 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఒలింపిక్ పతకాలతో పాటు వరల్డ్ చాంపియన్‌షిప్, యూరో చాంపియనిషిప్స్‌లో ఆమె పతకాలు కొల్లగొట్టింది. ఇక తాజాగా పారిస్‌లోనూ బరిలోకి దిగనున్న నినొ.. పదోసారి ఒలింపిక్స్‌లో పాల్గొంటుండ టంతో ఆమె విశ్వక్రీడల చరిత్రలో సరికొత్త రికార్డు లిఖించనుంది. ఇప్పటివరకూ ఒలింపిక్స్ లో కెనడాకు చెందిన ఈక్వెస్ట్రియన్ జంపర్ 2012లో ఇయాన్ మిల్లర్ రికార్డును బ్రేక్ చేయనుంది. మిల్లర్ 9 సార్లు ఒలింపిక్స్ బరిలో నిలిచాడు.

# ఇకపై భారత జట్టులో చోటు పక్కా..

కొత్త ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలో, శ్రీలంక సిరీస్ కోసం టీమ్ ఇండియా సిద్ధమవుతోంది. ఈ క్రమంలో టీమ్ ఇండియా శిక్షణా సెషన్ వీడియో ఒకటి బయటకు వచ్చింది. ఇందులో గౌతమ్ గంభీర్ ఆటగాళ్లను నిశితంగా గమనిస్తూ వారికి అవసరమైన సలహాలు ఇస్తున్నాడు. ఇంతలో, ఒక విషయం అందరి దృష్టిని ఆకర్షించింది. గౌతమ్ గంభీర్ ప్రముఖ బ్యాట్స్‌మెన్ సంజూ శాంసన్‌తో చాలా సేపు మాట్లాడాడు. శిక్షణ సమయంలో గౌతమ్ గంభీర్ శాంసన్‌తో మాట్లాడుతున్న తీరు చూస్తుంటే పలు ఊహాగానాలు వస్తున్నాయి. సంజూ శాంసన్ గురించి చెప్పాలంటే, అతను జట్టులో చోటు దక్కించుకున్నా.. బెంచ్‌కే పరిమితం అవుతున్నాడు. అతనికి ఎప్పుడూ జట్టులో సాధారణ స్థానం లభించలేదు. అతను టీ20 ప్రపంచ కప్‌నకు ఎంపికయ్యాడు. కానీ, మొత్తం టోర్నమెంట్‌లో అతనికి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. అందుకే ఈ విషయంపై చాలా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే, ఇప్పుడు గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో సంజూ శాంసన్‌కు రెగ్యులర్ అవకాశాలు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలో టీమ్ ఇండియా ట్రైనింగ్ సెషన్ కోసం రంగంలోకి దిగినప్పుడు, గౌతమ్ గంభీర్ సంజూ శాంసన్‌తో వన్ టు వన్ మాట్లాడాడు. దీన్ని బట్టి ఇప్పుడు టీమ్ ఇండియాలో సంజూ శాంసన్‌కి మంచి రోజులు మొదలయ్యాయని, అతనికి నిరంతరం ఆడే అవకాశం లభించవచ్చని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. గౌతమ్ గంభీర్ ఎల్లప్పుడూ సంజూ శాంసన్‌కు చాలా మద్దతునిచ్చాడు. ఇప్పుడు ప్రధాన కోచ్ అయిన తర్వాత, శాంసన్ మ్యాచ్‌లలో ఆడటం చూడవచ్చు. అయితే, దీని కోసం శాంసన్ మెరుగైన ప్రదర్శనను కొనసాగించాల్సి ఉంటుంది. గౌతమ్ గంభీర్ తన మొదటి విలేకరుల సమావేశంలో ఆటగాళ్లకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరుకుంటున్నట్లు చెప్పాడు. గంభీర్ ప్రకారం, అతను కోచ్, ప్లేయర్ మధ్య సంబంధాన్ని కోరుకోవడం లేదు. బదులుగా ప్రతి ఒక్కరూ ఒకరినొకరు విశ్వసించాలని, ఎల్లప్పుడూ ఆటగాళ్లకు తన పూర్తి మద్దతునిస్తాడని ఆశిస్తున్నాడు.

# నేటి నుంచి భారత్ ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్

- ఈ కాన్ఫరెన్స్ ఈనెల 28వ తేదీ వరకు..
- అపోలో హాస్పిటల్స్ కార్డియాలజీ, క్లినికల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్




**హైదరాబాద్ :** గుండె సమస్యలపై అవగాహన కోసం భారతదేశపు ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్ ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అపోలో హాస్పిటల్స్ కార్డియాలజీ, క్లినికల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ వివరాలు వెల్లడించేందుకు హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపోలో హాస్పిటల్స్, కార్డియోవాస్కులర్ రీసెర్చ్ ఫౌండేషన్, (సీఆర్ఎఫ్) యూఎస్ఏతో కలిసి ఫ్యాక్ట్స్ ఫౌండేషన్ ఈ మూడు రోజులు 'టీసీటీ ఇండియా 2024' భారతదేశపు ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్ ను హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించనుందని చెప్పారు. దేశ, విదేశాల నుంచి కార్డియాలజిస్టులు, కార్డియోథొరాసిక్ సర్జన్లతో కూడిన 1200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. భారతదేశం నుంచి 100 మంది, విదేశాల నుంచి 30 మంది అధ్యాపకులు ఇంటర్వెన్షనల్ కార్డియాలజీలో తాజా పురోగతులు ప్రతినిధులకు తెలియజేయనున్నారని తెలిపారు. ఇది అతిపెద్ద ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టుల సదస్సు అన్నారు. దీనికి దేశ, విదేశాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరవుతున్నారన్నారన్నారు. గుండె సంబంధిత సమస్యలను ఎదుర్కొనేందుకు ఇంతవరకు అవసరమైన కార్డియాక్ సర్జరీకి అనేక ప్రత్యేక పద్ధతులు కలవన్నారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ రోగిని గాయం, అనారోగ్యం, మరణాల నుంచి కాపాడుతుందని తెలిపారు. గతంలో ధమనులు పూర్తిగా బ్లాక్ అయినప్పుడు తప్పనిసరిగా శస్త్రచికిత్స చేసేవారన్నారు. ఇప్పుడు బ్లాక్ అయిన ధమనులను క్లియర్ చేయడానికి ప్రత్యేక పద్ధతులు ఉన్నాయన్నారు. అలాంటి అనేక కొత్త పద్ధతులను ఈ సమావేశంలో ప్రదర్శించనున్నామని చెప్పారు. నిపుణులను ఒకచోట చేర్చే వేదిక ఇదన్నారు. ఈ వేదిక ద్వారా ప్రతినిధులు జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. రోగులు త్వరగా కోలుకోవడానికి, అందరికి అందుబాటులో ఉండే తాజా పద్ధతులపై ప్రతినిధులకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు.

వందేళ్లకు పైగా గుండెపోటు రాకుండా జీవించవచ్చన్నారు. దీనికి ఒక మ్యాజిక్ మందు ఉందన్నారు. దీనిని ప్రతి ఆరు నెలలకు ఒకసారి టీకాగా తీసుకుంటే.. గుండెపోటును నివారించవచ్చన్నారు. ఒత్తిడి, ధూమపానం, ఆహారపు అలవాట్లు, గుండె జబ్బులు పెరగడానికి కారణమని చెప్పారు.

ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీసీ రథ్ మాట్లాడుతూ టీసీటీ అనేది ప్రపంచంలోనే అతి పెద్ద ఇంటర్వెన్షనల్ కౌన్సిల్ సమావేశం అన్నారు. ఇటువంటి సమావేశానికి హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం విశేషమన్నారు. ఈ కాన్ఫరెన్స్ అత్యాధునిక సాంకేతికతలను ప్రదర్శించనుందని చెప్పారు.

# బోగస్ రీఫండ్ క్లెయిమ్స్ చేయరాదు

- ఈనెల 31 లోపు ఐటీఆర్ సమర్పించాలి
- తప్పుడు రిఫండ్ క్లెయిమ్స్ చేస్తే చట్టపరమైన చర్యలు
- ఆదాయపన్ను శాఖ జాయింట్ కమిషనర్ అషీష్ కుమార్ శుక్ల

**హైదరాబాద్ సిటీ, జూలై 25 (జనంసాక్షి):**
పన్ను చెల్లింపు దారులు ఎలాంటి తప్పుడు క్లెయిమ్స్ చేయరాదని, నిబంధనల మేరకు ఐటీఆర్ (ఇన్కమ్ టాక్స్ రిటర్న్స్) ఫైలింగ్ చేయాలని ఆదాయపన్ను శాఖ జాయింట్ కమిషనర్ ఆశిష్ కుమార్ శుక్ల సూచించారు.గురువారం ఆదాయ పన్ను శాఖ అధికారులు జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిహెచ్ఎంసిలోని వివిధ విభాగాల డ్రాయింగ్ అండ్ డిస్బర్ సింగ్ అధికారులు, జోనల్ ,సర్కిల్ అధికారులు, ఎస్టాబ్లిష్మెంట్ క్లర్కులకు ఐటిఆర్ ఫైలింగ్, టాక్స్ చెల్లింపుదారుల బాధ్యతలు, పన్ను ఎగవేత, తప్పుడు రిఫండ్ క్లెయిమ్స్ పై ఐటి నిబంధనల మేరకు గల చర్యలు, ఇన్కమ్ ఫైలింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇన్కమ్ ఫైలింగ్ లో అన్ని రకాల ఆదాయ వివరాలు ఇవ్వాలని, మినహాయింపులు, డిడక్షన్స్ కు సంబంధించిన డాక్యుమెంట్స్ డిడిఓకు సమర్పించాలన్నారు. ఎలాంటి తప్పుడు వివరాలు ఇవ్వకూడదన్నారు. అదేవిధంగా ఐ టి ఆర్ ఫైలింగ్ చేసేటప్పుడు క్రాస్ చెక్ చేసుకోవాలని సూచించారు.కొత్త,పాత రీజిమ్ లో ఆదాయ పన్ను రిటన్ దాఖలు చేసుకోవచ్చని తెలిపారు.ఐటిఆర్ ను ఈ నెల 31 వ తేదీ లోపు సమర్పించాలని, ఐ టి ఆర్ సమర్పణలో డాక్యుమెంటేషన్ ప్రాపర్ గా సమర్పించాలన్నారు.ఉద్యోగులకు సంబంధించి టోటల్ ఇన్కమ్, డిడక్షన్స్ తదితరాలను పూర్తిగా ఆయా డిడిఓలు పరిశీలించాలన్నారు. ప్రాపర్ గా కరెక్ట్ ఐటిఆర్ ఫైలింగ్ చేసి సమర్పించాలని సూచించారు. ఏవేని సందేహాలు ఉన్నట్లయితే బషీర్బాగ్ లో గల తమ కార్యాలయానికి నేరుగా వచ్చి తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.అనంతరం పలువురు అధికారులు, ఉద్యోగులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, గీతా రాధిక, చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర రెడ్డి, అదే పనిని శాఖ అధికారులు వేణుగోపాల్, వందన, జిహెచ్ఎంసి వివిధ విభాగాల అధికారులు, జోనల్, సర్కిల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




# మద్యం సీసాలో బల్లి..!

- ఐదుగురికి అస్వస్థత తప్పిన ప్రాణము ముప్పు

**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 25 (జనం సాక్షి):** వానలు వస్తే చాలు మస్తు మజా చేయడానికి మద్యం వైన్స్ ల దగ్గర బారులు తీస్తారు. మద్యం అసలు దో. నకిలీదో తెలియకుండానే మద్యాన్ని కొనుగోలు చేసి మత్తులోకి దిగిపోతారు. స్నేహితుల తో కలిసి మద్యంతో మజా చేద్దామని వెళ్లిన స్నేహితులకు మద్యం షాక్ ఇచ్చింది. వికారాబాద్ పట్టణం ఎన్నేపల్లి కి చెందిన సందీప్ వికారాబాద్ పట్టణంలోనే అనంతగిరి వైన్ షాప్ లో రాయల్ గ్రీన్ ఫుల్ బాటిల్ మద్యాన్ని కొనుగోలు చేశారు. వారంతా సరదా కోసం అనంతగిరి కి వెళ్లి అందరు కలిసి సగం వరకు మధ్యాన్ని సేవించారు. సగం పూర్తి కాగానే మరో రౌండ్ వేసుకోవడానికి వెళ్లగానే మద్యం బాటిల్ లో చనిపోయిన బల్లి ప్రత్యక్షమైంది. దీంతో వారంతా ఒక్కసారి షాక్ గురి అయ్యారు. మద్యం బాటిల్లో పడి చనిపోయిన బల్లి మద్యం ను సగం బాటిల్ వరకు తాగడంతో షాక్ గురి అయ్యారు .రాత్రి పొద్దు పోయాక ఐదుగురు మిత్రులు తీవ్ర స్వస్థత గురయ్యారు. ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. ప్రస్తుతం ప్రాణాపాయ సతి నుంచి బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు ఈ సంఘటన అందరినీ విస్మయానికి గురిచేసింది.

# పంట పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



**బషీరాబాద్,జులై 25 (జనం సాక్షి) :**
మండల పరిధిలో గురువారం రోజున జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్,విస్తీర్ణ అధికారి రాజ్ కుమార్ మండలంలోని నీళ్ళ పల్లి, ఇస్మాయిల్ పూర్, మర్పపల్లి, గ్రామాలలో పంట పొలాలను పరిశీలిస్తూ.. రైతులతో రైతు బీమా, రుణమాఫీ గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా రైతుబీమాలో మార్పులు, చేర్పులు ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.కొత్త రైతులకు రైతు బీమా ఆగస్టు 5వ తేదీ వరకు చేసుకోవాలని తెలిపారు.అనంతరం కాశీం పూర్ రైతు వేదికను పరిశీలించి మీటింగ్ నిర్వహించి పంటలను నమోదు చేసుకోవాలని,ఎడతెర కురుస్తున్న వర్షాలకు ఏఈవోలు రైతులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సూర్య ప్రకాష్, ఏఈఓ పవన్ పాల్గొన్నారు.

# 26 నుండి 28 వరకు వన్‌ప్లస్ మెటల్‌వర్స్ పాప్-అప్ ఈవెంట్

**హైదరాబాద్, జూలై 25 (జనం సాక్షి) :** ఈనెల 26 నుండి 28 వరకు వన్‌ప్లస్ బౌలేవార్డ్ మెటల్‌వర్స్ పాప్-అప్ ఈవెంట్‌లు నిర్వహిస్తున్నట్లు వన్‌ప్లస్ ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ ఇషితా గ్రోవర్ గురు వారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వన్‌ప్లస్ ఇండియా కమ్యూనిటీకి కొత్తగా ప్రారంభించిన వన్‌ప్లస్ నార్డ్ 4 డివైజ్ లో ప్రత్యేకమైన ఫస్ట్‌లుక్‌ని పొందడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుందని చెప్పారు. వన్‌ప్లస్, గ్లోబల్ టెక్నాలజీ బ్రాండ్, దాని ఇటీవలి సమ్మర్ లాంచ్ ఈవెంట్‌కు అనుగుణంగా అద్భుతమైన పాప్-అప్ ఈవెంట్‌లను హోస్ట్ చేయడానికి సిద్ధం గా ఉందన్నారు. వన్‌ప్లస్ మెటల్‌వర్స్ పేరుతో పాప్-అప్ ఈవెంట్‌లు బెంగళూరు, హైదరాబాద్‌లో జరుగుతాయన్నారు.

# వరద నీటి కాలువలను పూర్తి చేయాలి

- అధికారులు నిర్లక్ష్యం వీడి కళ్ళు తెరవాలి
- మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి
- ఇరిగేషన్ నాలాల ఆక్రమణలను అడ్డుకుందాం



**మహేశ్వరం, జులై25, జనం సాక్షి:**
కాలనీలో ముంపుకు గురికాకుండా వరదనీటి కాలువలను పూర్తిచేయాలని బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బడంగ్పేట్ కార్పొరేషన్ పరిధిలో అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లోతట్టు ప్రాంత కాలనీవాసులు ఆందోళన నిరసన వ్యక్తం చేయడం జరిగింది. బడంగ్ పేట్ కార్పొరేషన్ భాజపా అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో వర్షంలో నిరసన తెలుపుతూ వరద నీటి కాలువలు నిర్మించాలని, కాలువల ముంపును అరికట్టాలని, నాలల ఆక్రమించిన కట్టడాలు కూల్చివేయాలని వరద నీటి కాలువల నిర్లక్ష్యంపై ప్లకార్డులు పట్టుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సందర్భంగా చెరుకుపల్లి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఇరిగేషన్ నాలాల అక్రమణ లను అడ్డుకోవాలి అన్నారు. వరద కాలువల నిర్మాణం కొరకు భారతీయ జనతా పార్టీ కొన్ని సంవత్సరాలుగా పోరాడుతూనే ఉందన్నారు. ఇప్పటికీ వరద కాలువల నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. గతంలో మంత్రి, ప్రస్తుత శాసన సభ్యురాలు సబితా ఇంద్రా రెడ్డి, స్థానిక మేయర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రభుత్వ అధికారులు, వివిధ శాఖల అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా, సంబంధిత అభివృద్ధి శిలాఫలకం వద్ద భారతీయ జనతా పార్టీ ఒకరోజు నిరసన కార్యక్రమాన్ని డిపిఎస్ స్కూల్ ప్రక్కన, పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ వద్ద నిర్వహించడం జరిగింది.

జనంసాక్షి www.janamsakshi.org | శుక్రవారం 26 జూలై 2024

# జగన్ కొత్త టర్న్!

- ఇండియాకూటమిలో చేరిక దిశగా అడుగులు
- అనివార్యంగా కాంగ్రెస్ వెంట నడవక తప్పనిస్థితి
- ఢిల్లీ ధర్నాతో ఇండియా కూటమికి మరింత చేరువ



**అమరావతి, జూలై25 (జనంసాక్షి) :** వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో చేపట్టిన ధర్నా రాజకీయంగా కొత్త టర్న్ తీసుకుంటుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ కూటమికి జగన్ దగ్గరవుతున్నారనడానికి ఢిల్లీ ధర్నా రుజువు చేయబోతున్నారు. ఇప్పుడున్న పరిస్థితిఉల్లో బిజెపి లేదా కాంగ్రెస్ కూటామిల్లో ఏదో ఒకదాంట్లో ఉండని పరిస్థితి ఏర్పడింది. బిజెపి కూటమిలో చంద్రబాబు చేరారు కనుక జగన్ కాంగ్రెస్ కూటమిలో అనివార్యంగా చేరాల్సిందే. రాజకీయంగా మనుగడ సాగించాలంటే ఇది తప్పదు. ధర్నాకు ఇండీ కూటమి నేతలంతా ఏకపక్షంగా మద్దతు పలికారు. షర్మిల ఫీల్ అవుతుందనో మరో కారణమో కానీ కాంగ్రెస్ నుంచి మాత్రం ఎవరూ రాలేదు. కానీ కూటమి నుంచి నేతలంతా వచ్చారంటే.. వ్యూహాత్మకమేనని అనుకోవచ్చు. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ముందు మరో దారి లేదు. ఆయన ఖచ్చితంగా ఇండీ కూటమి దారిలో వెళ్లాలి. బీజేపీకి మద్దతుగా ఇక ఎంత మాత్రం ఉండే అవకాశం లేదు. ఎందుకంటే .. కష్టాల్లో ఇంతగా మద్దతుగా ఉన్న ఇండీ కూటమిని కాదని బీజేపీ దగ్గరకు వస్తే అటు బీజేపీ అనుమానిస్తుంది.. ఇటు కాంగ్రెస్ కూటమి ఆగ్రహిస్తుంది. అందుకే జగన్ అన్నీ ఆలోచించుకునే ఇండీ కూటమి నేతల్ని ధర్నాకు మద్దతుగా ఉండాలని ఆహ్వానించినట్లుగా భావిస్తున్నారు. ఇండియా కూటమిలో చేరాలని జగన్మోహన్ రెడ్డిని సంఘీభావం తెలియచేయడానికి వచ్చిన పార్టీల నేతలంతా ఆహ్వానించారు. దీనిపై జగన్ స్పందన ఏమిటన్నదానిపై స్పష్టత లేదు కానీ ఆయన గతంలోలా బీజేపీకి మద్దతు పలికే అవకాశం లేదు. 2014 నుంచి జగన్ బీజేపీకి మద్దతుగానే ఉన్నారు. 2014లో ఎన్డీఏ కూటమిలో టీడీపీ ఉన్నప్పటికీ ఆయన పరోక్షంగా బీజేపీతో సంబంధాలు కొనసాగించారు. ఈ కారణంగా బీజేపీ, టీడీపీ మధ్య అభిప్రాయభేదాలు వచ్చి .. చంద్రబాబు కూటమి నుంచి బయటకు వచ్చారు. చంద్రబాబు బీజేపీకి పరోక్షంగా పూర్తి స్థాయిలో మద్దతుగా ఉండగలరు కానీ బీజేపీతో పొత్తులు పెట్టుకోలేరు. ఎందుకంటే ఆయన ఓటు బ్యాంక్ పూర్తిగా దళిత, ముస్లింలు, బీజేపీతో పరోక్షంగా స్నేహాన్ని మరో ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల వారు సమర్థించి ఓట్లు వేసి ఉండవచ్చు కానీ నేరుగా పొత్తులు పెట్టుకుంటే మాత్రం ఓటు వేయరు. అందుకే నేరుగా ఎన్డీఏ కూటమిలో చేరేందుకు ఆయన వెనుకాడారు. ఇప్పుడు ఇండీ కూటమికి దగ్గరవుతుతున్నారు. ఇండీ కూటమి ఆయనకు ఓటు బ్యాంక్ పరంగా సేఫ్. కానీ బీజేపీని కాదంటే జరగబోయే పరిణామాల్ని ఎదుర్కోవడం కష్టమని ఇంత కాలం ఆయన ఆ పార్టీ పట్ల భయభక్తులతో ఉన్నారని అనుకోవచ్చు. కానీ ఢిల్లీ ధర్నా తర్వాత ఆయన అనివార్యంగా ఇండియా కూటమితో నడవక తప్పదు. కేంద్ర ప్రభుత్వానికి అంశాల వారీగా మద్దతిస్తామని గతంలో జగన్ ప్రకటించారు. అయితే ఇక ముందు ఎలాంటి అంశమైనా వైసీపీ తరపున ఆయన వ్యతిరేకించాల్సిందే. లేకపోతే బీజేపీతో సంబంధాలు కొనసాగుతున్నాయని ఇండి కూటమి నేతలు అనుకుంటారు. కేంద్రంలో బీజేపీపై పోరాటంలో ఇండీ కూటమికి జగన్ మద్దతు ప్రకటించకపోతే.. ఆయనకు ఇక ఏ విషయంలోనూ ఆ వైపు నుంచి సపోర్టు రాదు. ఇప్పుడు మద్దతు ప్రకటించినందుకు వారు చింతించే అవకాశం ఉంది. ఎన్డీఏ కూటమి వైపు నుంచి ఆయన ఎలాగూ సపోర్టు రాదు. కూటమిలో టీడీపీ, జనసేన ఉంటాయి. అయితే బీజేపీతో ఆయన పరోక్ష సంబంధాలను కొనసాగించవచ్చు. కానీ దాని వల్ల ఆయనకు ఎంత లాభం జరుగుతుందో అంచనా వేయడం కష్టమే. అంటే.. ఢిల్లీ ధర్నాలో తనకు సంఘీభావం తెలిపిన ఇండీ కూటమిని కాదని.. ఆయన బీజేపీకే మద్దతుగా ఉంటానని వెళ్తే.. రెంటికి చెడ్డ రేవడి అవుతారు. ఢిల్లీలో ధర్నా చేయాలని జాతీయ పార్టీల మద్దతు కోరాలని జగన్ ఎందుకు అనుకున్నారో కానీ.. ఇప్పుడు ఆయన ఇరుక్కుపోయారని వైసీపీ నేతలు భావిస్తున్నారు. ఏపీలో ఉన్నది ఎన్డీఏ ప్రభుత్వం. ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇండీ కూటమి నేతల్ని పిలిచి ధర్నా చేశారు. కాబట్టి ఆయనను బీజేపీ ఎంత మాత్రం ఇక ఆదరించదు. పైగా .. చంద్రబాబు ప్రభుత్వంపై .. జాతీయ స్థాయి నేతల్ని పిలిచి చెప్పాల్సిన అవసరం లేదు. రాష్ట్ర స్థాయిలో పోరాడవచ్చు. కాని జగన్ ఢిల్లీ ధర్నా ఎ÷–లాన్ చేసుకున్నారు. ఇప్పుడు ఖచ్చితంగా ఆయన ఓ స్టాండ్ తీసుకోవాల్సిన సమయం వచ్చింది. ఎన్నికలు ముగిసి రెండు నెలలే కాబట్టి.. దాదాపుగా ఇంకా నాలుగున్నరేళ్లకుపైగానే ఆయన బీజేపీ కి వ్యతిరేకంగా పోరాడాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆయన వెనక్కి తగ్గలేరు.

## పరీక్ష తేదీలు అన్యాయంగా ఉన్నాయి

- సింగరేణి సీఎండీకి వినతి

(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి)

సింగరేణి (ఎస్సిఎల్) నోటిఫికేషన్ 02/2024కి సంబంధించి, ఆగస్టు 6, 7 తేదీల్లో షెడ్యూల్ చేయబడిన పరీక్షా తేదీలు మానేజ్మెంట్ ట్రైనీ ఈ అండ్ ఎం పరీక్ష కొరకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు అన్యాయంగా ఉన్నది. నోటిఫికేషన్ 02/2024కి సంబంధించి, ఎస్సిసిఎల్ వెబ్సైట్లో అందించిన పరీక్ష షెడ్యూల్ ప్రకారం,ఎంటి ఈ అండ్ ఎం మరియు అసిస్టెంట్ ట్రైనీ ( మెకానికల్) ఒకటే రోజున ఉన్నాయి. డిప్లొమా తో పాటు బిటెక్ చేసిన వందలాది అభ్యర్థులు రెండు పోస్ట్ లకు అప్లై చేసి వేచి ఉన్నారు. ఆ రెండు పరీక్షలు ఒకటే రోజున నిర్వహించడం వల్ల వందలాది మంది అభ్యర్థులు ఒక పరీక్ష కే పరిమితం అవ్వాల్సిన స్థితి వచ్చినది.ఆ రెండు పరీక్షలను ఒకేరోజు నిర్వహించడం అన్యాయం. దయచేసి మా అభ్యర్థనను పరిగణించండి. ఎస్సిఎల్ వెబ్సైట్లో జూలై 15న కొత్తగా చేర్చబడిన సిలబస్ను అప్లోడ్ చేయడంతో మేనేజ్మెంట్ ట్రైనీ ఈ అండ్ ఎం సిలబస్ ఏమిటి అని అవగాహన వచ్చినది.కానీ సిలబస్ తెలిపిన 20 రోజులలోనే పరీక్ష నిర్వహిస్తే ఈ తక్కువ సమయంలో సిలబస్ను పూర్తి చేయడానికి ఔత్సాహికులకు ఇది తీవ్రమైన పరిస్థితిని కలిగిస్తుంది. మానేజ్మెంట్ ట్రైని,ఈ అండ్ ఎం పరీక్ష కు సిద్ధం కావడానికి కనీసం ఇంకొక 2 వారాల సమయం ఇవ్వాలని తాము అభ్యర్థిస్తున్నామని సింగరేణి సీఎండీ, ఐఆర్ఎస్ అధికారి ఎన్. బలరాంకు వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మహారాష్ట్రకు భారీ వర్ష హెచ్చరిక

- ఐఎండి హెచ్చరికలతో పుణెలో పాఠశాలల మూసివేత

**ముంబయి, జూలై25 (జనంసాక్షి) :** మహారాష్ట్రను వర్షాలు ముంచెత్తుతున్నాయి. గురువారం భారీ వర్షాలు కురిసే అవకాశం వుండటంతో భారత వాతావరణ శాఖ మహారాష్ట్రకు, పూణెలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండి హెచ్చరికల మేరకు పూణెలోని పింపి, చించ్వాడ్, భోర్, వెల్హా, మావల్, ముల్షీ, హవేలా, ఖడక్వాస్లా ప్రాంతాల్లోని పాఠశాలలను మూసివేయాలని జిల్లా మెజిస్ట్రేట్ సుహాస్ దివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, తప్పనిసరి అయితేనే బయటకు వెళ్లాలని ఆయన ప్రజలకు సూచించారు. గురు, శుక్రవారాల్లో ముంబై నగరంలోని శివారు ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని బృహన్ ముంబై మెట్రోపాలిటన్ కౌన్సిల్ (బిఎంసి) తెలిపింది. ఇక జులై 24 ఉదయం 8 గంటల నుండి 25వ తేదీ ఉదయం 8 గంటలకు వరకు 44 మి.మీ వర్షపాతం నమోదైంది. తూర్పు శివారు ప్రాంతాల్లో 90 మి.మీ, పశ్చిమ శివారు ప్రాంతాల్లో 88 మి.మీ వర్షపాతం నమోదైందని బిఎంసి తెలిపింది. ఃూగా, పూణెలో బుధవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా ఏక్తా నగరి, విఠల్ నగర్ ప్రాంతాల్లోని ఇళ్లు, భవనాల్లోకి నీరు చేరింది. దీంతో పూణె అగ్నిమాపక సిబ్బంది పడవల సహాయంతో ఇళ్లలోని ప్రజలను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో 40 క్యూసెక్కుల నీటిని ముఠా నదిలోకి పూనె అధికార యంత్రాంగం విడుదల చేసింది. ఈరోజు ఉదయం నాలుగు గంటలకు 27203 క్యూసెక్కుల వేగంతో నీటిని విడుదల చేశారు. కుండపోత వర్షాలు కురుస్తున్న కారణంగా ఈ నది ఒడ్డున నివసించే వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పాల్ఘర్, రత్నగిరి, సింధుదుర్గ్ మీదుగా గంటకు 50 నుండి 60 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని జిల్లా సమాచార కార్యాలయం అంచనా వేసింది. అలాగే కొల్హాపూర్, పూణెలోని ఘాట్ ప్రాంతల్లోకూడా గాలులు వీచే అవకాశం ఉంది. వర్షాల కారణంగా ముంబైలోని అంధేరి సబ్వేపై రాకపోకలను అధికారులు మూసివేశారు. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం మొత్తానికి నీటిని సరఫరా చేసే 7 సరస్సుల్లో ఒకటైన విహార్ సరస్సు గురువారం తెల్లవారుజామున 3.50 గంటలకు పొంగిపొర్లింది.

## స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



**వరంగల్ బ్యూరో, జూలై 25 (జనం సాక్షి) :** సమాజంలో ఉన్నతమైన స్థానాల్లో ఉన్నవారు హుందాగా వ్యవహరించాలని, ప్రభుత్వ వ్యవస్థలో భాగమైన వారు ఈ విషయంలో మరింత జాగ్రత్తగా వుండాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. ఆలిండియా సర్వీసుల్లో వికలాంగుల కోటా పై తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ, ఐఎఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ చేసిన వ్యాఖ్యల పట్ల మంత్రి కొండా సురేఖ స్పందించారు. దివ్యాంగులపై స్మితా సభర్వాల్ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. ఒక ఉన్నతమైన స్థానంలో ఉండి, పర్యవసనాలను ఆలోచించకుండా మాట్లాడటం తగదని మంత్రి సురేఖ సూచించారు. తమ మాటల ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం వెళుతుందో దృష్టిలో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు.శారీరక సామర్థ్యం కంటే మానసిక సామర్థ్యమే ముఖ్యమని స్మితా సభర్వాల్ గుర్తించాలని మంత్రి సురేఖ అన్నారు. గొప్ప సంకల్ప బలంతో శారీరక దుర్భలత్వాన్ని జయించి ఈ ప్రపంచానికి స్ఫూర్తిప్రదాతలుగా నిలిచిన మహెూన్నత వ్యక్తులెందరో ఉన్నారనే విషయాన్ని స్మితా సభర్వాల్ గమనించాలని మంత్రి సురేఖ సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో వివక్షకు తావులేదని, అన్ని వర్గాల హక్కులకు రక్షణ ఉంటుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## పట్టపగలే బెదిరించి దోచేస్తున్న దొంగలముఠా అరెస్ట్



**నిర్మల్ బ్యూరో, జూలై 25 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో పట్టపగలే ఒక వ్యక్తిని బెదిరించి రూపాయలు 45 వేలు దొంగిలించిన ముఠాను నిర్మల్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలికెళ్తే మామడ మండలంలోని తాంద్ర గ్రామానికి చెందిన రాథోడ్ గణేష్ గురువారం తన కుటుంబీకుల వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చాడు.పాత బస్టాండ్ వైన్ షాప్ వద్ద నిల్చున్నాడు .ఒంటరిగా గణేష్ ను గమనించిన ఓ దొంగల ముఠా రాథోడ్ గణేష్ వద్దకు వచ్చి అతనిని బెదిరించి ఆటోలో ఎక్కించుకొని వెళ్లి శ్యామ్ ఘాట్ వద్ద అతని కొట్టారు. అతని దగ్గర ఉన్న రూ.45 వేలు, ఒక సెల్ ఫోన్ లాక్కొని పారిపో యారు. ఈ సందర్భంగా బాధితుడు రాథోడ్ గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన పట్టణ సిఐ స్థానిక డిఎస్పి సహాయంతో ఆ దొంగల మూతను పట్టుకున్నారు. నిందితుల నుండి రూ.30,000 ఒక సెల్ ఫోన్ను స్వాధీన పరచుకున్నారు. ఆ దొంగల ముఠాలో నలుగురు మహిళలు ఇద్దరు పురుషులు ఉన్నారని వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపుతున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

## బిజెపి ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే అన్యాయంపై పోరాడాలి



- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**భువనగిరి బ్యూరో జూలై 25 (జనం సాక్షి) :** బిజెపి ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే తెలంగాణకు జరిగిన అన్యాయంపై పోరాటం చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సవాల్ చేశారు. రాష్ట్రంలో బిజెపికి 8 మంది ఎంపీల లో ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉండి బడ్జెట్లో రాష్ట్రానికి న్యాయం చేయలేకపోయారని విమర్శించారు. ప్రధాని కుర్చీ కాపాడుకొనేందు కే బడ్జెట్లో నితీష్ చంద్రబాబు రాష్ట్రాలకు నిధులు కేటాయించారని ఆరోపించారు. విభజన చట్టం 2014లో ఉంటే అప్పటి నుంచి లేని కేటాయింపులు ఈసారి బడ్జెట్లోనే వారికి ఎందుకు చేశారు అని ప్రశ్నించారు.రాష్ట్ర ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేసిన బిజెపి ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్ సభ ఎన్నికల్లో బిజెపికి సహకరించిన బీఆర్ఎస్ నేతలు , ఇప్పుడు కాంగ్రెస్ పై విమర్శలు చేయటం అర్థరహితం అన్నారు.

## ఉచిత ఐవిఎఫ్ క్యాంప్ విజయవంతం



**కరీంనగర్ బ్యూరో, జులై 26 (జనంసాక్షి) :** వరల్డ్ ఐవిఎఫ్, ఎంబ్రియాలజీ డే ను పురస్కరించుకొని నేడుసీనియర్ గైనకాలజిస్ట్ , ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డా.బంగారి రజనీ ప్రియదర్శిని ఆధ్వర్యంలో స్థానిక రజనీ ఫెర్టిలిటీ సెంటర్ కరీంనగర్లో ఉచిత ఐవిఎఫ్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత ప్రో.డా.బంగారి స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ... నేడు ప్రపంచంలో సుమారు ఎనిమిది నుండి పది శాతం మంది పిల్లలు లేని సమస్యతో బాధపడుతున్నారని మన భారత దేశంలో సుమారు పదిహేను నుండి ఇరవై అయిదు శాతం ప్రజలు ఈ సమస్యతో బాధపడుతున్నారని రాబోయే కాలంలో ఇది ప్రధాన సమస్యగా తయారవుతోందని అన్నారు. ఈ సమస్యకు ప్రధాన కారణాలు ఆలస్యంగా వివాహం చేసుకోవడం, పిల్లలు ఆలస్యంగా కనడం, వృత్తి పరమైన కారణాలు, జంక్ ఫుడ్ తినడం, స్థూలకాయం, ఆల్కహాల్ తీసుకోవడం, ప్రోగ తాగడం, వాతావరణ మార్పులని అన్నారు. ఈ సమస్యను స్త్రీ, పురుషులు సమాన భాధ్యత అని అన్నారు. ఉత్తర తెలంగాణాలోనే అత్యధిక సక్సెస్ రేటు కలిగి ఉండడంలో మా సిబ్బంది పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెనే హాస్పిటల్స్ చైర్మన్ ప్రో. డా. బంగారి స్వామి మాట్లాడుతూ... రజనీ ఫెర్టిలిటీ సెంటర్ లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన ల్యాబ్ ఉందని డా. రజనీ ప్రియదర్శిని నిరంతరం ఒక విద్యార్థినిలా నేర్చుకుంటూ ఐ వి ఎఫ్ చికిత్సా విధానంలో క్రొత్త పద్ధతులను పాటిస్తూ పిల్లలు లేని ఎంతో మంది దంపతుల కలలను సాకారం చేస్తున్న ఆమె కృషిని అభినందించారు. ఇన్ఫర్టిలిటి చికిత్సా అనేది ఎంతో కృషితో ఒక సమిష్టి కృషి వల్ల విజయవంతం అవుతుందని అన్నారు. ఈ చికిత్స కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుండి వస్తున్న వారికి నివాస, వసతి ఉచితంగా అందించే విధంగా ఏర్పాట్లు చేయబోతున్నామని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి సుమారు 120 మంది హాజరైనారు. ఈ కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు డా. దినకర్ తాటిమట్ల, జనరల్ ఫీజీషియన్ డా.నిఖిల్ లక్ష్మణ్, ఎంబ్రియాలజిస్ట్ డా.ప్రదీప్, అనస్థీషియా వైశు ్యలు డా.దామోదర్ రెడ్డి, డా.మౌనిక, డా. అవనిజ, బయోమెడికల్ ఇంజనీర్ రతన్, హాస్పిటల్ జనరల్ మేనేజర్ అరవింద్ బాబు , హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.















Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370